www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 303
బుధవారం | 31-1-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 11.37 తదుపరి షష్ఠి; నక్షత్రం: హస్త రా. 1.09 తదుపరి చిత్త
వర్జ్యం: ఉ. 7.34-9.22; దుర్ముహూర్తం: మ. 12.07-12.52; అమృతఘడియలు: రా. 6.23-8.11; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.06
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీఆర్ఎస్ చచ్చిన పార్టీ

రాష్ట్ర ప్రజలు దాన్ని బొంద పెట్టేశారు.. ఆ పార్టీకి ఓటేస్తే మూసీలో వేసినట్టే


పంచాయతీరాజ్ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ నిలువరింత కాంగ్రెస్‌కే సాధ్యం.. బీఆర్ఎస్, బీజేపీవి కుమ్మక్కు పాలిటిక్స్
- కాంగ్రెస్ ఉండడమే మంచిది కాదన్న ధోరణిలో బిల్లా, రంగా మాటలున్నయ్
- మోదీని మళ్లీ ప్రధానిని చేయడమే మీ చీకటి ఒప్పందమా?: రేవంత్ ధ్వజం
- కేంద్రంలో కాంగ్రెస్ గెలిస్తేనే విభజన చట్టంలోని హామీలన్నీ అమలవుతాయి
- అందుకు రాష్ట్రంలో 17 సీట్లూ నెగ్గాలి.. ప్రదేశ్ ఎన్నికల కమిటీ భేటీలో సీఎం
- సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశించేవారి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం
- ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరించనున్నట్టు వెల్లడి
- జనరల్ స్థానాలకు రూ.50 వేలు రుసుము.. రిజర్వుడు సీట్లకు రూ.25 వేలు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చచ్చిందని, ఆ పార్టీని తెలంగాణ ప్రజలు బొంద పెట్టేశారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటేస్తే మూసీలో వేసినట్లేనన్నారు. కేటీఆర్, హరీశ్ తమ ఉనికి కోసం, మనుగడ కోసమే కాంగ్రెస్ పార్టీపై దాడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాల్సింది దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీనని.. కానీ బిల్లా, రంగాలు ఆ పార్టీని పల్లెత్తు మాట అనకుండా కాంగ్రెస్‌పైనే పరుష పదజాలం వాడుతున్నారని, అసలు కాంగ్రెస్‌పార్టీ ఉండడమే మంచిది కాదన్న ధోరణిలో మాట్లాడుతున్నారని కేటీఆర్, హరీశ్‌పై నిప్పులు చెరిగారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా నిలవరించేందుకు వారు చేసే ప్రయత్నం.. మోదీని మూడోసారి ప్రధానిని చేయడానికి చేసుకున్న చీకటి ఒప్పందమన్న సంగతి ప్రజలు అర్థం చేసుకోలేరని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. బీజేపీని, మోదీని నిలవరించడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని.. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తేనే విభజన చట్టంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నూటికి నూరుపాళ్లు అమలవుతాయని రేవంత్ స్పష్టం చేశారు. ఆ హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీని 17 లోక్‌సభ సీట్లలోనూ గెలిపించాలని రాష్ట్ర ప్రజలు, ప్రజాస్వామిక శక్తులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో

మిగతా 13వ పేజీలో...

60 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు?

- ఏప్రిల్ 7 లేదా 8 తేదీల్లో రాష్ట్రంలో పోలింగ్: రేవంత్
- కనీవినీ ఎరుగని రీతిలో ఇంద్రవెల్లి బహిరంగ సభ: టీపీసీసీ

ఇంటింటికీ నల్లా నీళ్లు.. బాధ్యత సర్పంచులకు

- తాగునీటి కోసం నియోజకవర్గానికి రూ.కోటి
- వేసవిలో ఎద్దడి తలెత్తవద్దు.. నదులతోపాటు
- కొత్త రిజర్వాయర్లనూ వినియోగించుకోవాలి
- తాగునీరందని ప్రాంతాలపై సమగ్ర సర్వే
- అనుసంధానం లేని గ్రామాలకు రోడ్లు వేయాలి
- పంచాయతీరాజ్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

13



సోమేశ్ భూములపై సర్కారు ఆరా!

- ఫార్మాసిటీకి కిలోమీటర్ దూరంలో 25 ఎకరాల కొనుగోలు
- రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నపుడే భార్య పేర రిజిస్ట్రేషన్
- పక్కనే సన్నిహిత కుటుంబానికి 123 ఎకరాలు.. సోమేశ్ కుటుంబానికి వారం తేడాతో వాటి రిజిస్ట్రేషన్.. ఏదో మతలబు!

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆస్తుల చిట్టా వివాదం చెలరేగుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని విషయాల్లో చక్రం తిప్పిన సోమేశ్ కుమార్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడానికి

మిగతా 3వ పేజీలో...

రెరా ఇన్‌చార్జి కార్యదర్శి
శివ బాలకృష్ణ సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం 12
- 8 రోజులపాటు ఏసీబీ కస్టడీకి అనుమతి

ఆగిన కోదండ ప్రమాణం

గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీల భర్తీపై హైకోర్టు స్టేటస్‌కో!



- కోదండరాం, అలీఖాన్ నియామక జీవోపై బీఆర్ఎస్ సవాలు
- వాళ్లిద్దర్నీ ప్రతివాదులుగా చేర్చాలంటూ మధ్యంతర పిటిషన్
- నియామక నోటిఫికేషన్‌పై వచ్చే నెల 8 వరకు యథాతథ స్థితి
- దాంతో నిలిచిపోనున్న ఇద్దరు ఎమ్మెల్సీల ప్రమాణం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీల నియామక జీవోపై యథాతథ స్థితి(స్టేటస్ కో)ని విధిస్తూ హైకోర్టు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 8న తదుపరి విచారణ చేపట్టే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపింది. దీంతో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్‌ల ప్రమాణ స్వీకారం ప్రస్తుతానికి నిలిచిపోనుంది. గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయడానికి గవర్నర్ ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్లు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణ నూతన ఎమ్మెల్సీల నియామక జీవోను సవాల్ చేయడంతో పాటు సదరు నూతన ఎమ్మెల్సీలను వ్యక్తిగతంగా ఇందులో ప్రతివాదులుగా చేర్చాలని మధ్యంతర పిటిషన్‌లు దాఖలు చేశారు. మధ్యంతర పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫున

మిగతా 12వ పేజీలో...



12

కోదండరాంపై
కేసీఆర్ కుట్ర
- ఆయనది నీచ రాజకీయం
- నేడు రాష్ట్రంలో నిరసనలు
- తెలంగాణ జనసమితి వెల్లడి

కులగణనకు 160 కోట్లు!

సామాజిక, ఆర్థిక, విద్య కుల సర్వే పేరిట ప్రక్రియ

- 6-8 నెలల సమయం పడుతుందని అంచనా
- క్యాబినెట్ ఆమోదం తర్వాత అసెంబ్లీలో ప్రకటన
- సర్వే కోసం ప్రత్యేకంగా ఓ కమిషన్ ఏర్పాటు



హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కులగణనకు రంగం సిద్ధమైంది. ఆ ప్రక్రియ నిర్వహణ వ్యయం, వ్యవధిపైనా సర్కారు ఒక అంచనాకు వచ్చింది. రూ.150-160 కోట్ల మేర ఖర్చు కావచ్చని, 6 నుంచి 8 నెలలు పట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. సామాజి ఆర్థిక, విద్య కుల సర్వే పేరుతో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్టు సమాచారం. కులగణన సర్వే మొదలు కావాలంటే అంతకుముందు మంత్రివర్గం దీనికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఆ తర్వాత అసెంబ్లీలో ప్రకటిస్తారు. సర్వే కోసం ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించి, దానికి నిబంధనలను నిర్దేశిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే సర్వే పని మొదలవుతుంది. రాష్ట్రంలో కులగణన నిర్వహించి, స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ప్రస్తుతమున్న 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించింది. ఆ హామీకి కట్టుబడి ఉన్నామని, కులగణనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. కులగణనతో ఎస్సీ, ఎస్టీ ఉపకులాల జనాభా కూడా తేలనుండటం ఇది ఎస్సీ వర్గీకరణకు కూడా దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. కాగా, 2015లో కర్ణాటక ప్రభుత్వం కులగణన సర్వే చేయగా రూ.162 కోట్లకు పైగా ఖర్చయినట్టు సమాచారం. అప్పుడు ఆ రాష్ట్రంలో జనాభా 6.36 కోట్లకు పైగా ఉంది. ఇక 12.67 కోట్ల జనాభా ఉన్న బిహార్‌లో అక్కడి ప్రభుత్వం నిర్వహించిన సర్వేకు దాదాపు రూ.500 కోట్ల మేర వ్యయం అయినట్టు తెలిసింది.


మనిషి మెదడులో అమర్చే ఇంప్లాంట్ ఇదే

మనిషి మెదడులో మస్క్ చిప్

మెదడు పొరల్లోని ఆలోచనలనే ఆదేశాలుగా మలిచి.. ఫోన్, కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుసంధానం చేసి, వాటిని నియంత్రించే వైర్‌లెస్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) ఇంప్లాంట్‌ను తొలిసారి ఒక వ్యక్తి మెదడులో అమర్చామని టెక్ బిలియనీర్ ఈలన్ మస్క్ ప్రకటించారు. ఈ తరహా ప్రయోగాల కోసం మస్క్ 2016లో ప్రారంభించిన 'న్యూరాలింక్' అనే స్టార్టప్ ఈ ఇంప్లాంట్‌ను అభివృద్ధి చేసింది.

- 'న్యూరాలింక్' సంస్థ అమర్చినట్టు తెలిపిన టెక్ బిలియనీర్
- ఫోన్లు, కంప్యూటర్లకు వైర్‌లెస్‌గా అనుసంధానమై ఆలోచనతోనే వాటిని నియంత్రించగలిగే బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్
- పక్షవాతం, ఇతర సమస్యలతో మంచానికే పరిమితమైనవారి ఆలోచనలను వేగంగా కంప్యూటర్‌కు ప్రసారం చేసే వీలు

మోటార్ న్యూరాన్ డిసీజ్ కారణంగా వీల్‌ఛైర్‌కే పరిమితమైన ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, కాస్మాలజిస్ట్ స్టీఫెన్ హాకింగ్ గుర్తున్నారా? కండరాలను నిర్వీర్యం చేసే వ్యాధి కారణంగా శరీరమంతా చచ్చుబడిపోయినా.. వీల్‌ఛైర్‌లో కూర్చుని తన బుగ్గ కండరాన్ని కదలించడం ద్వారా ఎన్నో అద్భుతమైన ప్రతిపాదనలను, సిద్ధాంతాలను ప్రపంచానికి అందించారాయన! కానీ అది చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఆయన వీల్‌ఛైర్‌కి అమర్చిన కంప్యూటర్ తెరపై పదాలు వరుసగా వెళ్తుంటే.. తాను అనుకున్న పదం వచ్చినప్పుడు బుగ్గ కండరాన్ని కదల్చడం ద్వారా తాను చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పేవారాయన. అంత కష్టం లేకుండా.. ఆయన మెదడులో ఒక ఇంప్లాంట్‌ను అమర్చి, అది వైర్‌లెస్‌గా ఏ కంప్యూటర్‌కో, ఫోన్‌కో అనుసంధానమైపోయి.. ఆయన మెదడులో వచ్చిన ఆలోచనలను అక్షర రూపంలోకి మార్చే

మిగతా 2వ పేజీలో...

హెటిరో భూమి లీజు ఆగింది

- జీవో 140ని నిలిపేస్తూ జీవో 12 విడుదల
- హైకోర్టు తీర్పును ఉటంకిస్తూ నిర్ణయం
- హైటెక్‌సిటీ వద్ద బీఆర్ఎస్ ఎంపీ పార్థసారధిరెడ్డి ట్రస్ట్‌కు 15 ఎకరాలు.. 3
- నామమాత్ర లీజుకిచ్చిన కేసీఆర్ సర్కారు
- హైకోర్టు రద్దు చేసినా మళ్లీ కేటాయింపు
- ఆ జీవోను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వు



12

అధికారికంగా గద్దర్ జయంతి

- నేడు రవీంద్ర భారతిలో కార్యక్రమం
- తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహానికి స్థలం

నాబార్డు రుణ ప్రణాళిక 2.80లక్షల కోట్లు

- 2024-25లో పంట రుణాల లక్ష్యం రూ. 81,478 కోట్లు
- వ్యవసాయ యాంత్రీకరణకు 5,099 కోట్ల కేటాయింపులు
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 1,29,636 కోట్లు
- స్టేట్ ఫోకస్ పేపర్‌ను విడుదల చేసిన మంత్రి తుమ్మల 14
- వ్యవసాయ ప్రగతికి బ్యాంకర్లు సహకరించాలని వినతి


రాంచీ చేరుకున్న అనంతరం ఎమ్మెల్యేలతో సొరెన్

రాంచీలో హేమంత్ ప్రత్యక్షం

30 గంటల 'అదృశ్యం' తర్వాత రాష్ట్ర రాజధానికి ఝార్ఖండ్ సీఎం 2

- ఎమ్మెల్యేలతో భేటీ.. పాల్గొన్న సీఎం భార్య కల్పన
- అందరూ రాజధానిలోనే ఉండాలని సూచన
- పరిస్థితులపై సీఎస్, డీజీపీతో గవర్నర్ సమావేశం
- నేడు హేమంత్ సోరెన్‌ను ప్రశ్నించనున్న ఈడీ
- అరెస్టు చేస్తే.. ముఖ్యమంత్రిగా సతీమణి కల్పన!

చండీగఢ్ కార్పొరేషన్ బీజేపీ చేతికి!

నాటకీయ పరిణామాల మధ్య ఎన్నిక

- బీజేపీకి 16, ఆప్, కాంగ్రెస్ కూటమికి 20 ఓట్లు
- 8 విపక్ష ఓట్లు చెల్లవన్న ప్రిసైడింగ్ అధికారి
- ఆధిక్యం ఉన్నప్పటికీ ఓడిన ఆమ్‌ఆద్మీ అభ్యర్థి

చండీగఢ్, జనవరి 30: చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో మ్యాజిక్ జరిగింది. ఇండియా కూటమిగా బరిలో దిగిన ఆప్, కాంగ్రెస్ పార్టీలకు కలిపి 20 మంది(13+7) కార్పొరేటర్లు ఉన్నా బీజేపీకి చెందిన మనోజ్ కుమార్ సోలంకి 16 ఓట్లతో మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆప్ అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌కు 12 ఓట్లు

మిగతా 2వ పేజీలో...


ఓటమితో కుప్పకూలి రోదిస్తున్న ఆప్ అభ్యర్థి కుల్‌దీప్



నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి

- ఫిబ్రవరి 9వ తేదీ వరకు సెషన్స్ నిర్వహణ
- ప్రస్తుత లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు
- లోక్‌సభలో రేపు మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక శాఖ మంత్రి నిర్మల 2
- కిసాన్ సమ్మాన్ 50 శాతం పెంపునకు చాన్స్
- ప్రతి సమస్యపై చర్చకు సిద్ధం: కేంద్ర ప్రభుత్వం
- అఖిలపక్ష భేటీలో ఫ్లోర్ లీడర్లకు వెల్లడి
- 11 మంది రాజ్యసభ ఎంపీల సస్పెన్షనూ ఎత్తివేత

ఉమ్మడి కార్యాచరణ కొరవడిన ప్రతిపక్ష కూటమి

బీజేపీ నేత హత్య కేసులో
15 మందికి మరణ శిక్ష
2

- కుటుంబ సభ్యుల ఎదుటే మారణకాండ
- ముద్దాయిలంతా పీఎఫ్ఐ సభ్యులు
- కేరళ కోర్టు తీర్పు.. 2021లో ఘటన


2

వైద్య కళాశాలల్లో ఫ్యాకల్టీకి 75% హాజరు కచ్చితం

- కాలేజీ వేళల్లో ప్రైవేటు ప్రాక్టీస్ కుదరదు
- జాతీయ మెడికల్ కమిషన్ ఆదేశాలు

బీజేపీ నేత రంజిత్ హత్య కేసులో
15 మందికి మరణ శిక్ష



అలప్పుజ, జనవరి 30: కేరళకు చెందిన బీజేపీ ఓబీసీ నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో 15 మందికి మరణశిక్ష విధిస్తూ మంగళవారం ఇక్కడి కోర్టు తీర్పు చెప్పింది. దోషులంతా నిషేధిత ఇస్లామిస్ట్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కి చెందిన వారు. మవిలెక్కిరలోని అదనపు జిల్లా జడ్జి వి.జి.శ్రీదేవి ఈ శిక్షలు విధించారని స్పెషల్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ జి పడిక్కల్ తెలిపారు. మొత్తం 15 మంది ముద్దాయిలకు గానూ 14 మందిని కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. అనారోగ్యం కారణంగా మరొకరు ఆస్పత్రిలో ఉన్నారని తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయిన శ్రీనివాసన్‌ను 2021 డిసెంబరు 19న అతని ఇంట్లోనే కుటుంబసభ్యుల ముందే ముద్దాయిలు హత్య చేశారు. కుటుంబ సభ్యుల సమక్షంలోనే హత్య చేయడం క్రూరమైన నేరమని, దీన్ని అత్యంత అరుదైనదిగా గుర్తించి మరణ శిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ కోరింది. నిందితులంతా శిక్షణ పొందిన హంతకుల ముఠాకు చెందిన వారని తెలిపింది. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం గరిష్ఠ శిక్ష విధించింది. ఈ తీర్పుపై శ్రీనివాసన్ భార్య సంతృప్తి వ్యక్తం చేశారు.

మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీకి 75% హాజరు మస్ట్

న్యూఢిల్లీ, జనవరి 30: వైద్య కళాశాలల్లోని అధ్యాపక సిబ్బంది కాలేజీ వేళల్లో ప్రైవేటు ప్రాక్టీస్ చేయకూడదని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశించింది. వారికి 75% హాజరును తప్పనిసరి చేసింది. ఘోస్ట్ ఫ్యాకల్టీ సమస్యను పరిష్కరించే దిశగా కమిషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. గతవారం విడుదల చేసిన "పీజీ కోర్సులకు కనీస ప్రమాణాలు 2023 (పీజీఎంఎస్ఆర్-2023)"కు సంబంధించిన మార్గదర్శకాల్లో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. టీచింగ్ సిబ్బంది పూర్తి సమయం అందుబాటులో ఉండాలని, కాలేజీ నడుస్తున్న సమయంలో ప్రైవేటుగా ప్రాక్టీసు చేయరాదని స్పష్టం చేసింది. మొత్తం పనిదినాల్లో 75శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. ఏడాది పొడవునా ఆసుపత్రుల్లో 80శాతం పడకలను ఇన్‌పేషెంట్ కేర్ అవసరమయ్యే రోగులతో భర్తీ చేయాలని, పీజీ శిక్షణ విభాగంలోని మొత్తం పడకల్లో కనీసం 15శాతం అదే విభాగానికి చెందిన ఐసీయూ/హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్‌డీయూ) పడకలు ఉండాలని ఆదేశించింది.

భారత్‌లో పెరుగుతున్న అవినీతి

న్యూఢిల్లీ, జనవరి 30: భారతదేశంలో అవినీతి ఏడాది క్రితం కంటే స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయంగా రూపొందించిన అవినీతి వ్యతిరేక సూచీలో భారత్ ఏడాది క్రితం కంటే 8 స్థానాలు దిగజారి 93వ స్థానానికి పడిపోయింది. 2023వ సంవత్సరంలో 180 దేశాలలో అవినీతికి సంబంధించి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికను రూపొందించారు. ఇందులో ఆయా దేశాలలో ఉన్న అవినీతి తీవ్రతను బట్టి 0-100 వరకు మార్కులు కేటాయించారు. 0 మార్కులు వచ్చాయంటే, ఆ దేశంలో అవినీతి అత్యధికంగా ఉన్నట్టు. ఇందులో భారతదేశం 39 మార్కులు సాధించి అవినీతి వ్యతిరేక సూచీలో 93వ ర్యాంకు సాధించింది. అవినీతి వ్యతిరేక సూచీలో డెన్మార్క్ 1వ స్థానంలో నిలువగా, ఫిన్లాండ్ 2వ స్థానం సాధించింది.

మాల్దీవులకు భారత పర్యాటకుల ఝలక్

న్యూఢిల్లీ, జనవరి 30: మాల్దీవుల దేశంలో పర్యటించే భారతీయుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇరుదేశాల మధ్య ఏర్పడిన విభేదాలే దీనికి కారణం. గతేడాది మాల్దీవులను అత్యధిక పర్యాటకులు సందర్శించిన దేశాల జాబితాలో భారత్ తొలి స్థానంలో నిలువగా, ఈ ఏడాది జనవరి 28వ తేదీ నాటికి భారత్ 5వ స్థానానికి పరిమితమైంది. మాల్దీవుల పర్యాటక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి 28 నాటికి మాల్దీవులను అత్యధికంగా సందర్శించిన పర్యాటకుల సంఖ్య పరంగా రష్యా(18,561 మంది) తొలి స్థానానికి చేరింది. తర్వాతి స్థానాల్లో ఇటలీ, చైనా, బ్రిటన్, భారత్(13,989) నిలిచాయి.

ఇమ్రాన్ ఖాన్‌కు మరో పదేళ్ల జైలు

ఇస్లామాబాద్, జనవరి 30: మరో తొమ్మిది రోజుల్లో పాకిస్థాన్ పార్లమెంటు అయిన నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న సమయంలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ (71)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఖైదులో ఉన్న ఆయనకు మంగళవారం ప్రత్యేక కోర్టు మరో పదేళ్ల జైలు శిక్ష విధించింది. అధికారిక రహస్యాలను బహిర్గతం చేశారన్న నేరంపై ఈ శిక్ష వేసింది. ఆయనతో పాటు విదేశాంగ శాఖ మాజీ మంత్రి షా మహమ్మద్ ఖురేషీ (67)కి కూడా ఇంతే శిక్ష విధించింది. దాంతో ఇంకో అయిదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను వారిద్దరూ కోల్పోయారు.

'పళని'లో అన్యమతస్థుల ప్రవేశం నిషిద్ధం

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని సుప్రసిద్ధ శైవక్షేత్రం పళని దండాయుధపాణి ఆలయంలో హిందువులు మినహా అన్యమతస్థులు ధ్వజస్తంభాన్ని దాటి లోపలకు వెళ్లేందుకు అనుమతించకూడదని మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వు జారీ చేసింది. ఇటీవల ఆ ఆలయంలో 'అన్యమతస్థులు ఆలయంలో ప్రవేశించడానికి అనుమతిలేదు' అనే ప్రకటన బోర్డును ఆలయ నిర్వాహకులు తొలగించారు. దీన్ని వ్యతిరేకిస్తూ పళనికి చెందిన సెంథిల్‌కుమార్ హైకోర్టుకు వెళ్లారు. హిందూ దేవాదాయ ఆలయ ప్రవేశ చట్టం 1947 ప్రకారం హిందువుల ఆలయాలల్లో అన్యమతస్థుల ప్రవేశానికి తావులేదని, బోర్డును తొలగించడం వల్ల ఇతర మతస్థులు ఆ ఆలయంలో ప్రవేశించవచ్చునన్న అపోహ ప్రజల్లో కలిగే అవకాశం ఉందని వాదించారు. ఆయన వాదనతో కోర్టు ఏకీభవించింది.

శివలింగం దొరికిన చోట సర్వేకు అనుమతివ్వండి

న్యూఢిల్లీ, జనవరి 30: వారాణసిలోని జ్ఞానవాపీ మసీదు ప్రాంగణంలో 'శివలింగం' దొరికిందని భావిస్తున్న స్థలంలో సర్వే జరిపించేందుకు అనుమతించాలని కోరుతూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. ఆ మసీదు గోడలపై ఉన్న హిందూ దేవత విగ్రహాలను పూజించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తొలుత వారాణసి సివిల్ కోర్టులో ఒరిజినల్ పిటిషన్ దాఖలు చేసిన నలుగురు మహిళలే దీన్ని కూడా సమర్పించారు. ఆ 'శివలింగం' ఏ కాలానికి చెందినదని నిర్ధరించేందుకు కార్బన్ డేటింగ్ సహా ఇతర శాస్త్రీయ పరీక్షలు జరిపేందుకు అనుమతించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

అమెరికాలో ఉంటూనే హెచ్-1బీ రెన్యువల్

వాషింగ్టన్, జనవరి 30: అమెరికాలో హెచ్-1బీ వీసాపై నివసిస్తున్న భారతీయులు, ఇతర విదేశీయులకు బైడెన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారు అమెరికాను విడిచిపెట్టి వెళ్లకుండానే ఆవీసాను రెన్యువల్ చేసుకోవచ్చు. తొలుత అయిదు వారాల పాటు పైలట్ ప్రాజెక్టు కింద దీన్ని అమలు చేస్తారు. మొదటి దశ కింద 20వేల మంది దీని కింద దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్-1బీ వీసా కాలపరిమితి ఆరేళ్లు. దీన్ని రెన్యువల్ చేయాలంటే వారు ఏడాది పాటు అమెరికాను విడిచి పెట్టి వెళ్లాల్సి ఉంటుంది. తాజా నిర్ణయం ప్రకారం.. అలా వెళ్లాల్సిన అవసరం లేకుండానే రెన్యువల్ చేయించుకోవడానికి అవకాశం లభించనుంది.



భారత నౌకాదళం అదుపులో సముద్రపు దొంగలు

పాకిస్థానీయులను కాపాడిన భారత నేవీ

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సోమాలియా తూర్పు కోస్తా తీరంలో సముద్రపు దొంగల నుంచి మరో మత్స్యకార నౌకను, అందులోని 19 మంది పాకిస్థాన్ దేశస్థులను భారత నౌకాదళం కాపాడింది. సోమాలియా, గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో ఇరాన్‌కు చెందిన మత్స్యకార పడవ 'నేమి'ని సముద్రపు దొంగలు హైజాక్ చేసినట్టు సోమవారం సమాచారం అందడంతో ఐఎన్ఎస్ సుమిత్ర వెంటనే నౌక నుంచి హెలికాప్టర్‌లో వెళ్లి రక్షణ చర్యలు చేపట్టింది. పడవలో 19 మంది పాకిస్థాన్ దేశీయులు ఉండగా వారిని కాపాడింది. అలాగే 11 మంది సముద్రపు దొంగలను అదుపులోకి తీసుకొంది.

మనిషి మెదడులో మస్క్ చిప్

(మొదటి పేజీ తరువాయి)


అవకాశం ఉంటే? అలాంటివాటిని 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)'గా వ్యవహరిస్తారు. అదుగో.. సరిగ్గా అలాంటి వైర్‌లెస్ బీసీఐ చిప్‌నే టెక్ బిలియనీర్ ఈలన్ మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' స్టార్టప్ అభివృద్ధి చేసింది. ఆ ఇంప్లాంట్‌ను సోమవారం ఒక వ్యక్తికి అమర్చామని.. ఆ వ్యక్తి చక్కగా కోలుకుంటున్నారని మస్క్ మంగళవారం ట్విటర్ ద్వారా ప్రపంచానికి తెలిపారు. ఆ ఇంప్లాంట్‌కు 'టెలిపతి' అనే పేరు పెట్టినట్టు వెల్లడించారు. ఆ ఇంప్లాంట్ కేవలం మన ఆలోచనతోనే ఫోన్, కంప్యూటర్ సహా ఏ ఎలక్ట్రానిక్ పరికరాన్నైనా అనుసంధానమై వాటిని నియంత్రిస్తుందని పేర్కొన్నారు. తొలిదశల్లో ఈ ఇంప్లాంట్‌ను.. రకరకాల కారణాల వల్ల తమ అవయవాలను కోల్పోయినవారికి ఉపయోగిస్తామని మస్క్ స్పష్టం చేశారు. "ఒక్కసారి ఊహించుకోండి.. స్టీఫెన్ హాకింగ్ (మోటార్ న్యూరాన్ డిసీజ్ కారణంగా వేలు కూడా కదపలేక కుర్చీకే పరిమితమైన ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త) తన ఆలోచనలతోనే అత్యంత వేగంగా టైప్ చేసేవారికన్నా వేగంగా తన ఆలోచనలను ప్రసారం చేయగలిగితే? అదే నా లక్ష్యం" అని మస్క్ ట్వీట్ చేశారు. అయితే.. ఈ ఇంప్లాంట్ ఫోన్లు, కంప్యూటర్లను నియంత్రిస్తుందని మస్క్ చెప్పారు గానీ, అది ఇప్పుడే కాదు. ప్రస్తుతానికి న్యూరాలింక్ ప్రాథమిక లక్ష్యం ఏంటంటే.. ఈ ఇంప్లాంట్ ద్వారా మౌస్ కర్సర్‌ను, కీబోర్డును నియంత్రించడమే. ముమ్మందు దశల్లో పూర్తిస్థాయిలో వాటిని నియంత్రించే అవకాశం ఉంటుందన్నది వారి ఆశాభావం.

ఏడేళ్లుగా పరిశోధనలు..

2016లో మస్క్ ప్రారంభించిన 'న్యూరాలింక్' స్టార్టప్ ఏడేళ్ల పరిశోధనల ఫలితమే ఈ ఇంప్లాంట్. దీన్ని సర్జరీ ద్వారా.. మెదడులో కదలికలను నియంత్రించే భాగానికి అనుసంధానం చేస్తారు. అలాగే, మన ఫోన్‌లో ఉన్న న్యూరాలింక్ యాప్‌కు దాన్ని కనెక్ట్ చేస్తారు. అప్పుడది మెదడులోని నాడుల కదలికలను ఆలోచనలుగా తర్జుమా చేసి, వాటిని ఆదేశాలుగా మలిచి న్యూరాలింక్ యాప్ ద్వారా కంప్యూటర్ లేదా ఫోన్‌ను నియంత్రించగలిగేలా చేస్తుందన్న మాట. ఈ ఇంప్లాంట్‌ను మానవులకు అమర్చి ప్రయోగాలు చేయడానికి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ గత ఏడాది మే నెలలో అనుమతిచ్చింది. దీంతో న్యూరాలింక్ సంస్థ 'ప్రైమ్ (ప్రిసైజ్ రోబోటికల్లీ ఇంప్లాంటెడ్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)' పేరిట ట్రయల్స్‌ను ప్రారంభించింది. వెన్నుపూసకు గాయాలు కావడం వల్ల, అమ్యోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్ (ఏఎల్ఎస్) వంటి వాటి వల్ల మంచానికే పరిమితమైనవారి నుంచి ఈ ట్రయల్స్‌లో పాల్గొనడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎన్1.. ఆర్1

న్యూరాలింక్ సంస్థ తయారుచేసిన ఈ బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌లో ముఖ్యమైనవి.. ఎన్1 ఇంప్లాంట్, దాన్ని మెదడులో అమర్చే ఆర్1 అనే సర్జికల్ రోబో. ఎన్1 ఇంప్లాంట్ ఒక నాణెం పరిమాణంలో ఉంటుంది. దాంట్లో.. చిప్, ఒక బ్యాటరీ, చిప్‌కు అనుసంధానంగా.. 1024 ఎలక్ట్రోడులను కలిగి ఉన్న 64 అత్యంత సన్నటి దారాలు (అవి వెంట్రుకలో 20వ వంతు ఉంటాయి) ఉంటాయి. ఆ చిప్‌ను ఆ చిప్‌ను ఆర్1 రోబో పుర్రె గుండా మనిషి మెదడులో అమరుస్తుంది. ఈ రోబో ఎత్తు 8 అడుగులు.



ఎంతవరకూ సురక్షితం?

జంతువులపై నిర్వహించిన ట్రయల్స్‌లో భద్రతాపరమైన ప్రోటోకాల్స్‌ను ఉల్లంఘించినందుకు న్యూరాలింక్‌కు జరిమానా కూడా పడింది. అంతేకాదు.. ఆ ట్రయల్స్‌లో భాగంగా జంతువులకు 'టెలిపతి' ఇంప్లాంట్‌ను అమర్చగా కొన్ని పక్షవాతానికి గురయ్యాయి. మరికొన్ని మూర్ఛ, మెదడువాపు వంటి సమస్యలతో ఇబ్బందిపడ్డాయి. ఈ ప్రయోగాల్లో దాదాపు 1500 దాకా జంతువులు (గొర్రెలు, కోతులు, పందులు) చనిపోయినట్టు రాయిటర్స్ వార్తా సంస్థ సైతం ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే మానవులపై ప్రయోగానికి ఎఫ్‌డీఏ అనుమతులు రావడానికి చాలా కాలం పట్టింది. అయితే.. ప్రయోగం అంటేనే ఎంతవరకూ సురక్షితమో తెలియనిది. కాబట్టి.. ఈ ట్రయల్స్‌లో పాల్గొనేవారు ఆ విషయాన్ని తెలుసుకునే ముందుకు వస్తున్నారు.

ఇదే మొదటిది కాదు

బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ ఇంప్లాంట్లు కొత్తవేమీ కావు. బ్లాక్‌రాక్ న్యూరోటెక్ అనే సంస్థ రెండు దశాబ్దాల క్రితమే 'యూటా యారే' అనే పేరుతో ఒక ఇంప్లాంట్‌ను అభివృద్ధి చేసింది. సింక్రాన్ అనే మరో సంస్థ కూడా గతంలో ఇలా బ్రెయిన్ ఇంప్లాంట్లను మనుషులకు అమర్చింది. అలాగే.. స్విట్జర్లాండ్‌కు చెందిన ఈపీఎఫ్ఎల్ (ఎకోల్ పాలిటెక్నిక్ ఫెడరల్ ఇన్ లాసాన్) గత ఏడాది మే నెలలో.. ఒక పక్షవాత బాధితుడి మెదడులో ఇంప్లాంట్‌ను అమర్చి అతడు నడవగలిగేలా చేసింది. అతడి పేరు గెర్ట్ జాన్ ఆస్కామ్ (41). పన్నెండేళ్ల క్రితం సైక్లింగ్ పోటీల్లో అతడు ప్రమాదానికి గురయ్యాడు. వెన్నుపూసకు దెబ్బతగలడంతో అప్పట్నుంచీ వీల్‌చైర్‌కే పరిమితమైన జాన్ మెదడులో.. స్విట్జర్లాండ్‌కు చెందిన ఒక సంస్థ అతడి బ్రెయిన్‌లో ఒక ఇంప్లాంట్‌ను అమర్చింది. అతడు నడవాలనుకున్నప్పుడు ఆ ఇంప్లాంట్ అతడి ఆలోచనను ఆదేశంగా మలచి నాడుల ద్వారా కాళ్లకు పంపుతుంది. సాధారణ ఆరోగ్యవంతుల్లాగా నడవలేకపోవచ్చుగానీ.. దానివల్ల అతడు అప్పుడే అడుగులు నేర్చుకునే పసిపిల్లల్లాగా నడుస్తున్నాడు. తాము రూపొందించిన ఇంప్లాంట్ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, దానిపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని దాన్ని తయారుచేసిన శాస్త్రజ్ఞులు తెలిపారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా 42 మంది తమ మెదళ్లలో ఇలాంటి ఇంప్లాంట్లను కలిగి ఉన్నారని వాషింగ్టన్ పోస్ట్ వార్తా సంస్థ ఒక కథనంలో తెలిపింది.



ఎన్1 ఇంప్లాంట్




ఇంప్లాంట్‌ను మెదడులో అమర్చే రోబో

-సెంట్రల్ డెస్క్

బ్రెయిన్‌జాకింగ్ ముప్పు

టెక్నాలజీ రెండువైపులా పదునుండే కత్తి లాంటిది. అందుకు ఉదాహరణ కంప్యూటర్లు, ఫోన్లే. మన సౌలభ్యం కోసం తయారుచేసుకున్న ఈ పరికరాలను హ్యాక్ చేసి సమాచారాన్ని తస్కరించే దొంగలున్నట్టే.. పక్షవాతం కారణంగా కదల్లేని వారి శరీరంలో అమర్చే న్యూరల్ ఇంప్లాంట్లను వేరెవరైనా హ్యాక్ చేసి సదరు మనుషులను తాము చెప్పినట్టల్లా రోబోల్లా ఆడించే ప్రమాదం ఉందనే ఆందోళనలు చాలాకాలంగా ఉన్నాయి. నిజానికి 2022లో ఒక సందర్భంలో సాక్షాత్తూ ఈలన్‌మస్కే.. భవిష్యత్తులో మానవులు తమ బ్రెయిన్‌చిప్‌లను ఎప్పటికప్పుడు వైర్‌లెస్‌గా అప్‌గ్రేడ్ చేసుకుంటారు అని జోస్యం చెప్పాడు. అంటే మన ఫోన్‌లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ అప్‌డేట్లు వైఫై ద్వారా వచ్చినట్టుగానే.. బ్రెయిన్ చిప్‌లను కూడా ఎప్పటికప్పుడు కొత్త సాఫ్ట్‌వేర్‌తో అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు అన్నమాట. కానీ, ఆ అప్‌డేట్లలో బగ్స్ ఉంటే? అనే ప్రశ్నకు ఇప్పటిదాకా ఎవరిదగ్గరా సమాధానం లేదు. దీంట్లో ఇంకో ముప్పు కూడా ఉంది. ఇప్పుడు బాగా డబ్బున్నవాళ్లు ఖరీదైన ఫోన్లు కొనుక్కున్నట్టే.. భవిష్యత్తులో తమ బ్రెయిన్ ఇంప్లాంట్లకు అత్యంత ఖరీదైన అప్‌గ్రేడ్‌లు చేయించుకుని తెలివిని పెంచేసుకుంటే బాగా తెలివైనవాళ్లు.. తెలివి తక్కువగా ఉన్నవారు అనే వర్గాలుగా మానవాళి విడిపోతుందన్న ఆందోళనా కొందరిలో ఉంది.



మహిళా ఉద్యోగి పింఛను
పిల్లలకు

- తమ తదనంతరం సంతానాన్ని నేరుగా నామినేట్ చేయొచ్చు
- సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్‌కు సవరణ

న్యూఢిల్లీ, జనవరి 30: మహిళా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కుటుంబ పింఛను విషయంలో కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వారి తదనంతరం పింఛను భర్తకే చెందుతుండగా.. ఇకమీదట మాత్రం అర్హులైన పిల్లలకు వెళ్లేలా పింఛన్లు, పింఛనుదారుల సంక్షేమ శాఖ (డీఓపీపీడబ్ల్యూ) సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్ (2021)లో సవరణ చేసింది. అయితే, దీనికి సంబంధించి వారు లిఖితపూర్వకంగా తమ సంతానాన్ని నామినేట్ చేస్తూ విభాగాధిపతికి లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా.. పింఛను కుమారుడు లేదా కుమార్తెలకు వెళ్తుంది. భార్యాభర్తలు విడాకులు తీసుకుని, గృహ హింస, వరకట్న నిరోధక చట్టం, ఐపీసీ కేసుల వంటి వివాదాలు ఉన్న కుటుంబాల్లో ఈ మార్పు చాలా కీలకం కానుంది. ఎందుకంటే.. ప్రస్తుతం మహిళా ఉద్యోగులు, పింఛనుదారుల ప్రతిపాదనల మేరకు మరణానంతరం తొలుత పింఛను వారి భర్తకు, ఆయన మరణం/అనర్హుడు అయిన తర్వాతనే సంతానానికి వెళ్తోంది. ఇకపై మాత్రం నేరుగానే పిల్లల పేర్లను ఇవ్వొచ్చు. ఒకవేళ సంతానం లేకున్నా, మైనర్లు అయినా, మానసిక వైకల్యంతో బాధపడుతున్నా.. వారి సంరక్షకుడి హోదాలో/సంరక్షకుడిగా ఉన్నంతకాలం పింఛను భర్తకే వెళ్తుంది. పిల్లలు మేజర్ అయ్యాక వారికి చెందుతుంది. ఇక మహిళా పింఛనుదారు చనిపోయిన సందర్భంలో, భర్త ఉన్నప్పటికీ పిల్లలు మేజర్ అయితే వారికే అందుతుంది. కాగా, ఈ నిర్ణయం మహిళా సాధికారత పట్ల మోదీ నిబద్ధతకు నిదర్శనమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

చండీగఢ్ కార్పొరేషన్
బీజేపీ చేతికి!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయి. కూటమికే చెందిన 8 ఓట్లు చెల్లలేదని ప్రకటించారు. దాంతో ఆగ్రహించిన ఆప్, కాంగ్రెస్ సభ్యులు కార్పొరేషన్ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలను బహిష్కరించారు. ఆ తర్వాత ఏకపక్షంగా జరిగిన ఎన్నికల్లో మిగతా రెండు పదవులను కూడా బీజేపీ దక్కించుకుంది. 2022లో కూడా ఆప్‌కు చెందిన కౌన్సిలర్ ఓటు చెల్లదని ప్రకటించిన తర్వాత బీజేపీ సభ్యుడు మేయర్‌గా ఎన్నికయ్యారు. అప్పట్లో ఆప్, బీజేపీలకు చెరో 14 మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్ ఎన్నికలను బహిష్కరించింది. చండీగఢ్ మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి రెండేళ్లకొకసారి జనవరిలో మూడు ప్రధాన పోస్టులకు ఎన్నికలు జరుగుతాయి. పార్టీ ఫిరాయించదలచుకున్న సభ్యులు బ్యాలెట్ పేపర్ వెనుక టిక్ పెట్టడం, గోప్యతను భంగం కలిగిందన్న కారణంతో సదరు ఓటును చెల్లదని ప్రకటించడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. గత ఏడాది ఆప్ సభ్యుడి విషయంలో ఇదే జరిగింది. కాంగ్రెస్, ఆప్‌లకు చెందిన 8 మంది కౌన్సిలర్లు ఇలాగే ఫిరాయించి ఉంటారని ఒక వాదన వినిపిస్తుండగా, ప్రిసైడింగ్ అధికారిగా ఉన్న బీజేపీ కౌన్సిలర్ అనిల్ మాషి ఓట్ల లెక్కింపు సమయంలో తానే కొన్ని బ్యాలెట్ల మీద పెన్నుతో టిక్ కొట్టారని ఆప్, కాంగ్రెస్ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఓటమి తర్వాత ఆప్ అభ్యర్థి కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం నాటి వివాదాస్పద ఎన్నికపై ఆప్ పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించింది. ఎన్నికలు జరిగిన తీరును కేజ్రీవాల్ తీవ్రంగా తప్పుబట్టారు. పట్టపగలు ఇంత దారుణానికి పాల్పడటం ఆందోళనకరమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే చీకటి రోజుగా అభివర్ణించారు. పోలింగ్ పర్యవేక్షణకు పార్టీ తరఫున వచ్చిన ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాము ఈ ఎన్నిక ఓడిపోతామని కలలో కూడా ఊహించలేదన్నారు. తమ కూటమికి చెందిన ఎనిమిది ఓట్లను చెల్లవని ప్రకటించకపోతే తప్పకుండా తమ అభ్యర్థే గెలిచేవారన్నారు.

మాకు నితీశ్ అవసరం లేదు

- పోరు కొనసాగిస్తాం: రాహుల్

పూర్ణియా, జనవరి 30: బిహార్‌లో సామాజిక న్యాయం కోసం తాము పోరాటం కొనసాగిస్తామని, దీనికి నితీశ్ కుమార్ అవసరం తమకు ఏమాత్రం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ నుంచి కొంచెం ఒత్తిడి వచ్చేసరికి నితీశ్ 'యూటర్న్' తీసుకున్నారని విమర్శించారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా ఆయన మంగళవారం పూర్ణియా చేరుకున్నారు. రంగభూమి మైదానంలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దళితులు, ఓబీసీలు, గిరిజనులు, ఇతరుల జనాభా కచ్చితంగా తెలియాలంటే దేశంలో కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మణిపూర్‌లో అంతర్యుద్ధ వాతావరణం ఏర్పడినా ప్రధాని ఇంతవరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని మండిపడ్డారు. ఇండియా కూటమిని వీడి, మళ్లీ బీజేపీతో చేతులు కలిపిన జేడీయూ అధినేత నితీశ్ ఆదివారం బిహార్ సీఎంగా తొమ్మిదోసారి ప్రమాణ స్వీకారం తెలిసిందే.

షిండే కూటమిలో
'మరాఠా' చిచ్చు!

ముంబై, జనవరి 30: మహారాష్ట్రలో సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని మహాయుతి కూటమిలో మరాఠా చిచ్చు రేగింది. మరాఠాలను ఓబీసీలో చేర్చాలన్న షిండే నిర్ణయంపై అజిత్‌పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ వర్గం, బీజేపీ మండిపడుతున్నాయి. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం (ఒకటో తేదీన) రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు నిర్వహించాలని ఎన్‌సీపీకి చెందిన రాష్ట్ర మంత్రి ఛగన్ భుజ్‌బల్ ఓబీసీలకు పిలుపిచ్చారు. 3వ తేదీన తాను మెగా ర్యాలీ నిర్వహిస్తానని ప్రకటించారు. మరాఠాలను ఓబీసీలో చేర్చడాన్ని బీజేపీకి చెందిన కేంద్రమంత్రి నారాయణ్‌రాణే కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. భుజ్‌బల్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం, రాష్ట్ర బీజేపీ నేత ఫడణవీస్ స్పందించారు. సీఎంతో కూర్చుని మాట్లాడకుండా మని, అనవసరపు ప్రకటనలతో అలజడి రేగుతుందని అన్నారు. ఇరు వర్గాలకు ఇబ్బంది లేకుండా షిండే వ్యవహరించాల్సిందని, చర్చలతో పరిష్కారం కనుక్కోవాలని కోరారు.

డీ-రిజర్వేషన్ ముసాయిదా తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 30: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వు చేసిన పోస్టులకు తగిన అభ్యర్థులు దొరకని పక్షంలో వాటిని అన్ రిజర్వుడుగా ప్రకటించాలనే ప్రతిపాదనతో రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తడంతో.. యూజీసీ వాటిని తన వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ప్రజలు,సంబంధిత భాగస్వాముల నుంచి ఫీడ్‌బ్యాక్ కోరుతూ తమ వెబ్‌సైట్‌లో పెట్టిన ఈ గైడ్‌లైన్స్‌ను తొలగించినట్టు యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ మంగళవారం వెల్లడించారు.

రాంచీలో సోరెన్ ప్రత్యక్షం

- జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలతో భేటీ
- ఎమ్మెల్యేలు రాజధానిలోనే ఉండాలని సూచన.. పాల్గొన్న సీఎం సతీమణి
- సీఎస్, డీజీపీతో గవర్నర్ భేటీ

రాంచీ, జనవరి 30: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయనుందన్న వార్తల నేపథ్యంలో దాదాపు 30 గంటలకు పైగా కనిపించకుండా పోయిన ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు, సీఎం హేమంత్ సోరెన్ మంగళవారం రాంచీలోని తన అధికార నివాసంలో ప్రత్యక్షమయ్యారు. తాను ఎక్కడికీ పోలేదని, ప్రజల హృదయాల్లో ఉన్నానని చెప్పారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బాపూ వాటికలో నివాళి అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జేఎంఎం కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులతో హేమంత్ సోరెన్ అంతకు ముందు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఆయన భార్య కల్పన సోరెన్ కూడా పాల్గొన్నారు. బుధవారం హేమంత్‌ను ఈడీ ప్రశ్నించనున్న నేపథ్యంలో, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో సమీక్ష జరిపారు. ఎమ్మెల్యేలను రాజధానిలోనే ఉండాలని సూచించారు. అనంతరం జేఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే మీడియాకు వివరాలు అందిస్తూ.. 'సీఎం హేమంత్ సోరెన్‌కు రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఉన్నాయి. ఆయన మచ్చ లేకుండా బయటపడతారు. నియంతలను ఎదుర్కోవటానికి మావైన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాం' అని తెలిపారు. హేమంత్ సోరెన్ మంగళవారం వేకువజామున రాంచీకి వచ్చినట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సీఎస్, డీజీపీ తదితర ఉన్నతాధికారులతో ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. అదనంగా ఏడు వేల మంది పోలీసులను మోహరించారు. సీఎం నివాసం, రాజ్‌భవన్, ఈడీ ఆఫీసు వద్ద నిషేధాజ్ఞలు విధించారు.

ప్లాన్ బీ.. సీఎం కుర్చీలో కల్పన సోరెన్!



హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు చేస్తే, సీఎం బాధ్యతలను ఆయన భార్య కల్పన సోరెన్ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. జేఎంఎంలో కూడా ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు లేవని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జేఎంఎం కూటమి ప్లాన్ బీని సిద్ధం చేసుకుందని పేర్కొన్నాయి. అయితే, కల్పన ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేరు. పార్టీ ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ జనవరి 2వ తేదీన రాజీనామా చేశారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన గాండే నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. కల్పన కోసమే సర్ఫరాజ్ రాజీనామా చేసినట్లుగా అప్పట్లో ఊహాగానాలు వెలువడ్డాయి.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్నాయి. ప్రస్తుత 17వ లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు కానుండగా నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాక తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ ఏడాదిలోనే లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. బుధవారం ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ప్రస్తుత లోక్‌సభకు చివరి సమావేశాలు కావడంతో సుహృద్భావ వాతావరణంలో నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి 146 ఎంపీలను సస్పెండ్ చేయగా వారిలో 132 మందిపై దీన్ని ఆ సెషన్ వరకే పరిమితం చేశారు. మిగతా 14 మందిలో 11 మంది రాజ్యసభ సభ్యులు, ముగ్గురు లోక్‌సభ సభ్యులున్నారు. ఈ 14 మంది సభ్యుల కేసును ఉభయసభల ప్రివిలేజ్ కమిటీలకు పంపారు.



జనవరి 12న లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ ముగ్గురు లోక్‌సభ సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. రాజ్యసభకు చెందిన ప్రివిలేజ్ కమిటీ మంగళవారం 11 మంది సభ్యులపై సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. మరోవైపు.. బడ్జెట్ సమావేశాల్లో ప్రతి సమస్యపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయా పార్టీల ఫ్లోర్ లీడర్లకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి ఈ మేరకు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గత సమావేశాల్లో మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంటు భద్రత, మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వ రద్దు అంశంపై నిలదీసిన ప్రతిపక్ష కూటమి ఈసారి ఉమ్మడి కార్యాచరణను ఇప్పటివరకూ ప్రకటించలేదు. కాగా, కేంద్రం తాజా ప్రవేశపెట్టే బడ్జెట్‌లో పీఎం కిసాన్ మొత్తాన్ని 50% పెంచి ఎకరాకు రూ.9 వేలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఫ్రెంచ్ నేర్చుకొనేందుకు
ప్రత్యేక ప్రోగ్రామ్

- భారతీయుల కోసం ప్రారంభించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

న్యూఢిల్లీ, జనవరి 30 : భారత విద్యార్థులు ఫ్రెంచ్ భాష నేర్చుకొనేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ "క్లాసెస్ ఇంటర్నేషనలెస్" అనే ప్రత్యేక ప్రోగ్రామ్‌ని ప్రారంభించారు. దీని ద్వారా ఏడాదిపాటు ఫ్రాన్స్‌లో ఉండి ఫ్రెంచ్ నేర్చుకోవచ్చు. అనంతరం తమకు నచ్చిన డిగ్రీలో చేరవచ్చు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ఈ ప్రోగ్రామ్ ప్రారంభం అవుతుంది. ఈమేరకు ఫ్రాన్స్ ఎంబసీ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ, అధ్యక్షుడు మెక్రాన్‌ల సంయుక్త ప్రకటనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత విద్యార్థులకు ఫ్రాన్స్‌లో మరిన్ని విద్యావకాశాలు కల్పించాలన్న మెక్రాన్ సూచనకు అనుగుణంగా ఈ ప్రోగ్రామ్‌ని ప్రారంభించారు. 5 ఏళ్ల షెంజెన్ వీసా వంటి వాటి ద్వారా ప్రస్తుతం ఫ్రాన్స్‌లో స్కాలర్‌షిప్‌లు పొందుతున్నవారిలో ఎక్కువ మంది భారత విద్యార్థులేనని ఫ్రాన్స్ ఎంబసీ తెలిపింది. 2030 నాటికి 30,000 మంది భారత విద్యార్థులను ఫ్రెంచ్ విద్యాసంస్థల్లో చేర్చుకోవాలని మెక్రాన్ సూచించారని వెల్లడించింది.

సోమేశ్ భూములపై సర్కారు ఆరా!

(మొదటి పేజీ తరువాయి)

ముందు సుదీర్ఘకాలం రెవెన్యూ వ్యవహారాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సీసీఎల్ఏగా కీలక పదవిలో ఉన్నారు. సీఎస్ అయిన తర్వాత కూడా ఈ బాధ్యతలు తన దగ్గరే ఉన్నాయి. అలా దాదాపు ఆరేళ్లపాటు రెవెన్యూ వ్యవహారాలు ఆయన కనుసన్నల్లోనే జరిగాయి. ఆ సమయంలోనే ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి అత్యంత సమీపంలో 25.19 ఎకరాల భూమిని ఆయన భార్య డాక్టర్ జ్ఞానముద్ర పేరుతో కొనుగోలు చేసిన వ్యవహారం తాజాగా బయటకు వచ్చింది. ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.2.5 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. అప్పట్లో దీని విలువ రెండు రెట్లు అధికంగా ఉంది. అయితే ఈ భూములను 2018లో చట్ట ప్రకారమే కొనుగోలు చేశానని, ప్రశాసన్ నగర్‌లోని తన నివాసాన్ని అమ్మి ఈ భూములు కొన్నామని ఇటీవల ఆయన ప్రకటన కూడా విడుదల చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆయన ఈ భూమిని కొనుగోలు చేసిన సమయంలోనే దీని చుట్టు పక్కల ఆయనతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఒక రియల్ వ్యాపారి కుటుంబం ఏకకాలంలో 123 ఎకరాలు కొనుగోలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. వీరంతా వారం రోజుల వ్యవధిలోనే ఇంత పెద్ద మొత్తంలో భూమిని ఫార్మాసిటీకి అత్యంత సమీపంలో కొనుగోలు చేయడం వెనుక ఏమైనా మతలబు ఉందా? అనే అనుమానాలతో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం.

ఫార్మా సిటీకి కిలోమీటర్ దూరంలోనే

సోమేశ్ కుమార్ 2016 డిసెంబరు నుంచి 2020 జనవరి వరకు రాష్ట్ర ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవహారాల చీఫ్ సెక్రెటరీగా ఉన్నారు. 2020 జనవరి నుంచి 2023 జనవరి వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆయన కీలకమైన రెవెన్యూ పదవిలో ఉన్న సమయంలోనే 2018లో ఆయన భార్య డాక్టర్ జ్ఞానముద్ర యాచారం మండలం కొత్తపల్లిలో సర్వే నంబరు 249/ఆ2లో పి శేషకుమారి నుంచి 10 ఎకరాలు, సర్వే నంబరు 249/ఆ1లో నామని వేణుగోపాల్ నుంచి 8 ఎకరాలు, సర్వే నంబరు 260/అ/1/1లో ఎల్లా వరలక్ష్మీ నుంచి 7.19 ఎకరాలు కొనుగోలు చేశారు. ధరణి పోర్టల్ ప్రకారం 5,237 ఖాతా నంబర్‌గా నమోదైంది. అప్పటికే ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ హద్దులు స్థిరీకరించారు. వీటికి కిలో మీటరు దూరంలో కొత్తపల్లిలో సోమేశ్ కుటుంబం కొనుగోలు చేసిన భూములు ఉన్నాయి. ఈ భూములు క్రయ విక్రయాలల్లో కీలకంగా ఉన్న వారే వీటి చుట్టు పక్కల ఉన్న సర్వే నంబరు 244 నుంచి 269 వరకు 123 ఎకరాల భూములను సోమేశ్ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన ఓ రియల్ ఎస్టేట్ కుటుంబానికి విక్రయించినట్లు తెలిసింది. సోమేశ్ కుమార్ భార్య భూమిని కొనుగోలు చేసిన సమయంలోనే ఈ 123 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కావడం గమనార్హం.

మరో ప్రాజెక్టు తీసుకువచ్చే యత్నం చేశారా?

ఈ భూముల సమీపంలోనే ఫార్మాసిటీకి అనుబంధంగా మరో ప్రాజెక్టును తీసుకువచ్చేందుకు ప్రయత్నించారని, అందులో లబ్ధి పొందడం కోసమే ఇక్కడ భూములు కొనుగోలు చేశారని అప్పట్లో ప్రచారం జరిగింది. అప్పుడు సోమేశ్ కుమార్ రెరా వ్యవహారాలు పర్యవేక్షించే వారు. అప్పుడు రెరా వ్యవహారాలతో శివ బాలకృష్ణకు కూడా సంబంధం ఉండేది. శివ బాలకృష్ణ సోమేశ్ కుటుంబం భూముల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారని ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సోమేశ్ భూముల కొనుగోలు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

రోగి దుశ్చేష్టకు ఎమ్మెల్యే చెంపదెబ్బ

» వైద్యురాలి పట్ల అసభ్య ప్రవర్తన..రాజేశ్‌రెడ్డికి బాధితురాలి ఫోన్

» పోలీసులకు అప్పగించిన ఎమ్మెల్యే.. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 30: వైద్యురాలిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన రోగికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకళ్ల రాజేశ్‌రెడ్డి గట్టిగా బుద్ధిచెప్పారు. అతడి చెంప చెళ్లుమనిపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చర్మవ్యాధి నిపుణురాలు మంగళవారం ఓపీలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తుండగా ఓ వ్యక్తి అక్కడికొచ్చాడు. తనకు స్కిన్ ఎలర్జీ అయిందని వైద్యురాలితో చెప్పాడు. ఆమె పరీక్షిస్తుండగా ఒక్కసారిగా డాక్టర్ ఉన్న గది తలుపులు మూసేసి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాధిత వైద్యురాలు స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డికు ఫోన్ ద్వారా సమాచారమందించారు. అప్పటికే ఆ వ్యక్తిని ఆస్పత్రి సిబ్బంది ఒక గదిలో పెట్టి బంధించారు. స్థానికంగానే ఉన్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రికి చేరుకున్నారు. అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తికి చెంపదెబ్బలు కొట్టి పోలీసులకు అప్పజెప్పారు. ఎమ్మెల్యే అనుచరులు సైతం ఆ వ్యక్తిని చితకబాదారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా తక్షణమే పోలీసులు, తమ చుట్టూ ఉన్న వారికి సమాచారమందించాలని సూచించారు.

నర్సంపేట మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు 14 మంది కౌన్సిలర్ల రాజీనామా

» కౌన్సిలర్ పదవులకూ రాజీనామా చేస్తామని ప్రకటన

నర్సంపేట, జనవరి 30: వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన 14 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. నర్సంపేటలోని సర్వాపురంలో 14మంది కౌన్సిలర్లు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఒకటి రెండు రోజుల్లో కౌన్సిలర్ పదవులకు కూడా రాజీనామా చేయాలనుకుంటున్నామని చెప్పారు. చైర్‌పర్సన్ ఒంటెద్దు పోకడలు నచ్చక ఏడాది క్రితం అవిశ్వాసానికి ప్రయత్నించగా ఈ జనవరి 30వరకు అవకాశం లేదని తెలిసి ఆ ఆలోచనను మానుకున్నామని వెంకట్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఇదే విషయాన్ని సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య ఆయన సమన్వయం తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు. దీంతో, చైర్‌పర్సన్‌పై ఈ నెల 2న కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన పత్రం ఇచ్చినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు.

స్కూల్ బస్సు చక్రాల్లో నలిగిన పసిప్రాణం

» మెదక్‌లో ఆరేళ్ల బాలిక మృతి


అనుశ్రీ(ఫైల్)

మెదక్ అర్బన్, జనవరి 30: ఓ డ్రైవర్ నిర్లక్ష్యం పసిప్రాణాన్ని బలిగొంది. రోజూ పాఠశాలకు వెళ్లివచ్చే స్కూల్ బస్సు చక్రాల కిందే పడి ఓ ఆరేళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. మెదక్‌లోని తారకరామనగర్‌లో మంగళవారం సాయంత్రం ఈ ఘోరం జరిగింది. స్థానికులు కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా బొంతపల్లికి చెందిన భిక్షపతి, నవీన దంపతుల కుమార్తె అనుశ్రీ(6) మెదక్‌లోని మాస్టర్‌మైండ్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. మెదక్ తారకరామనగర్‌లో ఉండే పిన్ని, బాబాయి రవి, నందిని ఇంట్లో ఉంటూ అనుశ్రీ పాఠశాలకు వెళుతుంటుంది. ఎప్పట్లాగే మంగళవారం కూడా పాఠశాలకు వెళ్లిన అనుశ్రీ.. సాయంత్రం ఇంటి వద్ద స్కూల్ బస్సు దిగి ముందుకు నడిచింది. అయితే, అనుశ్రీ బస్సు ముందు ఉందనే విషయాన్ని గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడపడంతో ఆ చిన్నారి చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోయింది. డ్రైవర్, క్లీనర్ వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు అనుశ్రీని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. అనుశ్రీ తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముచ్చింతల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

» చినజీయర్ ఆశీస్సులు తీసుకున్న మోహన్ భగవత్

శంషాబాద్ రూరల్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్‌లో శ్రీరామనగరం దివ్యసాకేతాన్ని సందర్శించారు. ప్రముఖ అధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఉదయం 9.30 గంటలకు దివ్యసాకేతానికి చేరుకున్న మోహన్ భగవత్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చినజీయర్‌తో కలిసి వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు దాదాపు 40 నిమిషాలు చినజీయర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్‌కు మంగళశాసనాలు, తీర్థప్రసాదాలు అందించినట్లు స్వామిజీ తెలిపారు. ఆలయంలో వేదపండితులు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌కు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మోహన్ భగవత్‌కు చిన జీయర్‌స్వామి వేంకటేశ్వరుడు, సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి ప్రతిమలను అందజేశారు.

బ్యాంకు ఖాతాలో రూ.41

» లగ్జరీ హోటల్‌కు 6 లక్షల టోకరా..ఢిల్లీలో ఏపీ మహిళ అరెస్టు

న్యూఢిల్లీ, జనవరి 30: బ్యాంకు ఖాతాలో రూ.41 మాత్రమే ఉన్న ఓ మహిళ.. ఢిల్లీలోని ఓ లగ్జరీ హోటల్‌కు రూ.6 లక్షల మేర టోకరా వేసింది. ఈ కేసులో ఏపీకి చెందిన ఝాన్సీ రాణి శామ్యూల్ అనే మహిళను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ విమానాశ్రయం సమీపంలోని పుల్మన్ హోటల్‌లో 15 రోజులపాటు బస చేసిన ఆమె.. హోటల్ సిబ్బంది నుంచి లక్షల విలువైన సేవలు పొందింది. చెకిన్ సమయంలో ఆమె నకిలీ గుర్తింపు కార్డు సమర్పించినట్లు సిబ్బంది తెలిపారు. చెల్లింపుల కోసం ఆమె వినియోగించిన యూపీఐ యాప్‌పై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు బ్యాంకు ఎకౌంట్‌ను తనిఖీ చేయగా ఆమె ఖాతాలో 41 రూపాయాలే ఉన్నట్టు గుర్తించి ఆమెను అరెస్టు చేసి.. దర్యాప్తు ప్రారంభించారు.

శ్రీవారి భక్తులకు సినిమా కష్టాలు

» అలిపిరి సర్కిల్లో సినిమా షూటింగ్‌తో ఇబ్బందులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30: తిరుపతిలోని అలిపిరి గరుడ కూడలిలో సినిమా షూటింగుకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో శ్రీవారి భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ హీరో ధనుష్, అక్కినేని నాగార్జున నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాల చిత్రీకరణ తిరుపతిలో మంగళవారం జరిగింది. అలిపిరి గరుడ కూడలిలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్‌కు పోలీసులు అనుమతినిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు.. ట్రాఫిక్‌ను దారి మళ్లించడంతో జామ్ అయింది. దీంతో పోలీసులతో, సినిమా యూనిట్ సిబ్బందితో భక్తులు వాగ్వాదానికి దిగారు. యూనిట్‌కు చెందిన బౌన్సర్లు భక్తుల పట్ల, మీడియా కెమెరామెన్ పట్ల దురుసుగా వ్యవహరించారు. మధ్యాహ్నం స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్ద జరిగిన షూటింగ్‌లో కూడా చిత్ర యూనిట్, బౌన్సర్లు మీడియా ప్రతినిధులపై దౌర్జన్యంగా వ్యవహరించడంతో మీడియా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెటిరో భూమి లీజ్ ఆగింది

జీవో 140ని నిలిపేస్తూ జీవో 12 విడుదల.. హైకోర్టు తీర్పును ఉటంకిస్తూ ప్రభుత్వ నిర్ణయం

» హైదరాబాద్ నడిబొడ్డున హైటెక్‌సిటీ వద్ద బీఆర్‌ఎస్ ఎంపీ పార్థసారధిరెడ్డి ట్రస్ట్‌కు భూమి

» 15 ఎకరాలు క్యాన్సర్ ఆస్పత్రికి కేటాయింపు

» నామమాత్రపు లీజుకు ఇచ్చిన కేసీఆర్ సర్కారు

» స్థలం రిజిస్ట్రేషన్ విలువే రూ.505 కోట్లు

» 2018లో జీవో నెం.59 ద్వారా కేటాయింపు

» దాన్ని తప్పుపడుతూ రద్దు చేసిన హైకోర్టు

» ఎన్నికల ముందు జీవో 140తో మళ్లీ కేటాయింపు

» ఆ జీవోను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వు

హైదరాబాద్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): హెటిరో డ్రగ్స్ ఎండీ, బీఆర్‌ఎస్ ఎంపీ పార్థసారధిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయిసింధు ఫౌండేషన్‌కు హైటెక్ సిటీ-కూకట్‌పల్లి ప్రధాన రహదారికి చేరువలో విలువైన 15 ఎకరాలను లీజుకు కేటాయిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.140ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిలిపేసింది. జీవో నెం.140ని నిలుపుదల చేస్తున్నట్లు జీవో నెం.12ను తాజాగా జారీ చేసింది. ఈ భూమి లీజును రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఈ భూ కేటాయింపును పునఃపరిశీలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. అనేక భూ కేటాయింపుల అంశాలు, అదే విధంగా జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేసిన స్థలాల్లో జరిగిన అక్రమాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... సాయిసింధు ఫౌండేషన్‌కు భూ కేటాయింపునకు సంబంధించిన అంశం పైనా దృష్టి పెట్టింది. జరిగిన విషయాలన్నింటినీ పరిశీలించి... లీజు కేటాయింపును నిలుపుదల(అబయన్స్)లో పెడుతూ నిర్ణయం తీసుకుంది. ఈ భూమి రెండు కీలకమైన రోడ్ల మధ్య ఉంది. ఒకవైపు హైటెక్ సిటీ నుంచి హెచ్‌ఐసీసీకి వెళ్లే ప్రధాన రహదారి ఉంటే మరోపక్క హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి ప్రధాన రహదారి ఉంది. పక్కన యశోద ఆసుపత్రి, ఎదురుగా వెలమ భవన్ ఉన్నాయి. నగరం నడిబొడ్డున హాట్ కేక్ లాంటి ఆ విలువైన స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో సాయిసింధు ఫౌండేషన్‌కు కారు చవగ్గా లీజుకు ఇచ్చేసింది. దీనికి సంబంధించిన అనేక పరిణామాలు జరిగాయి. క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు కోసం 15 ఎకరాల స్థలానికి ఎకరాకు కేవలం రూ.1.47 లక్షల లీజుతోనే భూమిని కేటాయిస్తూ నాటి ప్రభుత్వం 22.3.2018న జీవో నెంబరు 59 జారీ చేసింది. అయితే, ఈ భూముల లీజును సవాలు చేస్తూ అదే ఏడాది డాక్టర్ ఊర్మిళ పింగ్లే, మరొకరితో కలిసి హైకోర్టును ఆశ్రయించారు. జీవో నెం.571(సవరణ జీవో 218) ప్రకారం ఆ భూమిని పార్థసారధిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయిసింధు ఫౌండేషన్‌కు లీజు పద్ధతిలో కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, కానీ ఆ జీవోలో ఉన్న నిబంధనలను ఉల్లంఘించారని పిటిషన్‌దారులు వాదించారు. భూముల లీజు నిబంధనలకు సంబంధించి ప్రభుత్వాలు ఎలా వ్యవహరించాలన్న దానిపై జీవో నెం.571లో స్పష్టంగా ఉంది. ఇదే జీవోను 2015లో జీవో నెం.218 ద్వారా సవరించారు. ఈ జీవో ప్రకారం సామాజిక, స్వచ్ఛంద సంస్థలకు లీజుకు భూమిని ఇస్తే.. ఆ భూమి విలువలో 10 శాతాన్ని లీజుగా చెల్లించాలి. అంటే ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే ఆ స్థలం విలువ రూ.505 కోట్లు. కాబట్టి.. దీనిలో 10 శాతం లీజు మొత్తంగా చెల్లించాలి. అంటే ఏడాదికి సుమారు రూ.50 కోట్ల చొప్పున చెల్లించాలి. ఐదేండ్లకో సారి 10 శాతం చొప్పున పెంచుతూ పోవాలి. కానీ, ప్రభుత్వం మాత్రం కేవలం ఏడాదికి కేవలం ఎకరానికి రూ.1.47 లక్షల చొప్పునే లీజుకిచ్చింది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు నాటి ప్రభుత్వాన్ని తప్పుబట్టింది. 2023 జూన్ 5వ తేదీన భూ కేటాయింపులకు సంబంధించిన జీవో నెంబరు 59ని రద్దు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ భూకేటాయింపుల పాలసీ ప్రకారం పునఃసమీక్షించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రజల ఆస్తులకు, వనరులకు ప్రభుత్వం ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలని.. ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టేటప్పుడు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని ఘాటైన వ్యాఖ్యలు చేసింది. అయితే, ప్రభుత్వం హైకోర్టు ఇచ్చిన తీర్పులోని ఉద్దేశాన్ని పక్కనపెట్టి, ఎలాగైనా సదరు భూమిని కేటాయించాలన్న ఉద్దేశంతో... లీజు నిబంధనలకే మార్పులు చేసింది. ఎప్పటి నుంచో ఉన్న లీజు నిబంధనలకు సంబంధించిన జీవోల్లో సవరణలు చేసింది. కొత్త లీజు నిబంధనలను రూపొందించి 2023 ఆగస్టు 11న జీవో నెంబరు 99ను జారీ చేసింది. సామాజిక, స్వచ్ఛంద సంస్థలకు భూములు తక్కువ ధరకు ఇచ్చే విచక్షణ అధికారం ప్రభుత్వం చేతిలో ఉందనే నిబంధనను తీసుకువచ్చింది. ఆ కొత్త లీజు నిబంధనల ప్రకారం పార్థసారధిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయిసింధు ఫౌండేషన్‌కు భూమిని తిరిగి లీజుకిచ్చింది. లీజు నిబంధనలు మార్చిన ఒక నెలలోపే సెప్టెంబరు 25, 2023న ఆ భూమిని సాయిసింధు ఫౌండేషన్‌కే కేటాయిస్తూ జీవో నెంబరు 140ని జారీచేసింది. ఇప్పుడు ఆ జీవోను నిలుపుదల చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవో నెం.12ను జారీ చేశారు.

జగన్‌పై 'హోదా' అస్త్రం!

» ఢిల్లీ వేదికగా 2న షర్మిల దీక్ష?

» 5న మడకశిరలో సభ

అమరావతి, ఆంధ్రజ్యోతి: ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవానికి సీఎం జగన్ వైఫల్యాలనే సాధనంగా తీసుకోవాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్ణయించారు. ప్రధానంగా 2019లో ప్రత్యేక హోదా హామీతోనే ఆయన అధికారంలోకి వచ్చారని.. ఈ ఐదేళ్లలో హోదా ఇవ్వాలని ప్రధాని మోదీని అడుగలేదని ఈ నేపథ్యంలోనే ఆయనపై హోదా అస్త్రాన్నే ప్రయోగించాలని..పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఢిల్లీ వేదికగా పోరాడాలని ఆమె నిశ్చయించారు. రెండో తేదీన దీక్షకు కూర్చోనున్నట్లు తెలిసింది. గురువారంనాటికి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులంతా హస్తిన రావాలని ఆమె పిలుపిచ్చారు. ఫిబ్రవరి ఐదో తేదీన ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిరలో బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తున్నారు. తర్వాత గన్నవరం, విశాఖల్లో కూడా బహిరంగ సభలు చేపట్టాలని షర్మిల యోచిస్తున్నట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. మంగళవారం విజయవాడలో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు నేతృత్వంలో మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ విభాగం చైర్మన్ కొప్పుల రాజు, జేడీ శీలం సహా 17 మంది సభ్యులు హాజరయ్యారు. వచ్చే నెల 10న బెంగళూరులో విస్తృత చర్చల అనంతరం మేనిఫెస్టో తయారవుతుందని కొప్పుల రాజు చెప్పారు. కాగా, పదేళ్ల క్రితం (2014 ఫిబ్రవరి 20న) నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో విభజిత ఆంధ్రకు ప్రత్యేక హోదా సహా ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్రధాని మోదీకి మంగళవారం ఆమె లేఖ రాశారు.

వృద్ధుని హత్య కేసులో 14 మందికి జీవిత ఖైదు

» మంత్రగాడన్న నెపంతో మూకుమ్మడి దాడి

» జైలుకు వెళ్లిన తల్లిదండ్రులు, కుమారుడు

మోటకొండూరు, జనవరి 30: మంత్రగాడన్న నెపంతో వృద్ధుడిని హత్య చేసిన కేసులో 14మందికి జీవిత ఖైదు విధిస్తూ భువనగిరి ఒకటో అదనపు జిల్లా సెషన్ కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. 2018 ఆగస్టు 11న మోటకొండూరు మండలం దిలావర్‌పూర్‌కు చెందిన సీసా యాదగిరి(85) ఇంట్లోకి చొరబడ్డ ఆ గ్రామానికి చెందిన 15మంది వ్యక్తులు.. అతనిపై కర్రలతో మూకుమ్మడిగా దాడిచేశారు. తీవ్ర గాయాల పాలైన అతడు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం మృతిచెందాడు. అతని కుమారుడు చేసిన ఫిర్యాదు మేరకు బుర్రి రాజేష్, చొప్పరి శ్రావణ్, మాటూరుకు చెందిన ఉప సర్పంచ్ చొప్పరి నరేష్, చొప్పరి సత్యనారాయణ, చొప్పరి అంజమ్మ, చెక్క సత్యనారాయణ, దండు రవి, చొప్పరి శంకర్, చొప్పరి మహేందర్, చొప్పరి సందీప్, చెక్క సత్తయ్య మానెగళ్ల పుల్లయ్య, చొప్పరి రోషయ్య, కావిటి కర్ణాకర్, రాపాక లలితలపై కేసు నమోదయింది. నిందితులంతా తొలుత మూడు నెలల జైలుశిక్ష అనుభవించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కావిటి కర్ణాకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం ఈ కేసు తుది విచారణకు రాగా, భువనగిరి కోర్టు జడ్జి 14మందికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన భర్త చొప్పరి సత్యనారాయణ, భార్య చొప్పరి అంజమ్మ, కుమారుడు చొప్పరి శ్రావణ్ ఉన్నారు.

లక్క పురుగులు పట్టిన బియ్యంతో అన్నం

» ధర్మారం బీసీ సంక్షేమ వసతి గృహంలో వార్డెన్ నిర్వాకం

» ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

రామాయంపేట, జనవరి 30: మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం బీసీ సంక్షేమ వసతి గృహంలో లక్క పురుగులు పట్టిన బియ్యాన్ని అన్నం వండడంతో తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆరుగురు విద్యార్థులు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ, వాంతులు చేసుకుంటుండడంతో వారిని అదే గ్రామంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులకు మంగళవారం ఉదయం టిఫిన్‌కు బదులు అన్నం వడ్డించారు. పురుగులు పట్టిన బియ్యం వండడంతోనే భోజనం చేసిన తర్వాత విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. కొన్ని రోజులుగా పురుగులున్న బియ్యమే వండుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శంకర్‌నాయక్, తహసీల్దార్ రజనీ వసతిగృహానికి చేరుకుని పురుగుల బియ్యం చూసి ఇన్‌చార్జి వార్డెన్ స్వామిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

నేటితో ముగియనున్న సీఎంఆర్ గడువు!

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23)కి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ గడువు బుధవారంతో ముగియనుంది. గత సంవత్సరం ఖరీఫ్, యాసంగి సీజన్లకు సంబంధించిన బియ్యం బకాయిలు ఇంకా ఉన్నా మిల్లర్లు సకాలంలో తిరిగి బియ్యాన్ని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో.. మరో నెలరోజుల గడువు ఉంటే బియ్యం రికవరీ చేయొచ్చనే అభిప్రాయంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఢిల్లీకి వెళ్లి సీఎంఆర్ గడువు పొడిగింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. లేకపోతే రూ. 1,872 కోట్ల విలువ కలిగిన 4.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల వద్దనే ఉండిపోనుంది. అలాగే నిరుడు యాసంగి సీజన్ బియ్యం బకాయిలు 32.74 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయి. కాగా ధాన్యం టెండర్ల ప్రి బిడ్డింగ్ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సముచిత తీర్పు


గాజాలో ఇజ్రాయెల్ మానవహననానికి పాల్పడుతోందని దక్షిణాఫ్రికా వేసిన పిటిషన్‌మీద హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఇటీవల వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులు స్వాగతించదగినవి. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని చెప్పనందుకు, ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదని వ్యాఖ్యానించనందుకు ఎక్కువమందికి ఈ తీర్పు నచ్చనప్పటికీ, ఇజ్రాయెల్‌ను అది బాగానే తప్పుబట్టింది. అన్నీ కాకున్నా ఇజ్రాయెల్ చర్యలు అనేకం దక్షిణాఫ్రికా ఆరోపిస్తున్న జీనోసైడ్ కన్వెన్షన్ పరిధిలోకే వస్తాయని, గాజాకు మానవసాయం దక్కకుండా చేయడం, ఆస్పత్రులను ధ్వంసం చేయడం, జీనోసైడ్‌ను కీర్తించే వ్యాఖ్యలు చేయడం వంటివి కూడనివని న్యాయస్థానం ప్రకటించింది. హమాస్ తన నిర్బంధంలో ఉన్న బందీలను విడుదలచేయాలని కూడా అది తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తీర్పును కొన్ని ఇస్లామిక్ సంస్థలు తప్పుబట్టినప్పటికీ, హమాస్ స్వాగతించడం విశేషం.

సైనికచర్యను నిలిపివేయాలన్న మాట లేదుకదా అని ఇజ్రాయెల్, దాని మిత్రదేశాలు దీర్ఘాలు తీస్తున్నాయి కానీ, ఆ మాట అనకుండానే ఈ తీర్పు ఇజ్రాయెల్ దూకుడును తప్పుబట్టింది. పాతికవేలమందిని చంపి, ఇళ్ళు, ఆస్పత్రులు కూల్చి, నీరు, ఆహారం, మందులు లేకుండా చేసి, బయటనుంచి వచ్చే మానవసాయాన్ని నిరోధించడం ద్వారా, ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదంటూ దక్షిణాఫ్రికా వాదించిన నేపథ్యంలో, ఇజ్రాయెల్ చర్యలు ఆ దిశగానే ఉన్నాయని న్యాయస్థానం ఇలా ప్రాథమికదశలో, మధ్యంతర ఉత్తర్వుల్లోనే వ్యాఖ్యానించడం దక్షిణాఫ్రికా విజయమే. ఇజ్రాయెల్ సత్వరమే తీసుకోవాల్సిన చర్యలను వివరించడం ద్వారా పదిహేనుమంది న్యాయమూర్తులు జీనోసైడ్‌ను అడ్డుకోవాల్సిన కర్తవ్యాన్ని తమవంతుగా నిర్వర్తించారు. ఆస్పత్రులు, రక్షితస్థలాలు, జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో సైతం ఇజ్రాయెల్ అమానుషంగా వ్యవహరిస్తున్న తరుణంలో, ఆ చర్యలను ఎత్తిచూపడం, కూడదని చెప్పడం అవసరం.

ఐసీజేలో ఒక్కముక్క తనకు వ్యతిరేకంగా వచ్చినా తనమీద మిగతా ప్రపంచం ఒత్తిడిపెరుగుతుందని ఇజ్రాయెల్‌కు తెలుసు. ఎన్నడూ ఐసీజే మెట్లు ఎక్కని ఆ దేశం ఈ కారణంగానే ఉద్దండులైన న్యాయవాదులను మోహరించి, దక్షిణాఫ్రికా వాదనలను పూర్వపక్షం చేసేందుకు శతథా ప్రయత్నించింది. హమాస్ దుశ్చర్యలివిగో అంటూ చాలా వీడియోలను ప్రదర్శించింది. అయినప్పటికీ, గాజా పూర్తిగా నేలమట్టమై, 85శాతం మంది నిర్వాసితులై, గర్భిణీలకు వైద్యం అందని, పసికందులకు ఆక్సిజన్ దక్కని పరిస్థితుల సృష్టివెనుక ఇజ్రాయెల్ లక్ష్యం ఏమిటో ఐసీజేకు అర్థమయ్యే ఉంటుంది. మానవసాయానికి సంబంధించిన తన ఆదేశాల అమలుపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఇజ్రాయెల్‌పై ఐసీజే ఒత్తిడిపెంచింది కూడా ఇందుకే. తమ మిత్రదేశాన్ని ఐసీజే తప్పుబట్టినందుకు కాబోలు ఐక్యరాజ్యసమితి ఏజెన్సీ ఒకదానికి వెంటనే అమెరికా, ఆ తరువాత చాలా పాశ్చాత్య దేశాలు ఆర్థికసాయాన్ని నిలిపివేశాయి. 'యుఎన్ఆర్‌డబ్ల్యూఏ'లో పనిచేస్తున్న స్థానిక సిబ్బంది హమాస్ దాడిలో పాలుపంచుకున్నారంటూ ఇజ్రాయెల్ అమెరికాకు సాక్ష్యాలు అందించడం, ఈ సంస్థకు ఆర్థికసాయం నిలిచిపోవడం విచిత్రమైన పరిణామం.

తక్షణ కాల్పుల విరమణ కోసం దక్షిణాఫ్రికా చేసిన ప్రయత్నం ఫలించకపోయినప్పటికీ, ఈ మధ్యంతర ఉత్తర్వులు ఇజ్రాయెల్ మిత్రదేశాల మీద నైతిక ఒత్తిడి తెచ్చేందుకు ఉపకరిస్తాయి. ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకలమీద హౌతీలు దాడులు చేస్తున్నందుకు ప్రతిగా అమెరికా యెమెన్‌లో దాడులు చేస్తున్నది. అమెరికా దాడులు హౌతీలను నిలువరిస్తున్నాయా? అన్న ప్రశ్నకు లేదని సమాధానం చెప్పారు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్. మరి వాటిని కొనసాగిస్తారా? అన్న ప్రశ్నకు అవును అన్నారాయన. ఇరాన్ మద్దతున్న ఉగ్రవాదసంస్థలని అమెరికా అంటున్నవన్నీ ఎంతటి ప్రతిఘటన ఎదురైనా వెనక్కుతగ్గడం లేదు. ఆదివారం జోర్డన్—సిరియా సరిహద్దులో జరిగిన దాడిలో ముగ్గురు అమెరికా సైనికులు మరణించినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని బైడెన్ శపథం చేశారు. గాజా యుద్ధం ఆరంభమైన తరువాత, దానితో ముడిపడిన ఒకదాడిలో తమ సైనికులు మరణించిన విషయాన్ని అమెరికా ధ్రువీకరించడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై గత నాలుగునెలల్లో వందలాది దాడులు జరిగాయి. ప్రతీకారం పేరిట అది తీసుకొనే చర్యలతో యుద్ధం విస్తరిస్తోంది. ఇజ్రాయెల్ ను నిలువరించి, మానవసాయానికి వీలుకల్పించి, అతివేగంగా కాల్పులవిరమణ అమలు జరగందే ఈ విషవలయాన్ని ఛేదించడం అసాధ్యం.

మోదీ జిత్తులతో విపక్షాలు చిత్తు...!



బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మూలంగా ఏర్పడిన భావోద్వేగాలపైనే మోదీ నమ్మకం పెట్టుకోలేదని, విపక్షాల ఎజెండా, ఐక్యతను దెబ్బగొట్టేందుకు ఆయన ఎంతో ముందుగా వ్యూహరచన చేసి పెట్టుకున్నారని గత కొద్ది రోజులుగా బిహార్‌లో సంభవిస్తున్న పరిణామాలను బట్టి ఎవరికైనా అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో బిహార్ నుంచి ఎన్డీఏ 39 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసినవారెవరైనా బిహార్‌ను మోదీ వదిలివేస్తారని ఎలా అనుకుంటారు? జెడి(యు), ఆర్‌జెడి, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే 2019 ఫలితాలు తారుమారవుతాయని భావించినందువల్లే మోదీ చక్రం తిప్పారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రజల శ్రేయస్సు, సిద్ధాంతాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు, అధికార సాధనకే మెజారిటీ రాజకీయ పక్షాలు ప్రాధాన్యమిస్తున్నాయని బిహార్‌లో నితీశ్ కుమార్ మళ్లీ ఎన్డీఏ ఒడిలో చేరడంతో మరోసారి రుజువైంది. లేకపోతే డిసెంబర్‌లో పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'ఇండియా' కూటమికి చెందిన దాదాపు 150 ఎంపీలతో పాటు తన పార్టీకి చెందిన ఎంపీలను కూడా మోదీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా బహిష్కరించిన విషయాన్ని నితీశ్ ఇంతలోనే ఎలా మరచిపోయారు? మర్యాదపురుషోత్తముడు, రామరాజ్య స్థాపకుడు, అధికారాన్ని తృణప్రాయంగా విసర్జించాడని, ప్రజల నిందలకు విలువ ఇచ్చేవాడని గుర్తింపు పొందిన శ్రీరాముడికి ప్రాణప్రతిష్ఠ చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం ఆలయం నుంచి బయటకు రాగానే సార్వత్రిక ఎన్నికల తర్వాత మూడోసారి ఎలా అధికారంలోకి రావాలా అన్న విషయంపైనే అధికంగా దృష్టి సారించడంలో ఆశ్చర్యం లేదు.

రాముడి ప్రాణప్రతిష్ఠ మూలంగా ఏర్పడిన భావోద్వేగాలు, తన పాలన, వ్యక్తిగత ఆకర్షణ పైనే మోదీ నమ్మకం పెట్టుకోలేదని, ప్రతిపక్షాల ఎజెండాను, ఐక్యతను దెబ్బగొట్టడంతో పాటు వాటిని కకావికలం చేయడం గురించి కూడా ఆయన ఎంతో ముందుగా వ్యూహరచన చేసి పెట్టుకున్నారని గత కొద్ది రోజులుగా సంభవిస్తున్న పరిణామాలను బట్టి ఎవరికైనా అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో బిహార్ నుంచి ఎన్డీఏ 39 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసినవారెవరైనా బిహార్‌ను మోదీ వదిలివేస్తారని ఎలా అనుకుంటారు? జెడి(యు), ఆర్‌జెడి, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కలిసి పోటీ చేస్తే 2019 ఫలితాలు తారుమారవుతాయని భావించినందువల్లే ఆయన చక్రం తిప్పారు.

అంతే కాదు, మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడం, రామమందిర భావోద్వేగాలు సృష్టించడంతోనే 'ఇండియా' కూటమి నేతల్లో భవిష్యత్ పట్ల అయోమయం ఏర్పడిందనడంలో సందేహం లేదు. ఈ సమయంలోనే మోదీ వెనువెంటనే పావులు కదిపి బిహార్ నేత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం, నితీశ్‌ను ఎన్డీఏలో చేర్చుకోవడం వ్యూహాత్మకంగా జరిగింది. ఉత్తరాది రాష్ట్రాల్లో విజయం తర్వాత మోదీ దూకుడుగా వ్యవహరించి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష ఎంపీలందర్నీ గెంటేసి కీలకమైన బిల్లులను ఇష్టారాజ్యంగా ఆమోదించుకున్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జోడో యాత్ర బిహార్‌లో ప్రవేశిస్తున్న సమయంలో, పార్లమెంట్ చివరి సమావేశాలు జరుగుతున్న సమయంలో నితీశ్‌ను చేరదీసి ప్రతిపక్షాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారు. 'ఇండియా కూటమి నుంచి నితీశ్ వైదొలగడం రాత్రికిరాత్రి జరిగిన పరిణామం కాదు. చాలా ముందుగా పథకం ప్రకారం జరిగిన కుట్ర' అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇప్పుడు బాధపడితే లాభం ఏమిటి?

దేశ రాజకీయాల్లో బీజేపీ ధాటిని చూసి భయపడిన నితీశ్ మోదీ రక్షణలో చేరడమే మంచిదని భావించవచ్చు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండానే దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న నితీశ్ కుమార్‌కు రాజకీయాల్లో ఎలా మనుగడ సాగించాలో తెలుసు. ఎమ్మెల్సీగా ఉంటూనే సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ ప్రాప్తకాలజ్ఞత వల్లే తొమ్మిదోసారి ముఖ్యమంత్రి కాగలిగారు. ఈ రికార్డుతోనే ఆయన తన జీవిత చరమాంకం క్షేమంగా గడపాలని నిర్ణయించుకున్నారు. దేశంలో రాజకీయాల ప్రమాణాలు రోజురోజుకూ క్షీణిస్తున్న సమయంలో విలువల గురించి ఆలోచించడం వృథా అని ఆయన భావించి ఉంటారు. అదే సమయంలో బిహార్ రాజకీయాల్లో నితీశ్‌కు ఎంతో కొంత బలం లేకపోతే ప్రతి పార్టీ ఆయనతో చేతులు కలపాలని ఎందుకు అనుకుంటుంది అన్న విషయం కూడా ఆలోచించాలి. 2013, 2017, 2022లో మూడుసార్లు బీజేపీని వదుల్చుకున్నప్పుడు నితీశ్‌ను ఘోరంగా తిట్టిపోసిన ఆ పార్టీ నేతలు నాలుగోసారి 2024లో ఆయనను ఎందుకు అక్కున చేర్చుకున్నారు? ఇది బీజేపీ నైతికతకు సంబంధించిన విషయం కాదు, దాని రాజకీయ అవసరానికి సంబంధించిన విషయం. అదే సమయంలో ఆర్‌జెడి, కాంగ్రెస్‌లు కూడా నితీశ్ తమవైపు ఎన్నిసార్లు వచ్చినా అన్నిసార్లు ఆలింగనం చేసుకున్న విషయం మరిచిపోరాదు.

బీజేపీ వర్గాల ప్రకారం కోయి, కుర్మీ, ధనుక్ వంటి యాదవేతర ఓట్లలో అత్యధికులు నితీశ్ వైపు ఉన్నారు. 14 శాతం యాదవులను మినహాయిస్తే, మిగిలిన 13 శాతం ఎన్డీఏ వైపు మళ్లించేందుకు బీజేపీ కృషి చేస్తోంది. నితీశ్ చొరవతోనే తొలుత ఇండియా కూటమికి కదలిక ఏర్పడింది. సీ ఓటర్ సర్వే ప్రకారం ఈసారి 40 లోక్‌సభ సీట్లలో సగానికిపైగా మహా కూటమికి లభిస్తాయని తేలింది. ఒకవైపు ప్రతిపక్షాల అవకాశాలను దెబ్బతీస్తూనే బిహార్‌లో బలోపేతం అయ్యేందుకు నితీశ్‌తో బీజేపీ చేతులు కలిపింది. ఇప్పటికే చిరాగ్ పాశ్వాన్, జితన్‌రాం మాంఝీ బీజేపీతో ఉన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్‌కు వ్యతిరేకంగా నితీశ్ కుమార్ రంగంలోకి దిగినప్పుడు లవకుశ రాజకీయాలను ఉపయోగించుకుని కుశావహ నేత శకుని చౌదరిని తన వెంట ఉంచుకున్నారని బిహార్‌కు చెందిన ఒక సీనియర్ జర్నలిస్టు తెలిపారు. ఇప్పుడు శకుని చౌదరి కుమారుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాట్ చౌదరిని ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. అంటే అతి వెనుకబడిన వర్గాలు, దళితులు, మహాదళితులను తన వైపు తిప్పుకునేందుకు మోదీ ఒక పథకం ప్రకారం వ్యవహరించారు. అదే సమయంలో అగ్రవర్ణాలకు చెందిన విజయసిన్హాను రెండో డిప్యూటీ ముఖ్యమంత్రిగా నియమించి వారికి కూడా బీజేపీ తగిన సంకేతాలను పంపింది.

బిహార్‌లో జరుగుతున్నది దేశ రాజకీయాలకు అద్దం పడుతోంది. దేశంలో మెజారిటీ పార్టీలకు నైతికత కానీ, సైద్ధాంతికత కానీ, లేవు. జనతాదళ్ (ఎస్) నేత దేవెగౌడ కూడా నితీశ్‌కు తక్కువేం కాదు. పలుసార్లు ఈ పార్టీ బీజేపీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బిఎస్‌పి చేతులు కలపని పార్టీ అంటూ లేదు. డీఎంకే, అన్నాడీఎంకే కూడా పొత్తులు మారుస్తూ వచ్చాయి. కనుక బిహార్‌లో జరుగుతున్నది ప్రత్యేకమైన విషయం ఎంత మాత్రమూ కాదు. అయినప్పటికీ ప్రతిపక్షాలు కాడిని పడేయాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇక ప్రజాస్వామ్యాన్ని మరిచిపోవాల్సిందే అని మల్లికార్జున ఖర్గే అనడం ఆయనలోని భయాన్ని సూచిస్తోంది. కాని జరుగుతున్న పరిణామాలు మోదీలో భయాన్నే ఎక్కువగా సూచిస్తున్నాయి. ఇండియా కూటమి జనతా ప్రయోగం మాదిరి సంఘటితం అవుతుందని భయపడినందువల్లే ప్రతిపక్షాలను కుప్పకూల్చేందుకు ఆయన విజృంభిస్తున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీకి 37.3 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. ప్రతిపక్షాల ఓట్లు చీలిపోవడం ద్వారానే ఆయన విజయం సాధించగలిగారు. 2024 ఎన్నికల్లో మోదీ బీజేపీ 50 శాతం పైగా సాధించాలని పార్టీ నేతలను ఉత్సాహపరుస్తున్నప్పటికీ 63 శాతం బీజేపీ యేతర ఓట్లను చీల్చనిదే అది సాధ్యం కాదని ఆయనకు తెలియనిది కాదు. ఆ దిశగ ఆయన ఎత్తుగడలు సాగుతున్నాయి.

భారతదేశ రాజకీయాలను పూర్తిగా నియంత్రించేందుకు రానున్న రోజుల్లో మోదీ ఇంకా ఎన్ని ఆయుధాలను ప్రయోగిస్తారో ఊహించలేము. అవి ప్రజాస్వామికమా, అప్రజాస్వామికమా అన్న ప్రశ్నలను బీజేపీ పట్టించుకోదని చండీగఢ్‌లో జరిగిన మేయర్ ఎన్నిక తీరు, లోక్‌సభ ఎన్నికల సమయంలో బిహార్, జార్ఖండ్‌లో ఈడీ సెంహారం స్పష్టం చేస్తున్నాయి. బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్‌ను మనీలాండరింగ్ కేసులో పదిగంటలకు పైగా విచారణ జరపడం ఇప్పటికే దెబ్బతిన్న మహా కూటమిని మరింత బలహీనపరచే చర్యల్లో భాగమే. జెఎంఎం కనుక ఎన్డీఏలో ఉండి ఉంటే ఇప్పుడు ఈడీ ధాటికి తట్టుకోలేక ముఖ్యమంత్రి హేమంత సోరెన్ ఎక్కడో తలదాచుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. చండీగఢ్‌లో మేయర్ పదవి పొందడం కోసం ప్రతిపక్షాలకు చెందిన 8 ఓట్లు చెల్లవని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజని, ఒక్క మేయర్ పదవికోసమే బీజేపీ ఇంత దిగజారితే ఇక లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు ఎంతకైనా దిగజారవచ్చని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించాయి.

అయితే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు మోదీ సర్వశక్తులు ఒడ్డుతారని ఎవరైనా తెలియకపోతే అది అమాయకత్వమే అవుతుంది. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే తమ మనుగడ ఏమవుతుందో అని కొన్ని రాజకీయ పార్టీలు భయపడడం, మరి కొన్ని రాజకీయ పార్టీలు ఈ భయంతోనే మోదీ అండదండలకు ప్రయత్నించడం సహజమే. నిజంగానే మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అసలు ప్రతిపక్షమే ఉండకపోవచ్చు. కాని ఈ భయం ప్రజల్లో ఏర్పడిందా? ఆ భయం చైతన్యంగా మారుతోందా? అలా మార్చే ప్రయత్నాల్లో ఈ పార్టీలు ఎంతవరకు కార్యసాధకం కాగలుతున్నాయి? మోదీలోని ఏ లక్షణాలు ప్రజల్లో ఆయన పట్ల సానుకూలత ఏర్పరుస్తున్నాయి? దక్షిణాదిన తెలంగాణ, కర్ణాటకలో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సాధించలేకపోతోంది? జాతీయ స్థాయిలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పర్చుకోవడం మాత్రమే కాదు, ఈ ప్రత్యామ్నాయాన్ని నీరుకార్చేందుకు చేసే ప్రయత్నాలను వమ్ము చేసే నాయకత్వం కూడా దేశానికి అవసరం. ఈ లోటు స్పష్టంగా కనపడుతోంది.

కొల్లేరు పరిరక్షణకోసం అరుణోదయ పాట!

మా చిన్నతనంలో కొల్లేరును ఒక పాఠ్యాంశంగా మాత్రమే చదువుకుని ఉన్న నాకు గత కొంతకాలంగా కొల్లేరును కబ్జాల సంబంధిత వార్తలుగా చూడాల్సివస్తోంది. స్థానిక మత్స్యకార్ల ప్రజా నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి ఆహ్వానం మేరకు అరుణోదయ బృందంతో కలిసి కొల్లేరు పర్యటించిన నాకు ఉత్తరాసియా, తూర్పు యూరప్ దేశాల నుండి సుమారు లక్షల సంఖ్యలో వచ్చే 150 రకాలు పక్షులు రోజురోజుకు తగ్గిపోతుండడం, అనాదిగా చేపల వృత్తిపైన ఆధారపడుతున్న మత్స్యకారులు (వడ్డీలు) వలసబాట పడుతుండడం మనసును కలచివేసింది. 673 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి 122 గ్రామాలకు అందులో (94 లంక గ్రామాలు), లక్షలాది ప్రజలకు జీవనాధారంగా ఉన్న కొల్లేరులో ఏ రవాణా సౌకర్యాలు లేని కాలంలో కూడా తాటి దోనెలపై తిరుగాడుతూ వలసలు లేకుండా బతికిన మనుషులున్నారు. నూటికి 90 శాతం ఈ ప్రాంతంలో విస్తరించిన సంప్రదాయ మత్స్యకారులైన వడ్డీల వారు అన్ని కులాల వారిని మత్స్యకారులుగానే అక్కున చేర్చుకున్నారు. కానీ అట్లా పక్షులకు, కొల్లేరు కుటుంబాలకు జీవనాధారమైన చేపలు జల కాలుష్యంతో తగ్గుముఖం పడుతుండడం, మంచినీటి సరస్సు మధ్యలో జీవిస్తున్న ప్రజలే మంచినీటికి కటకటలాడుతుండడం ఆశ్చర్యం గొలిపే వైపరీత్యం. కాంటూరులో మార్పులతో వైశాల్యం తగ్గినా సమస్యలు మాత్రం తగ్గడం లేదు.



ప్రభుత్వాల అసంబద్ధ విధానాల పైనా, కొల్లేరు ఆక్రమణదారులపైనా జరిగే స్థానిక ప్రజల పోరాటమే కొల్లేటి పక్షులను, మనుషులను, అనాదిగా వస్తున్న ప్రజల జీవనాధారాన్ని కాపాడగలదని భావిస్తూ మా అరుణోదయ బృందం స్థానికులతో కలిసి కొల్లేటి పాట రూపొందించింది.

1999 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం కొల్లేరులోని 1,66,000 ఎకరాలను 1972 అభయారణ్యం చట్టం కింద పక్షుల అభయారణ్య ప్రాంతంగా ప్రకటించింది. దాని మూలంగా స్వేచ్ఛాయుతమైన కొల్లేరు ప్రజల జీవితం ఒక్కసారిగా కేంద్ర ప్రభుత్వం నియంత్రణలోకి వచ్చినట్లయింది. ప్రైవేటు ఆక్రమణలను అరికట్టే పేరిట రాష్ట్ర ప్రభుత్వం 2006లో ఆపరేషన్ కొల్లేరు అమలు జరిపింది. ఇది కొల్లేరు జిరాయితీ భూములు, సొసైటీ చెరువులను సైతం కూల్చడంతో ప్రజల జీవితాల్లో అల్లకల్లోలం కలిగించింది. ఆ వెన్వెంటనే 2007లో దీనిని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించారు. దాదాపు 100 గ్రామాల ప్రజల భవిష్యత్తును అగమ్యగోచరం చేసే ఈ చర్యను అంతా ఖండించారు. ఇంత చేసినా కొల్లేరులోని సహజ సిద్ధమైన వృక్ష—జంతు జాలాన్ని రక్షించింది లేదు, మంచినీటికి పూర్వ కళ వచ్చింది లేదు. ఒకవైపు తీరం పొడవునా కోస్తా కారిడార్ పేరిట కాలుష్య కారక ఫార్మా కంపెనీలకు, గోప్యంగా అణు రియాక్టర్లకు అనుమతులతో లక్షలాది తీర ప్రాంత ప్రజల జీవితాలతో పాలకులు చెలగాటమాడుతున్నారు. ఇలాంటి ఏలికలే కొల్లేరును పర్యావరణ సురక్షిత ప్రాంతంగా చేస్తామని ఎందుకు హడావిడి చేస్తున్నారు? కొల్లేరు భవిష్యత్తును నిర్ణయించుకునే కొల్లేరు డెవలప్‌మెంట్ బోర్డును ఎందుకు మూలకు పడేసినట్టు? 2014 పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ భీమవరం సభలో హామీ ఇచ్చినట్లు కొల్లేరును మూడవ కాంటూరు (+3 contour) లోనికి మారుస్తానన్న హామీ ఎందుకు అమలు జరగనట్టు? ఇవన్నీ ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. కొల్లేటి మంచినీటి సరస్సును వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్షులు సైతం అక్టోబర్ నుంచి మార్చి వరకు తమకు ఆవాస కేంద్రంగా ఎలా గుర్తించాయో, అలాగే టూరిజం పేరిట కొల్లేరును తనఖా వస్తువుగా గుర్తించి అంతర్జాతీయ మార్కెట్లో వేలకోట్ల రూపాయలను పాలకులు అప్పులుగా పొందుతున్నారు. కానీ టూరిజం కోసం కొల్లేరులో కట్టిన టూరిస్ట్ బంగ్లా పవన్ కళ్యాణ్, మా అరుణోదయ బృందాలు పర్యటించినప్పుడు పాడుబడ్డ పశువుల కొట్టంలా ఉన్నది. ఇటీవలనే దానికి రంగులు వేసి బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చారు. కానీ 7500 ఎకరాల భూమి కొల్లేరు ప్రజలకే అందించాలన్న హామీ మాత్రం నేటికి అమలు కాలేదు.

చిరంజీవి, జయప్రకాశ్ నారాయణ, జేడీ లక్ష్మీనారాయణ, పవన్ కళ్యాణ్ తదితరులెంతో మంది కొల్లేరు ప్రజల సమస్యలెన్నో లేవనెత్తారు. ఈ ప్రాంత సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ తదితరులు అధికారులకు, మంత్రులకు "కొల్లేటి జనశక్తి" పేరున అనేక విజ్ఞప్తులు చేయడమే కాకుండా కొల్లేటిపై మమకారంతో లెక్కకు మించి సాహిత్యం వెలువరించారు. ప్రపంచ చిత్తడి నేలలపై (wet lands) పనిచేస్తున్న రామ్‌సర్ కన్వెన్షన్ 2002 ఆగస్టులో కొల్లేటి పక్షులకు—వడ్డీల వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తించింది. వడ్డీల వారి సంప్రదాయ చేపల వేటను, సంస్కృతిని ఆమోదించింది. 2,22,000 ఎకరాల్లో జరిగే చేపల వేటను ఆమోదించింది. ఈ అంశం కొల్లేరు అంటే పక్షులు—మనుషులు అన్నదానికి బలం చేకూర్చింది. ఇప్పుడే కాదు, రామాయణ గాథల్లోనూ కొల్లేరు ప్రస్తావన ఉన్నదని చిలుకూరు వీరభద్రరావు ఆంధ్రుల చరిత్ర ప్రథమ భాగంలో పేర్కొన్నారు. దండి కవి రాసిన దశకుమార చరిత్రలోనూ, చైనా బౌద్ధ యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ పర్యటనలోను, కొల్లేటిలో దొరికిన 15వ శతాబ్దపు రాగి రేకుల్లోనూ, పెద్దింట్లమ్మ జాతరలోనూ, కొల్లేటి మానవ నివాసం గురించి చరిత్ర ఉంది.

అందుకే, ప్రభుత్వాల అసంబద్ధ విధానాల పైనా, కొల్లేరు ఆక్రమణదారులపైనా జరిగే స్థానిక ప్రజల పోరాటమే కొల్లేటి పక్షులను, మనుషులను, అనాదిగా వస్తున్న ప్రజల జీవనాధారాన్ని కాపాడగలదని భావిస్తూ మా అరుణోదయ బృందం స్థానికులతో కలిసి కొల్లేటి పాట రూపొందించింది. నేడు ఏలూరులోని YHMA హాలులో ఉ. 10 గం.లకు ఆవిష్కరణ సభ. కొల్లేటి పరిరక్షణ ఉద్యమ దిశగా కొల్లేటి వాసులతో కలిసి అరుణోదయ అదే పాటను బతుకు పోరాటంగా మలుచుకునే ఆచరణాత్మక సభ ఇది. కొల్లేరు డిక్లరేషన్‌తో ఆవిష్కరణ సభ పార్టీలకతీతంగా జరుగుతుంది.

■ అరుణోదయ విమలక్క

(నేడు ఏలూరులో కొల్లేరు పరిరక్షణ పాట ఆవిష్కరణ)

రాజ్యాంగం చెప్పిందే రాహుల్ చేస్తున్నాడు..!

'పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట' అని చెప్పుకున్నాడు మహాకవి పోతనామాత్యుడు. సమకాలీన భారత రాజకీయాల్లో రాహుల్ గాంధీ కూడా తాను సామాన్యుడనని, భారత ప్రజలు గొప్పవారని, తనను భారత రాజ్యాంగమే నడిపిస్తున్నదని అంటున్నారు. భారత ప్రజలు తమకు తాము సమర్పించుకున్న రాజ్యాంగ పీఠికను దేశ ప్రజలకు మరోసారి గుర్తుచేయడానికి భారత్ జోడో న్యాయ్ యాత్ర చేస్తున్నారు. కోట్లాది మంది భారతీయుల హృదయాలను కలుపుతున్నారు, భరతమాత ముద్దు బిడ్డలంతా ఏకం కావాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రజలమధ్య సహోదర భావాన్ని పెంచాలన్న లక్ష్యంతో ఆయన ఈ కార్యాచరణకు పూనుకున్నారు, యావత్ భారతావని వెన్నంటి నడుస్తున్నది.

కాలగమనంలో మార్పు అనివార్యం అయినప్పటికీ, గడిచిన పదేళ్ల కాలంలో మన దేశంలో వచ్చిన మార్పు ఏ దిశలో ఉందనేది ముఖ్యం. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లు మన రాజ్యాంగ ఖ్యాతి మరింత ఇనుమడింపచేసేలా పాలించారు. దేశం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించారు. నవభారతం మున్ముందుకు సాగేందుకు బాటలు వేసిన నెహ్రూ బహుళార్థక సాధక ప్రాజెక్టుల నుండి శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించే దిశగా దేశాన్ని నడిపించారు. ఆ తరువాత ఇందిరాగాంధీ భూ సంస్కరణలతో, బ్యాంకుల జాతీయీకరణతో సంక్షేమానికి పునాదులు వేశారు. సమాచార, సాంకేతిక పరిజ్ఞానం భారతదేశాన్ని సంపూర్ణంగా మారుస్తుందనే దూరదృష్టితో ఆధునిక, సాంకేతిక పురోగతికి బీజం వేసినవారు రాజీవ్ గాంధీ. నేటి ఐటి విప్లవానికి, కోట్లాదిమంది ఐటి ఉద్యోగులు రావడానికి, లక్షల కోట్ల విదేశీమారకద్రవ్యం ఇండియాకు రావడానికి పాదులు వేశారు ఆయన. ఇట్లా సర్వజనహితాన్ని కోరుకున్నది రాహుల్ గాంధీ కుటుంబం. ప్రస్తుతం దేశ ప్రజల్లో రగులుతున్న వివిధ రకాల విద్వేషాలు గమనిస్తున్నాం, ఆందోళన చెందుతున్నాం. వేలాది కుటుంబాలు వీధిపాలవుతున్నాయి. సమాజం తలదించుకునే ఘటనలు చోటు చేసుకున్నాయి. కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమనే భావన ఇప్పుడు ప్రమాదంలో పడింది. మణిపూర్ మండుతోంది, ఈశాన్యం రగులుతోంది. అందుకే రాహుల్ తన రెండో విడతయాత్ర అక్కడి నుండే ప్రారంభించారు. ప్రజలు ఆయనకు హారతులు పడుతున్నారు, కలిసి నడుస్తున్నారు. ఈ దేశ ప్రజల జీవితానికి, ఆలోచనకు, మానవ సంబంధాలకు ప్రతీక కాంగ్రెస్. ఈ దేశంలో ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవడానికి కారణం కాంగ్రెస్.

వాట్సప్ యూనివర్సిటీ తప్పుడు ప్రచారాలు ప్రజల మనస్సులను కలుషితం చేస్తున్నాయని మేధావులంతా ఆవేదనకు లోనవుతున్న కాలమిది. రాహుల్ యాత్ర ఆ దుష్ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తుంది. రాహుల్ గాంధీ తపన గురించి, ప్రజల మనసుల్లో ఆయన యాత్ర చూపే ప్రభావం గురించి ప్రపంచ మీడియా కథనాలు రాస్తోంది. సంక్షుభిత కాలంలో ఈ దేశ ప్రజాస్వామ్యానికి ఆయనో టార్చిలైట్. ప్రజాస్వామ్యం సురక్షితంగా మనగలగాలంటే కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండటం చారిత్రకావసరం. చట్టసభల్లో అది తన వాణి విన్పించడం అనివార్యం. దక్షిణాదిన కర్ణాటక, తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా పాలనను అందిస్తున్నాయి. 'భారతీయుల మైన మేము' అనే ప్రాథమిక విలువకు అనుగుణంగా, రాజ్యాంగ హితంగా ఆచరణలో నడుచుకుంటున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించినప్పుడు ఈ ప్రజాపాలన నూటనలభై కోట్ల మందికి చేరుతుంది, రాజ్యాంగ విలువలను, సర్వమానవ సమానత్వాన్ని కాపాడటమూ సాధ్యపడుతుంది.

– చల్లా తేజ

(కాంగ్రెస్ నాయకుడు, భువనగిరి)

గద్దర్‌కు ఏది నిజమైన నివాళి?

ప్రస్తుతం గద్దర్ లేని సమాజాన్ని చూస్తున్నాం. ఆయన పాడిన పాటల సవ్వడి తప్ప, ఆయన అలికిడి కానరాని సమయం ఇది. ముఖ్యంగా మా తరం ఆయనను చూడగలిగింది. ఆయనతో కలిసి నడవగలిగింది. ఈ అవకాశం రేపటి తరాలకు కలుగబోదు. తెలంగాణ ఉద్యమంలో 'శాంతియాత్ర' పేరుతో ఊరూరా పాదయాత్ర చేసిన గద్దర్ పాదముద్రలు ఇంకా చెరిగిపోలేదు. జననాట్యమండలి నుండి ధూంధాం వేదికల దాకా అంతెత్తున ఎగిరి దునికిన ఆ పాటల మత్తడి ఆగిపోయింది. ఆయన లేడనే నిజం ఇంకా జీర్ణించుకోలేకుండానే ఉంది. అకస్మాత్తుగా ఆయన లేడనే విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా గుండె బరువెక్కుతోంది. కనురెప్పల మీద కన్నీటి పొర ఒకటి కమ్ముకుంటున్నది.

అది 2022. డిసెంబర్ నెల. 'పోటెత్తిన పాట' పుస్తక ఆవిష్కరణ సభ. గద్దరన్న చేసిన భావోద్వేగ ప్రసంగం ఇంకా కళ్లముందే మెదులుతూనే ఉంది. "తెలంగాణలో సాంస్కృతిక విప్లవం రావాలి. కవులు, కళాకారులు ప్రశ్నించేవైపు నిలబడాలి" అని ఒక పిలుపు ఇచ్చాడు. ఈ పిలుపు ఇచ్చే సమయానికి ఆయన వయసు ఏడు పదులు దాటింది. అంత వయసు వచ్చినా ఆయనలో అలసట, అలుపు లేదు. మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలన్నంత చైతన్యం సిద్ధంగా ఉంది. సమాజ విముక్తి తప్ప, వ్యక్తిగత ఆశలు లేవు. బహుశా గద్దర్‌లో ఉండే ఈ పోరాటతత్వమే ఆయనను నిత్యచైతన్యశీలిగా మార్చింది. ఏ ప్రజాసమస్య వచ్చినా దాని మీద పాటలు అల్లిపాడడం, ప్రజలను ఆలోచింపజేయడం, దాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లడానికి గల్లీ నుండి ఢిల్లీ దాకైనా ఫైట్ చేయడం ఆయన నిత్య కార్యచరణగా మారింది. అందుకే గద్దర్ అన్ని సమూహాలకు ఇష్టుడిగా మారాడు.

ఇక ఆయన పాటలు ప్రజల మీద వేసిన ప్రభావాన్ని అంచనా వేయడానికి పలువురు పలురకాల ప్రయత్నాలు చేశారు. వర్గదృక్పథంతో చూసిన వాళ్లు కొందరు, ప్రాంతీయ స్పృహతో లెక్కగట్టినవారు ఇంకొందరు. ఇక అంబేడ్కరైట్ సిద్ధాంత భూమికతో బహుజన విముక్తి కోణంలో గద్దర్ చేసిన కృషిని వీక్షించినవారు మరికొందరు. ఇందరు ఇన్ని రకాలుగా చూసినా ఇంకా కొన్ని కోణాలు గద్దర్ పాటల్లో మిగిలే ఉంటాయి. అందుకే అది గద్దర్ పాట. ముఖ్యంగా ప్రజల భాషలో పాటలు అల్లి, ప్రజాసాహిత్యానికి మరింత గౌరవాన్ని తెచ్చిన కలం గద్దర్. లోతైన విషయాలను కూడా సులభతరంగా అర్థం చేయించగలిగిన శిల్పం గద్దర్ పాటల్లో ఉంది. అందుకే అవి జనం నోళ్లల్లో ఇంకా సజీవంగా ఉన్నాయి. ఈ రకమైన ఒరవడే తరువాత వచ్చిన ఉద్యమపాటలకు ఒక దారిని వేయగలిగింది.

ఒక సందర్భంలో రాయలసీమ సీనియర్ రచయిత బండి నారాయణస్వామి కథలు రాయడం ఎలా? అనే క్లాస్ చెబుతూ... కథ రాయాలంటే ముందు గద్దర్ పాట వినండి. అందులో జీవితం ఎలా వర్ణించబడిందో చూడండి. ఆ ముగింపులో ప్రజలను ఎట్లా ఆలోచింపజేశాడో గుర్తించండి అన్నారు. కథలు రాసే రచయితలకు మోడల్‌గా గద్దర్ పాటను చూపడం అంటే ఆ పాట ఎంతగా ప్రజల జీవితానికి అద్దం పట్టిందో అర్థం చేసుకోవచ్చు. అట్లా ప్రజల జీవితానికి అంత దగ్గరగా పాటలు అల్లడం జననాట్యమండలి కాలాన కొనసాగిన ఒక ట్రెండ్ అనే చెప్పాలి.

గ్రామీణ భారతంలోని సమాజ స్థితిగతులను, ప్రజాసంస్కృతిని, ప్రజా సంబంధాలను లోతుగా అర్థం చేసుకున్న దృష్టికోణం గద్దర్ పాటకుంది. అందుకే అది చూపున్న పాటైంది. విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల మీద తల్లిదండ్రుల అంతరంగ కోణం నుండి రాసిన 'వందనాలు వందనాలమ్మో' పాట అట్లా ఇంకెవ్వరూ రాయలేనంత గొప్పగా గద్దర్ సృజించగలిగాడు. అందులో ప్రజలకు, పనికి, ప్రకృతికి, పరిసరాలకు, పశుపక్ష్యాదులకు, కుటుంబ సంబంధాలకు ఉండే ఆత్మీయతలను, అనురాగాలను గొప్పగా పాటలోకి ఒంపినతీరు ఎవ్వరినైనా కట్టిపడేస్తుంది. గద్దర్ పాటలను గురించి ఎవ్వరికి నచ్చినవి వారు ఉదహరించవచ్చుగాని, గద్దర్ పాటల్లోని లోతును అర్థం చేసుకోవడానికి ఇలాంటి పాట ఒక్కటి చాలు. కడుపు కాలిన తల్లుల దుఃఖం, నేలరాలిన బిడ్డల త్యాగం ఏక కాలం కండ్లముందుకొచ్చి తచ్చాడుతుంది. ఇలాంటి పాటలను అవలీలగా అల్లగలిగాడు గద్దర్. అందుకు కారణం ప్రజల పట్ల, ప్రజాజీవితం పట్ల లోతైన అవగాహన కలిగి ఉండడమే. ముఖ్యంగా మన సమాజంలో ఏ వర్గపు ప్రజలు ఎలా నడుచుకుంటారో గద్దర్‌కు బాగా తెలుసు. అట్లాగే అట్టడుగున ఉండే ప్రజల జీవిత తాత్వికతను అర్థం చేసుకున్న ప్రజావాగ్గేయ సూఫీ గురువు గద్దర్.

గద్దర్ జీవితాన్ని రెండు భాగాలుగా అర్థం చేసుకోవచ్చు. బుల్లెట్ ద్వారానే ఈ దేశం విముక్తం అవుతుందని నమ్మిన దశ ఒకటైతే, బ్యాలెట్ ద్వారా, రాజ్యాంగ రక్షణ ద్వారా మాత్రమే ఈ పేదబీద జనాలకు స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం లభిస్తాయని భావించిన దశ రెండవది. బుల్లెట్, బ్యాలెట్ మార్గాలను ఎన్నుకునే సమయాల్లో ఎంతటి సంఘర్షణకు గురయ్యాడో ఇప్పుడు ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. గుంపులో గోవిందలాగే ఎవరో ప్రేరేపిస్తే, ఏమీ తెలియకుండా ఒక బాట వెంట నడుచుకుంటూ పోవడం ఎవరైనా చేయగలరు. కానీ, తనను నమ్ముకొని లక్షలాదిమంది ప్రజలు ఉన్నప్పుడు తను తీసుకునే ఒక స్టెప్ ఎందరినో ప్రభావితం చేస్తుంది. అనేక ప్రశ్నలు, సందేహాలను రేపుతుందని అనుకున్నప్పుడు, గద్దర్ తన స్థానం నుండి ఆలోచించినప్పుడు ఎంత సంఘర్షణను అనుభవించి ఉంటాడో ఊహించలేం. ఎన్నో సందిగ్ధతలు చుట్టుముట్టి ఉంటాయి. దగ్గరి స్నేహితులతో ఎన్నో చర్చలు చేయాల్సి వచ్చి ఉంటుంది. ఇంతకాలం నడిచిన దారిని కాదని సామాజిక అవసరాలు ముందుకు తెచ్చిన మార్గాలను అనుసరించాలనుకున్నప్పుడు గద్దర్ సాహసం చేశాడనే చెప్పొచ్చు.

ఒక సందర్భంలో రాయలసీమ సీనియర్ రచయిత బండి నారాయణస్వామి కథలు రాయడం ఎలా? అనే క్లాస్ చెబుతూ... కథ రాయాలంటే ముందు గద్దర్ పాట వినండి, అందులో జీవితం ఎలా వర్ణించబడిందో చూడండి, ఆ ముగింపుల్లో ప్రజలను ఎట్లా ఆలోచింపజేశాడో గుర్తించండి అన్నారు. కథలు రాసే రచయితలకు మోడల్‌గా గద్దర్ పాటను చూపడం అంటే ఆ పాట ఎంతగా ప్రజల జీవితానికి అద్దం పట్టిందో అర్థం చేసుకోవచ్చు.



సాధారణంగా ఏ ఐడియాలజీతో పరిచయం లేని దళితులు అంబేడ్కరీయ ఉద్యమంలోకి వెళ్లడం చాలా సహజం. మరి అదే నాలుగైదు దశాబ్దాలు విప్లవోద్యమంలో జీవించి, అనేక నిర్బంధాలను ఎదుర్కొని, చావో రేవో ఈ జెండాకిందే అని బతికిన ఒక వారియర్, తను ఆ మార్గాన్ని కాదనుకోవడానికి ఎంతో ధైర్యం కావాలి. ముఖ్యంగా కొత్తగా ఎత్తుకోబోతున్న మార్గం మీద అచంచల విశ్వాసం ఉండాలి. అట్లా గద్దర్‌కు ఓటు రాజకీయాల మీద, బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన రాజ్యాధికార 'మాస్టర్ కీ' మీద గురి కుదిరింది కాబట్టే ఆయనలో ఒక మార్పు మొదలైంది. అది ఆయన వేషంలోను వ్యక్తమైంది. సూటు, బూటు వేసిన తీరుగానే, పాటలో కూడా వస్తుమార్పును తెచ్చింది. 'బానిసలారా లెండిరా, ఈ బాంచెన్ బతుకులు వద్దురా...' అని పాడేలా చేసింది.

ఇవాళ గద్దర్ లేకపోవచ్చుగాని, అతని పాటలు నిరంతరం జనం గుండెల్లో సజీవంగానే ఉంటాయి. మరి పాటకోసం జీవితాన్ని ధారపోసిన గద్దర్‌ను గత పాలకులు దారుణంగా అవమానించారు. కొత్త పాలకులైనా తెలంగాణ పాటకు పట్టంకట్టాలి. పట్టం కట్టడమంటే ఒకరిద్దరికి ఎమ్మెల్సీలు ఇచ్చి, లేదా ఒక ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. తెలంగాణ వ్యాప్తంగా 70 వేల మంది జానపద కళాకారులున్నారు. అలాగే ఐదువేల మంది ఉద్యమ కళాకారులున్నారు. వీరందరిని ప్రభుత్వం పట్టించుకోవాలి. వారిని ఆదుకునే పేరుతో ఆంక్షలు పెట్టొద్దు. ఇప్పటికే సారథి కళాకారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రెండు మూడు నెలలకోసారి వస్తున్న జీతాలతో అతలాకుతలం అవుతున్నారు. మరి వారికి ఒక భరోసాను ఇవాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కార్ ముందు ఉంది. ఉద్యమంలో క్రియాశీలమైన పాత్రపోషించిన పాటలను రేపటి తరాల కోసం పదిలం చేయాలి. అందుకోసం ఒక 'ప్రజా సాంస్కృతిక విధానం' (కల్చరల్ పాలసీ) కావాలి. తెలంగాణ భాషా సంస్కృతులకు కొత్త జవజీవాలను అద్దాలి. అందులో భాగంగా ప్రజా కవులు, కళాకారులకు సముచిత గౌరవం కలిగించాలి. ముఖ్యంగా ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరు మీద ఒక కల్చరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. ఆయన అముద్రిత పాటల్ని పుస్తకాలుగా ముద్రించే బాధ్యతను స్వీకరించాలి. ఆయన పుట్టిన మెదక్ జిల్లాకు గద్దర్ పేరును పెట్టాలి. ఇవేవి చేయకుండా కేవలం ఆయన జయంతులు, వర్ధంతులు నిర్వహించి హడావుడి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అలాగే ఆ మహాకళాకారుని స్ఫూర్తితో నేటి కళాకారులు ప్రజాచైతన్యమే పరమావధిగా బహుజనుల విముక్తికి పునరంకితం కావాలి.

● డా. పసునూరి రవీందర్

(నేడు గద్దర్ జయంతి. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో పదిహేను అడుగుల గద్దర్ విగ్రహ ఆవిష్కరణ)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

'పార్క్'కు షాక్

మెగా టెక్స్‌టైల్ పార్కుకు దక్కని గ్రీన్ ఫీల్డ్ హోదా

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితం
- ఎస్‌పీఏ ఏర్పాటులో జాప్యం
- కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు గల్లంతు
- ఢిల్లీలో వాకబు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- తాజాగా ప్రతిపాదనలు చేసేందుకు చర్యలు



నిర్మాణంలో కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్



వరంగల్ జిల్లా గీసుగొండలో ఏర్పాటవుతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ)కి ఇప్పట్లో గ్రీన్ ఫీల్డ్ హోదా లభించే అవకాశాలు లేవు. పీఎం మిత్ర పథకంలో భాగంగా ఈ టెక్స్‌టైల్ పార్క్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇదివరకే లభించింది. అయితే బ్రౌన్ ఫీల్డ్ నుంచి గ్రీన్‌ఫీల్డ్‌గా మారితే ఈ పార్క్‌కు గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300కోట్ల నిధులు వస్తాయి. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల గ్రీన్ ఫీల్డ్ హోదా రాకుండా పోయింది. కేఎంటీపీకి గ్రీన్‌ఫీల్డ్ హోదా కల్పించాలని కోరుతూ గత ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించింది కానీ.. తర్వాత చర్యలను తీసుకోలేదు.

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని గీసుగొండలో మొత్తం 1200 ఎకరాలలో రూ.1500 కోట్ల వ్యయంతో కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటవుతోంది. పీఎం మిత్ర (మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్, అపరెల్) పార్క్‌ల పథకం కింద ఆమోదం పొందిన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులలో వరంగల్‌లోని ఈ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ) కూడా ఉన్నది. ఈ పథకం 2021-22 నుంచి 2027-28 వరకు ఐదేళ్లపాటు అమలులో ఉంటుంది. ఈ పార్క్‌లో యూనిట్లను స్థాపించేందుకు ఇప్పటికే కేరళకు చెందిన కిటెక్స్ గార్మెంట్స్‌తోపాటు ప్రపంచంలోనే అతిపెద్ద పిల్లల దుస్తుల తయారీదారుల్లో ఒకటైన దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కార్పొరేషన్, గణేషా ఎకోస్పియర్ వంటి కంపెనీలు ముందుకువచ్చాయి. ఎంవోయూలు కూడా జరిగాయి. 2017లో అక్టోబర్ 22న అప్పటి సీఎం కేసీఆర్ ఈపార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఏడేళ్లవుతున్నా పార్క్ పూర్తిరూపాన్ని ఇంకా సంతరించుకోలేదు. 14 కంపెనీలు రానున్నట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినా ఇప్పటివరకు వచ్చినవి నాలుగు కంపెనీలే. వీటి యూనిట్లు ఏర్పాటు ఇప్పుడిప్పుడే జరుగుతోంది.

దక్కని గ్రీన్ ఫీల్డ్ హోదా?

మెగా టెక్స్‌టైల్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఎప్పుడో వచ్చింది. దీని కింద రూ.200కోట్ల మేరకు పార్క్‌కు రాయితీలు అందనున్నాయి. అయితే ఇదే క్రమంలో గ్రీన్ ఫీల్డ్ హోదా కోసం గత ప్రభుత్వం వెంటనే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది. నిజానికి పాత టెక్స్‌టైల్ పార్క్‌లకు గ్రీన్‌ఫీల్డ్ హోదా రావడం కష్టం. ఇందుకోసం అవి కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ విధించిన నిబంధనలను పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ కొత్తది. పార్క్ ఏర్పాటు క్రమంలోనే గ్రీన్‌ఫీల్డ్ హోదా ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని డిజైన్లకు రూపకల్పన చేశారు. అన్ని వివరాలతో కూడిన ప్రతిపాదనలను రూపొందించి సకాలంలో పంపి ఉంటే ఈ పాటికే ఆ హోదా వచ్చి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కొత్త సర్కారు వాకబు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దీని విషయమై ఇటీవల న్యూఢిల్లీలో వాకబు చేయగా, ఆ ప్రతిపాదన తిరస్కరణకు గురైనట్టు తెలిసింది. ఇప్పటికే పార్క్‌కు గ్రీన్‌ఫీల్డ్ హోదా వచ్చి ఉంటే.. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో బ్రౌన్‌ఫీల్డ్ కింద రూ.200కోట్లతో పాటు గ్రీన్ ఫీల్డ్ కింద అదనంగా రూ.300కోట్లు కలుపుకొని మొత్తంగా రూ.500కోట్ల వరకు వచ్చి ఉండేవి. కానీ ఆ అవకాశం ఈసారి చేజారిపోయింది. గ్రీన్‌ఫీల్డ్ హోదా మంజూరుకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్రియను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయినట్టు తెలుస్తోంది. దీనితో ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది. ఫలితంగా కేంద్రం

మిగతా 8వ పేజీలో..

గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు

ములుగు జిల్లా గట్టమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి తాత్కాలిక బడ్జెట్‌లో నిధుల మంజూరు జరిగేనా? అని ఆ జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల వాగ్దానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఈ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసింది. స్థల సేకరణ కూడా పూర్తయింది. నిధులు మంజూరు కావలసి ఉన్నది. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీకి కూడా ఈ బడ్జెట్‌లో మోక్షం లభించగలదన్న ఆశతో ఆ జిల్లా ప్రజలు ఉన్నారు.

కలగా కాజీపేట రైల్వే డివిజన్

తాత్కాలిక బడ్జెట్‌లో అయినా కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించాలన్న డిమాండ్‌కు మోక్షం లభించేనా? ఇది ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయి. నిజాం కాలంలో ఏర్పాటైన పురాతన రైల్వే స్టేషన్ భారత దేశ ముఖద్వారంగా చెబుతారు. దక్షిణ మధ్యరైల్వేలో అత్యధిక ఆదాయం సమకూర్చే జంక్షన్ ఇదే. ఈ స్టేషన్ మీదుగా 186 రైళ్లు వెళతాయి. రోజుకు 30వేల మందికిపైగా ప్రయాణికులు ఈ జంక్షన్ గుండానే ప్రయాణిస్తారు. అపారమైన బొగ్గు నిల్వలున్న మణుగూరు, కొత్తగూడెం, రామగుండం, గోదావరిఖని, భూపాలపల్లి దీని పరిధిలోనే ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వేని ఆరు డివిజన్లలో ఏపీలో మూడు రైల్వే డివిజన్లు ఉండగా, తెలంగాణలో సికింద్రాబాద్ ఒక్కటే డివిజన్‌గా ఉంది. కనీసం ఈ సారి బడ్జెట్‌లో అయినా కాజీపేట డివిజన్ ప్రతిపాదన ప్రస్తావనకు వస్తుందేమోనని ప్రజలు ఆశిస్తున్నారు.

అదనపు రైల్వే లైన్లు

పెరుగుతున్న ప్రయాణికులు, సరుకుల రవాణా రద్దీ దృష్ట్యా కాజీపేట జంక్షన్ మీదుగా కొత్త రైల్వేలైన్లు వేయాలన్న డిమాండ్ కూడా ఎప్పటి నుంచో ఉంది. ప్రతీసారి బడ్జెట్ సందర్భంగా జిల్లా ప్రజలు కోరుతూనే ఉన్నారు. కానీ ఆచరణకు నోచుకోలేదు. కానీ సారైనా బడ్జెట్‌లో కొత్త రైల్వే లైన్లకు అవకాశం లభించేనా అన్నది చూడాలి. వరంగల్-భూపాలపల్లి, కాజీపేట-భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్-సూర్యాపేట మధ్య కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే రోడ్ ఓవర్ బిడ్జిల (ఆర్‌వోఆర్) పనులను వేగవంతం చేయాల్సి ఉంది.

కొన్ని పనులను సత్వరం ప్రారంభించాల్సి ఉంది. జనగామ-దుద్దెడ మధ్య పెంబర్తి వద్ద, మానుకోట పట్టణంలో, కురవి గేట్ సమీపంలో ఆర్‌వోఆర్‌లను నిర్మించాల్సి ఉంది. మహబూబాబాద్ పట్టణంలో ఆర్‌వోబీకి రూ.52కోట్లు మంజూరైనా సకాలంలో పనులు మొదలు కాక నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కాజీపేట ఫాతిమానగర్ బ్రిడ్జి విస్తరణ పనులు సత్వరం పూర్తి చేయాల్సి ఉంది.

రోడ్ల మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలి

- జాతర నేపథ్యంలో జిల్లాలో పనులు చేపట్టాలి..
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం

హనుమకొండ రూరల్, జనవరి 30: మేడారం జాతర నేపథ్యంలో జిల్లా పరిధిలోని రోడ్ల పనులు, సైన్‌బోర్డులు, భద్రతా ఏర్పాట్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో భాగంగా రోడ్లు, భవనాలు, పోలీస్, కుడా, మునిసిపల్ కార్పొరేషన్, నేషనల్ హైవే, రవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 10వ తేదీలోగా రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ వరకు రోడ్డు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని, నగరంతోపాటు జిల్లాకు సంబంధించిన అన్ని రహదారులు బాగుండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కల్వర్టులు, ఇరుకైన వంతెనల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు వ్యవహరించాలన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు మేడారం జాతర మహాజాతర జరుగుతున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సీపీ అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ.. మేడారం మహాజాతరకు తరలివెళ్లే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతంగా ప్రయాణించేలా అన్ని శాఖల అధికారులు పని చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. వరంగల్ బస్టాండ్ నుంచి, అదే విధంగా హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్ నుంచి మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులు ఎక్కువ సంఖ్యలో నడుస్తాయన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాన్నారు. కరుణాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద హైదరాబాద్ నుంచి వరంగల్‌వైపు బైపాస్ తెలియకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. కరుణాపురం నుంచి కాజీపేట వైపు ఉన్న రోడ్డులో ఎల్లో స్ట్రిప్స్ పెట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, సెంట్రల్‌జోన్ ఎం.ఏ.భారి, ట్రైయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎల్.రాజం, ఏసీపీలు కిరణ్ కుమార్, భోజరాజు, కిశోర్ కుమార్, ఎంవీఐ కంచి వేణు, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ సురేశ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

పన్నులు చెల్లించకుంటే రెడ్ నోటీసులు జారీ చేయండి

- అధికారులకు బల్దియా కమిషనర్ ఆదేశాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 30: ఆస్తి, ట్రేడ్ లైసెన్స్‌ల పన్నులు చెల్లించనివారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ ప్రజారోగ్య అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. పదేళ్లుగా పన్నుల వసూళ్ల విధానాన్ని ఒకే రీతిలో పాటించడం సరికాదన్నారు. మునిసిపల్ యాక్ట్100(2) మేరకు డిసెంబర్, జనవరిలోనే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైతే ఇందుకు విరుద్ధంగా పన్నులు చెల్లించనట్లైతే తాగునీరు, విద్యుత్ సేవలు నిలిపి వేయాలన్నారు. ఈ క్రమంలో ఈ విధానం అమలుపై దృష్టి సారించాలని సూచించారు. డిమాండ్ మేరకు పన్నుల వసూళ్లు జరగాలని, చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేసి తాగునీరు, విద్యుత్ సేవలు నిలిపి వేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు కూడా 46 శాతం మాత్రమే జరిగాయని కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో పన్నుల వసూళ్లు వందశాతం జరగాలని స్పష్టం చేశారు. ప్రతీ బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించనున్న క్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీనిపై తాను సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్, రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

ఆస్తి, ట్రేడ్ వసూళ్ల తీరును అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు.


ప్రాణాలు బలిగొన్న పాత కక్షలు

- కౌకొండలో యువకుడి దారుణ హత్య
- గొడ్డలితో విచక్షణారహితంగా దాడి
- పరారీలో నిందితుడు, పోలీసుల గాలింపు



యుగేందర్ (ఫైల్)

పరకాల, జనవరి 30: పాత కక్షలు ఓ యువకుడి ప్రాణాలు బలితీసుకున్నాయి. స్వయానా దగ్గరి బంధువే గొడ్డలితో దాడిచేయడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండలో జరిగిన ఈ ఘటనతో గ్రామం ఉలిక్కిపడింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. కౌకొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేకల రాజమ్మ-సారయ్య దంపతులకు నలుగురు కుమారులు, ఐదుగురు కూతుర్లు ఉన్నారు. కుటుంబంలో చిన్నవాడు యుగేందర్ (36) డిగ్రీ పూర్తి చేసి 15 యేళ్లుగా దళితశక్తి, ధర్మసమాజ్ పార్టీలో పనిచేస్తున్నాడు. కాగా, ఇటీవల యుగేందర్ సమీప బంధువు సారమ్మ మృతి చెందింది. సోమవారం సారమ్మ దశదిన కార్యక్రమంలో చిందుకళాకారులు గ్రామంలో కథ చెబుతుండగా అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుపై తన స్నేహితులతో యుగేందర్ చలి మంట కాగుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మేకల సిద్ధు ద్విచక్ర వాహనంపై వచ్చి యుగేందర్‌పై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో యుగేందర్ తల, మెడపై తీవ్రగా యాలు కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన యుగేందర్‌ను వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.



నివాళులర్పిస్తున్న విశారదన్ మహరాజ్

పాత కక్షలతో సమీప బంధువైన మేకల సిద్ధు తన తమ్ముడు యుగేందర్‌ను హత్య చేసినట్లు సోదరుడు మేకల రాజవీరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఆపై పోలీసు జాగిలాలతో పరిశీలించి, ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. దాడి చేసిన సిద్ధు పరారీలో ఉన్నట్టు పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై కొంకణాల సంతోష్ తెలిపారు. పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ ఆదేశాలతో కౌకొండ గ్రామంలో గొడవలు జరుగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. కాగా, మృతుడు యుగేంధర్‌కు వివాహం కాలేదు. తన తండ్రి, మాజీ సర్పంచ్ మేకల సారయ్య రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు తల్లి రాజమ్మను చూసుకుంటూ ఇంటివద్దే ఉంటున్నాడు.

ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులం

- వనదేతల సన్నిధిలో మెరుగైన సేవలు అందిస్తాం..
- ములుగు ఎస్పీ శబరీశ్
- పూజారులు, ఆదివాసీ యువతతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

మేడారం, జనవరి 30: పోలీసులు ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ సన్నిధిలో మెరుగైన సేవలు అందించాలన్నదే ధ్యేయమన్నారు. ఇందుకు తమకు సహకరించాలని కోరారు. తాడ్వాయి మండలం మేడారం పోలీసు సమావేశ హాల్‌లో పూజారులు, ఆదివాసీ యువతతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగుతుందన్నారు. జాతరణ విధుల్లో పాల్గొనే పోలీసులకు యువత తోడ్పాటు అందించి సేవల్లో భాగస్వాముల కావాలన్నారు. జాతర సమయంలో పూజారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఊరేగింపులో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న దేవతలను ఒక్కసారిగా గద్దెలకు చేర్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారులతో రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని ఎస్పీని పూజారులు కోరారు. సమ్మక్క దేవత ఊరేగింపులో మూడంచెల భద్రత వ్యవస్థను ఉంచాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన ఉన్న పోలీసు అధికారులను నియమించాలన్నారు. సమ్మక్కకు చర్ప వంశీయులు సమర్పించే హారతికి భక్తుల రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు.

దీనిపై ఎస్పీ మాట్లాడుతూ.. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గత జాతరలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జాతర విజయవంతానికి యువత సహకారం ముఖ్యమన్నారు. మేడారం తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకునే భక్తులందరినీ మన అతిథులుగా భావించి సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, సుభాష్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సిద్ధబోయిన మునీందర్, లక్ష్మణ్‌రావు, మహేష్, సారయ్య, కృష్ణయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు, భుజంగరావు, లక్ష్మణ్‌బాబు, కనకమ్మ, గోవర్ధన్, రాజు, బుచ్చిరాములు, మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొండాయి, మల్యాల, పునుగొండ్ల గ్రామాల ఆదివాసీ యువత పాల్గొన్నారు.

వనదేవతలకు మొక్కులు




వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 30: వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21న మహాజాతర ప్రారంభం కానుండగా ముందస్తుగా తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. 20వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివశక్తుల పూనకాలు డోలు, సన్నాయిల మధ్య గద్దెలకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా తల్లులకు పూజలు చేశారు. అనంతరం మేడారం పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేశారు.

నూతన కమల సారథులు

- మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలకు కొత్త అధ్యక్షులు



వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్/ భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 30: మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలకు భారతీయ జనతా పార్టీ నూతన జిల్లా అధ్యక్షులను రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యలమంచిల్లి వెంకటేశ్వరరావును నియమిస్తూ మంగళవారం రాత్రి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు విద్యార్థి దశలో వీహెచ్‌పీలో పని చేసి ప్రస్తుతం విశ్వహిందూ పరిషత్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. ఈయన నియమించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నిశీధర్‌రెడ్డి



నిశిధర్‌రెడ్డి

బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఏడునూతల నిశీధర్‌రెడ్డిని నియమించారు. రేగొండ మండల కేంద్రానికి చెందిన నిశీధర్‌రెడ్డి రాజకీయ కుటుంబంలో జన్మించారు. తొలి నుంచి బీజేపీలోనే కొనసాగారు. దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డికి మేనల్లుడైన నిశీధర్‌రెడ్డి 2019లో రేగొండ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2016లో భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. నిశీధర్ రెడ్డి తండ్రి విజేందర్‌రెడ్డి రేగొండకు రెండు పర్యాయాలు సర్పంచిగా, బీజేపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు.

సోషియాలజీలో సాంబశివరావుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 30: కేయూ సోషియాలజీ విభాగం పరిశోధకుడు తమ్మిశెట్టి సాంబశివరావు డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం సాంబశివరావుకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టర్స్ ఆఫ్ డిసబులిటీ స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ - ఏ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్టు ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కుంట అయిలయ్య పర్యవేక్షణలో సాంబశివరావు పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపంకుంటకు చెందిన దివ్యాంగుడైన సాంబశివరావు 70పైగా సినిమా పాటలు, 11 సినిమా కథాలను రాశారు.

సాహిత్యంలోనే సామాజిక చైతన్యం

● వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ● కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 30: సాహిత్యంతోనే సమాజంలో చైతన్యం పరిఢవిల్లుతుందని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్బోధించారు. మంగళవారం కేయూ, వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన వల్లంపట్ల సాహిత్యం- సామాజిక చైతన్యం' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సదస్సుకు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం ప్రజలను దగ్గర చేస్తోందని, తద్వారా సామాజిక చైతన్యం వస్తుందన్నారు. గొప్ప చైతన్య శీలి, ఆచరణ వాది, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అని చెప్పారు. వల్లంపట్ల ప్రభుత్వ కార్యక్రమాలను కళారూపాలతో ప్రజలల్లోకి తీసుకువచ్చి చైతన్య పరిచారని అన్నారు. హేతుబద్ధత గీటు రాయి అన్నారు. వాదాలు ఏమైనా దానికి వేదిక తెలుగు విభాగం అవుతోందని చెప్పారు. వర్సిటీలో జరుగున్న పరిశోధన క్రమాన్ని కొనియాడారు. పరిశోధన పట్ల వల్లంపట్ల జీవితాన్ని తీసుకోవడం, ఇతర గొప్ప వ్యక్తుల జీవితాన్ని పరిశోధన అంశంగా తీసుకోవడం నూతన ప్రక్రియని చెప్పారు. సాహిత్యంపై చర్చలో సామాజిక చైతన్యం సాధ్యం అవుతోందని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ బీఎస్‌రాములు మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు 5 దశాబ్దాలుగా తన కలాన్ని, గళాన్ని అర్పించిన నాగేశ్వర్‌రావు గొప్పవారిని చెప్పారు. సదస్సులో ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్, కవయిత్రి, రచయిత అనిశెట్టి రజిత, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కామర్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, డాక్టర్ తాళ్ళపల్లి యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో హనుమకొండ వాసి



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో శ్రేష్ఠ

హనుమకొండ కల్చరల్, జనవరి 30: హనుమకొండ కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన పాసికంటి శ్రీశ్రేష్ఠ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ఎంపికైన అత్యంత చిన్న వయస్కురాలు కావడం విశేషం. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ చదువుతున్న శ్రేష్ఠ.. నెల రోజులుగా న్యూఢిల్లీలో జరుగుతున్న క్యాంపులలో పాల్గొంటోంది. సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా పరేడ్ ప్రత్యేక కవాతులో ఆమె శిక్షణ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అవకాశం, ఆయన ముందు జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

తునికాకు సేకరణకు టెండర్లు వేయాలి..

ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024 సీజన్‌లో తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్ డిమాండ్ చేశారు. ఆయనపేరిట మంగళవారం ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. 50 ఆకులతో కూడిన కట్టకు రూ.5 ప్రభుత్వం ధరను నిర్ణయించాలన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లోఉన్న బోనస్‌ను ఆకు సేకరణ పనులకు ముందే చెల్లించాలని పేర్కొన్నారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అవకతవకలు, అవినీతి అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్‌ను పూర్తి చేయడంతో పాటు కూలీలకు, ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయాలకు అవకాశాలు ఉన్న తునికాకు టెండర్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు.

నర్సంపేట మునిసిపాలిటీలో వీగిన అవిశ్వాసం

● కోరం లేక వీగిన తీర్మానం ● చైర్మన్ పదవిని నిలబెట్టుకున్న గుంటి రజని



నర్సంపేట మునిసిపాలిటీ అవిశ్వాస సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



కోరం లేక అవిశ్వాసం వీగిపోయిందని వివరిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, వేదికపై కమిషనర్ వెంకటస్వామి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీని పదవి నుంచి తొలగించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వేసిన పాచిక పారలేదు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌పై ఇదే పార్టీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు వీగిపోయింది. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలోని సమావేశ గదికి కమిషనర్ నాయిని వెంకటస్వామితో కలిసి ప్రత్యేక అధికారి స్థానిక ఆర్డీవో కృష్ణవేణి చేరుకున్నారు. షెడ్యూల్ సమయం 11 గంటల వరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు మద్దతు పలికిన మరో కౌన్సిలర్ హాజరవుతారని అందరూ భావించారు. కానీ అంచనాలు తలకిందులై 12గంటల వరకు ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాలేదు. ఆ తర్వాత ప్రత్యేక అధికారి అవిశ్వాస పరీక్షకు మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు.

మునిసిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఇందులో 18వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. దీనికి తోడు ఎమ్మెల్యేతో కలిసి 25 మంది సభ్యులు అవుతారు. ఇందులో ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లను అవిశ్వాసానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉన్నారు. మిగిలిన 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో అవిశ్వాసం పెట్టిన 13



నర్సంపేట మునిసిపల్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై రవి, సిబ్బంది

మందితోపాటు వీరికి మద్దతునిచ్చిన మరో కౌన్సిలర్ సమావేశానికి హాజరుకాలేదు. అవిశ్వాసానికి వ్యతిరేకించిన నలుగురు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగి పోయినట్లు ప్రత్యేక అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ప్రకటించారు.

హాజరుకాని చైర్‌పర్సన్

పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మంది కౌన్సిలర్లతోపాటు మద్దతు ఇచ్చిన మరో కౌన్సిలర్ కలిసి 14 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. మరో ముగ్గురు కౌన్సిలర్ల మద్దతు లేనిదే అవిశ్వాసం నెగ్గే పరిస్థితి లేదని గ్రహించి సమావేశానికి చైర్‌పర్సన్ గైర్హాజరయ్యారు. మిగిలిన నలుగురిలో ఒకరు నర్సంపేటలోనే ఉండగా మరో ఇద్దరు కౌన్సిలర్లు(దార్ల రమాదేవి, ఎండి. పాషా) మూడు రోజుల క్రితం చైర్‌పర్సన్ రజనికి మద్దతుగా క్యాంపునకు వెళ్లారు. 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో 17మంది మద్దతు అవసరం ఉంది. అవిశ్వాసానికి మద్దతునిచ్చిన 14మంది కౌన్సిలర్లకు చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలన్న అవిశ్వాసం నెగ్గక చుక్కెదురైంది. తోటి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నుంచి బయట పడడానికి ఇద్దరు కౌన్సిలర్లతో కలిసి క్యాంప్‌కు వెళ్లిన చైర్‌పర్సన్ గుంటి రజని చైర్మన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. దీంతో చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలని భావించి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 14 మంది కౌన్సిలర్ల ఆలోచన బెడిసి కొట్టింది. అవిశ్వాసం వీగి పోవడంతో వారిలో నిరాశ చోటు చేసుకుంది.

అవిశ్వాస అంశానికి తెర

గత నెల రోజులుగా కొనసాగుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టిన అంశానికి సోమవారం అవిశ్వాసం వీగి పోవడంతో తెరపడినట్లయింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి 14మంది కౌన్సిలర్లు మద్దతు పలుకగా నలుగురు అవిశ్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. 17మంది కౌన్సిలర్ల బలం ఉంటేనే అవిశ్వాసం నెగ్గేది. అయితే ఆ 14 మందికి నలుగురు సహకరించక పోవడం, వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా సహకరించకుండా అవిశ్వాసానికి దూరంగా ఉండడంతో కోరం లేక వీగిపోయింది.

బీఆర్ఎస్ పార్టీకి 14 మంది కౌన్సిలర్ల రాజీనామా

మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడి



నర్సంపేటలో తోటి కౌన్సిలర్లతో కలిసి రాజీనామా చేస్తూ వ్రాసిన పత్రాన్ని చూపుతున్న వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన 14 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నర్సంపేటలోని సర్వాపురంలో 14మంది కౌన్సిలర్లు మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ ఒంటెద్దు పోకడలు నచ్చక ఏడాది కిందట అవిశ్వాసం పెట్టాలని నిర్ణయానికి వచ్చామన్నారు. అయితే జనవరి 30వ తేదీవరకు అవకాశం లేదని తెలిసి అప్పుడు ఆలోచనను విరమించుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మాట్లాడుతానని హామీ ఇచ్చారన్నారు. అయినా చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య సమన్వయం చేయకపోవడంతో జనవరి 2న కలెక్టర్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానపత్రాన్ని ఇచ్చామన్నారు. రెండు రోజుల కిందట క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లతో మాట్లాడి సమన్వయం చేస్తానని చెప్పి 15మంది కౌన్సిలర్లతో విప్ పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. ముగ్గురిని పిలిపించి విప్ పత్రంపై సంతకాలు చేయించకపోవడం.. ఇచ్చిన మాటను సుదర్శన్‌రెడ్డి తప్పడంతో మనస్తాపానికి గురైన 14 మంది కౌన్సిలర్లు.. పార్టీకి రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. తమ రాజీనామా లేఖను బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ ద్వారా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పంపిస్తామన్నారు. 14 మంది కౌన్సిలర్లలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారు ఎవరూ లేరన్నారు. డబ్బులు ఆశించిన వారు, భూములను కబ్జా చేసిన వారు లేరన్నారు. ప్రజల వద్ద కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేస్తే మునిసిపాలిటీలో పనులు అవుతాయా ఆలోచించాలన్నారు. చైర్‌పర్సన్‌అసమర్థతతోనే కోట్లాది రూపాయల నిధులున్నా.. వార్డుల్లో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఇప్పుడు నిధులు మురిగిపోయే అవకాశాలు ఉన్నాయని వెంకట్‌రెడ్డి వాపోయారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై సూచన మేరకు విప్‌పై తాము సంతకాలు చేశామని, అయితే సంతకాలు చేయని చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లో ఆలోచించి కౌన్సిలర్ పదవులకు సైతం రాజీనామా చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రుద్రమల్లీశ్వరి, గంప సునీత, వేల్పుగొండపద్మ, బానాల ఇందిర, దేవోజు తిరుమల, రామసహాయం శ్రీదేవి, గందె రజిత, శీలం రాంబాబు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, జుర్రురాజు ఇతర కౌన్సిలర్లుతోపాటు నాయకులు నాగిశెట్టి ప్రసాద్, రుద్ర ఓం ప్రకాశ్, గందె చం ద్రమౌళి. సుధాకర్‌రెడ్డి, దేవోజు సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేను రాజీనామా చేయడం లేదు: పద్మరాజు

తాను బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని కౌన్సిలర్ వేల్పుగొండ పద్మరాజు మంగళవారం సోషల్ మీడియాలో వెల్లడించారు. అంతకుముందు మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి 14 మందితో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న పద్మరాజు.. సమావేశం అనంతరం తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం లేదని, పార్టీలోనే కొనసాగుతామని వెల్లడించడం కొసమెరుపు. దీంతో 13 మందే రాజీనామా చేసినట్లు భావించాల్సి ఉంటుంది. వీరిలో కూడా ఇంకా ఎవరైనా మనసు మార్చుకుంటారా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి

దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

● రూ.1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ ● ఆటో సీజ్



నర్సింహులపేట ఠాణాలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

నర్సింహులపేట, జనవరి 30: నర్సింహులపేట, తొర్రూరు, మరిపెడ మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తొర్రూరు సీఐ సత్యనారాయణ తెలిపారు. నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలను వెల్లడించారు. నర్సింహులపేట మండలంలోని ముంగిమడుగు ఫకీరతండాకు చెందిన భూక్య హరికృష్ణ, గుగులోతు గణేష్, గుగలోతు సుమన్, గుగులోతు కళ్యాణ్‌లు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10న మండలంలోని వంతడుపల తండాకు చెందిన ధరావత్ రూప్‌సింగ్ తన ఇంటి ఎదుట కట్టేసిన మేకపోతును ఎవరో గుర్తుతెలియని వారు ఎత్తుకుపోయారని నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సతీష్ విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నర్సింహు లపేట శివారు జయపురం క్రాస్‌రోడ్డువద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో 5 మేకలు, 4 గొర్రెలతో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారణ చేయగా మరిపెడ మండలంలోని కస్నాతండా, తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, నర్సింహు లపేట మండలంలోని వంతడుపల తండాలో చోరీలకు పాల్పడి గొర్రెలు, మేకలు అపహరించి మార్కెట్‌లో విక్రయాలు జరిపినట్లు నిర్ధారణ జరిగింది. నిందితుల నుంచి రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ చేయడంతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను తొర్రూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దొంగతనం చేసును చేదించిన ఎస్సై సతీష్, ఏఎస్సై వెంకన్న హెడ్‌పీసీ సంతోష్, రమేష్, వెంకన్న, శ్రీను, ఎం.రమేష్‌లను తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ అభినందించి రివార్డు అందజేశారు.

40 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలింపు ● మానుకోట రైల్వేస్టేషన్‌లో పట్టివేత



గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్రబాబు

నెహ్రూసెంటర్, జనవరి 30 : విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 40 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్ర బాబు తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మెగా రాజేందర్‌రొంకడే అనే మహిళ, అదే ప్రాంతానికి చెందిన విజయ్‌భరత్ సద్వార్తేలు గత కొంతకాలంగా విశాఖపట్టణం నుంచి మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల్లోని ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మహబూ బాబాద్ రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ తనిఖీలు చేపట్టగా 40 కిలోల గంజాయి పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, రజిత, చిరంజీవి, మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముఖం కడుక్కుంటుండగా నల్లాకు విద్యుత్ సరఫరా

విద్యుదాఘాతంతో గడ్డిగూడెంలో వ్యక్తి మృతి



భూక్య శ్రీను మృతదేహం



భూక్య శ్రీను

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంతండాలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగూడెంతండాకు చెందిన భూక్య శ్రీను (40)తనకున్న 20 గుంటల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి ముఖం కడుక్కునేందుకు ఇంట్లోని నల్లా వద్దకు వెళ్లి ఇనుముతో ఉన్న నల్లా ట్యాప్‌ను పట్టుకున్నాడు. నల్లాకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై భూక్య శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మంగొని, తల్లి ద్వాలీ ఉన్నారు. భార్య మంగొని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదిత్

లింగాలఘణపురం, జనవరి 30: లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన ఏదునూరి ఉదిత్(15) అనే పదో తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఏదునూరి కృష్ణ-రజితల కుమారుడు ఉదిత్ లింగాలఘణపురం టీఎస్‌ఎంఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఇంటి పక్కనే ఉన్న గొర్రెలదొడ్డిలో మంగళవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపా రు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం తన స్నేహితులతో తాను ఒకట్రెండురోజుల్లో చనిపోతానని తన అంతిమ యాత్రలో డీజే పెట్టాలని చెప్పినట్లు చర్చ జరుగుతోంది. దీంతో అతని కోరిక మేరకు డీజే ఏర్పాటు చేసి అంతిమయాత్రను నిర్వహించడం గమనార్హం.

నలుగురు డీఎస్పీలకు స్థానచలనం

హనుమకొండ క్రైం, జనవరి 30: తెలంగాణ రాష్ట్ర మల్టీజోన్‌లో పనిచేస్తున్న నలుగురు డీఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.గంగాధర్ పీటీసీ కరీంనగర్ నుంచి వరంగల్‌కు, కె.నాగయ్య వరంగల్ నుంచి పీటీసీ, ఎం.శ్రీనివాస్ వరంగల్ నుంచి డీఏఆర్, ఎస్. సురేంద్ర వరంగల్ నుంచి రామగుండంలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారు ఒకటి రెండు రోజుల్లోవిధుల్లో చేరాలని ఆదేశించారు.

సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు

ఐనవోలు, జనవరి 30: ఐదు సంవత్సరాలు పదవీకాలం పూర్తయినందున మండలంలోని సర్పంచ్‌లకు మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, వైఎస్ ఎంపీపీ తంపుల మోహన్, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్‌లకు విడ్కోలు సన్మానం

చింతగట్టు హైస్కూల్‌లో యోగా శిబిరం

హసన్‌పర్తి, జనవరి 30: 65వ డివిజన్ చింతగట్టు హై స్కూల్‌లో మంగళవారం ఉదయం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. యోగా గురువు విజయ్ ప్రతాప్ మహారాజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, అన్నపూర్ణ, శరత్‌బాబు, భాస్కర్, శిరీష, శేషగిరి, విమలాబాయ్, అనసూయ, పీఈటీలు సాంబమూర్తి, అర్పిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టడం సర్కార్ సాహసోపేతమే..

టీడీపీ రాష్ట్ర నేత గట్టు ప్రసాద్‌బాబు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నేత గట్టు ప్రసాద్‌బాబు, నాగవెల్లి సురేశ్

వడ్డేపల్లి, జనవరి 30: బీసీ కులగణన చేపట్టడం ప్రభుత్వ సాహసోపేతమైన చర్య అని, బీసీ సమాజం సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటుందని టీడీపీ రాష్ట్ర నేత, 'కుడా' మాజీ చైర్మన్ గట్టు ప్రసాద్‌బాబు, టీడీపీ వరంగల్ పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగవెల్లి సురేశ్, ఎలుగు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ కులగణనతో బీసీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు, నిధులు, ఉద్యోగాలు వస్తాయన్నారు. బీజేపీ బీసీ కులగణనపై తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తొలుత గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర జిల్లా నేతలు భైరపాక ప్రభాకర్, వెలగందుల రవీందర్ గుప్తా, పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, కందుకూరి చంద్రమోహన్, నల్లకుంట రవికుమార్, ముక్కిరాల జనార్దన్‌రావు, నరేశ్, పరశురాములు పాల్గొన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ దళిపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కుల గణనతో బీసీలకు సామాజిక న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రశ్నించే గొంతుకు
అవకాశం కల్పించండి..

ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్

కేయూ క్యాంపస్, జనవరి 30: రానున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతును బలపరచాలని ఏఐసీసీ మాజీ సభ్యుడు, బక్క జడ్సన్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలో ఎస్టీఎల్‌సీఈ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ ఆధ్వర్యంలో కేయూ నిరుద్యోగ యువతను కలిశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తుల ఫారాలు అందచేశారు. ఓటు నమోదు పత్రాలను యువతనుంచి స్వీకరించారు. వర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ పట్టభద్రులుందరూ రానున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అకునూరి సుదయ్య, డాక్టర్ తాటికాయల కుమార్, డాక్టర్ సుమన్, పోనుగోటి సత్యనారాయణరావు, పోలేపాక ప్రతాప్, రాజు, శ్రీనివాస్, వెంకటేశ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ రూరల్: ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను బలపర్చాలని ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ కోరారు. మంగళవారం కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆంటోని పోలిశెట్టి, ఇతర ఉపాధ్యాయులను కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్ కలిసి రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను బలపర్చాలని కోరారు.


మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

కలెక్టరేట్‌లో గాంధీ వర్ధంతి

హనుమకొండ రూరల్, జనవరి 30: మహాత్మాగాంధీ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, గాంధీజీ అనుసరించిన మార్గంలో పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఏసీపీలు కిరణ్ కుమార్, భోజరాజు, కిశోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీసీసీ భవన్‌లో..

హనుమకొండ సిటీ: హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా కాంగ్రెస్ నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో అజీజ్‌ఖాన్, బంక సరళా యాదవ్, బొమ్మతి విక్రమ్, నాయిని లక్ష్మారెడ్డి, మహ్మద్ అంకూశ్, బంక సంపత్, తౌటం రవీందర్, రహీమున్నీసా బేగం, వీరగంటి రవీందర్, గుంటికుమార్, సుంచు అశోక్, నలుబోల సతీశ్, సారంగం, ఎర్ర మహేందర్‌తో పాటు కార్పొరేటర్లు తోట వెంకన్న, వేముల శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో గాంధీ వర్ధంతి

కాజీపేట, జనవరి 30: దక్షిణ మధ్య రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కాజీపేట ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ వర్ధంతి జరిగింది. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, కమిటీ సభ్యులు మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం అమరులు చేసిన త్యాగాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, పి. ప్రశాంత్‌తోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 47వ డివిజన్ బాలాజీ నగర్‌లో జరిగిన గాంధీ వర్ధంతిలో కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, అబ్దుల్ హలీమ్, గరిగె శివకుమార్, కొమురవెల్లి రమేశ్, మైసారపు సిరిల్ లారెన్స్, జె. వెంకటేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాజీపేట వాసవి క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రఘు ఆధ్వర్యంలో జరిగిన గాంధీ వర్ధంతి క్లబ్ సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యారుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ అంబర్ కిశోర్‌ఝా తదితరులు

ఎమ్మెల్సీ ఓట్లలో బీఆర్ఎస్‌కు అండగా నిలువాలి

టీవీసీసీ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి

కేయూ క్యాంపస్, జనవరి 30: వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత, నిరుద్యోగులు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ (టీవీసీసీ) మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ క్యాంపస్‌లో యువతకు ఎమ్మెల్సీ ఎన్నికల దరఖాస్తుల ఫారాలను అందచేసి ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ క్యాంపస్ ప్రెసిడెంట్ భైరపాక ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన గ్రాడ్యుయేట్స్ ఓటర్లుగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు వర్సిటీ క్యాంపస్‌లలో ఓటర్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థికి ఓటేసి కొట్లాడే గొంతుకను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 6 వరకు ఓటరు నమోదు చివరి తేదీ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్, బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ బొల్లికొండ వీరేందర్, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, 17వ డివిజన్ అధ్యక్షుడు కత్తెరపల్లి దామోదర్, నాయకులు డాక్టర్ సూరాసి కృష్ణ, విజిలెన్స్ కమిటీ సభ్యుడు పొలపల్లి రామ్మూర్తి, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శరత్‌చంద్ర, డాక్టర్ మేడారపు సుధాకర్, సంగాని సూర్యకిరణ్, కలకోట సుమన్, గొల్లపల్లి వీరాస్వామి, జెట్టి రాజేందర్, కొనుగటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్, ఐలోని అభిషేక్, మాలకుమ్మరి పరుశురాములు, రత్నం అశోక్, కొత్తూరి రోహిత్ తదితరులుపాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఓటు పత్రాలను ఆవిష్కరిస్తున్న వాసుదేవారెడ్డి, వీరేందర్, ప్రశాంత్

కుష్ఠువ్యాధిని నిర్మూలించాలి

హనుమకొండ అర్బన్, జనవరి 30: కుష్ఠువ్యాధిని సమాజం నుంచి నిర్మూలించి, వ్యాధిగ్రస్థులను ఆదరించాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్‌మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు, జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన దినం, గాంధీ వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని ఆనంద్ నగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.డి.యాకూబ్‌పాషా మాట్లాడుతూ.. జిల్లాలో కుష్ఠువ్యాధి రోగులు చికిత్స తీసుకోకపోతే వచ్చే అంగవైకల్యాలను వివరించారు. అలాగే వారికి అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విద్యా అధికారి సందెల శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మోహన్, గోపాల్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, కొమురయ్య, రవీందర్, ప్రభాకర్, నరసయ్య, మాధవరెడ్డి, సదానందం, భద్రయ్య, శివరాములు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ

బలరాంనాయక్‌కే లోక్‌సభ టికెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్

వడ్డేపల్లి, జనవరి 30: మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్‌కే కేటాయించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రతినిధి బానోతు నవీన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు బలరాంనాయక్ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, స్పీకర్ మీరా కుమారి, బీజేపీ నేత సుష్మాస్వరాజ్‌ను ఒప్పించి, మెప్పించారని అన్నారు. బలరాంనాయక్‌కు లోక్‌సభ టికెట్ కేటాయిస్తే లక్ష మెజారిటీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజా, కుల సంఘాల రాష్ట్ర నేతలు దేవర మల్లేశ్, నరేందర్, సమ్మయ్య రాథోడ్, పసులాది నారాయణ, బొచ్చు పరమానందం, భూక్య వెంకట్రామ్ నాయక్, బస్వోజు సురేశ్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీఐటీయూ జాతీయ సమావేశాలు

సమావేశాల వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ

సుబేదారి, జనవరి 30: రేపటి నుంచి ఫాతిమానగర్‌లో ఉన్న బాలవికాస సంస్థలో మూడురోజుల పాటు సీఐటీయూ జాతీయ సమావేశాలు జరుగుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఉప్పలయ్య, రాగుల రమేష్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు ర్యాలీ ఉంటుందని, గురువారం నుంచి 3 రోజుల పాటు ఫాతిమానగర్‌లో సమావేశాలు ఉంటాయని ప్రకటనలో తెలిపారు.

వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ

సీఐటీయూ జాతీయ సమావేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్స్ 31వ డివిజన్ న్యూశాయంపేటలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల సారంగపాణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ జాతీయ సమావేశాలకు పెద్ద సంఖ్యలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని సారంగపాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేల్పుల రమేష్, శ్యాం, శ్రీనివాస్, రాజేష్, చంద్రమౌళి, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వర్గీకరణ జరిగేంతవరకు
ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

ఎంఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్‌మాదిగ


మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

ఐనవోలు, జనవరి 30: ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు ఎస్సీ, ఎస్టీ బీసీల ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎంఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం ఐనవోలులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత అశోక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అయ్యాకే ఉద్యోగ నియామకాలు చేపట్టి ప్రైవేటు యూనివర్సిటీ ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ కల్పించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దళితులకు ఇచ్చిన అంబేద్కర్ అభయహస్తాన్ని వెంటనే అమలు చేసి దళిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ఎంఎస్పీ మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్‌మాదిగ మాట్లాడుతూ.. మంత్రి వర్గంలో మాదిగలకు మరో మంత్రి పదవి ఇవ్వడంతోపాటు ఎమ్మెల్సీ, రాజ్యసభ, నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలకు సముచితస్థానం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారు సురేందర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణమాదిగ, నాయకులు గద్దల సుకుమార్‌మాదిగ, గోలి సుధాకర్‌మాదిగ, బరిగెల వెంకటస్వామిమాదిగ, కట్కూరి రమేష్‌మాదిగ, చంద్రమౌళిమాదిగ పాల్గొన్నారు.

జీఎంపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఐనవోలు, జనవరి 30: గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) క్యాలెండర్‌ను మంగళవారం ఐనవోలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిగుర్ల చేరాలు, మండల అధ్యక్షుడు పిడుగు దయాకర్, ప్రధాన కార్యదర్శి నల్లబెట్ట చిన్నరాజుయాదవ్, అఖిలభారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు రాజారపు రాజుయాదవ్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మహేష్‌గౌడ్, శ్రీనివాస్, రావుల రవికుమార్, రాజారపు, పులిగిల్లా కుమారస్వామి, సునిల్, భాస్కర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కాజీపేట, డిసెంబరు 30: గర్భిణులు మంచి విటమిన్లు ఉన్న పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సోమిడి సెక్టార్ సూపర్‌వైజర్ డి. కవిత అన్నారు. కాజీపేట రహ్మత్‌నగర్ సెంటర్‌లో మంగళవారం గర్భిణులను, బాలింతలకు ఆహ్వానించి అక్షయ పాత్ర భోజనంతో పాటు, గుడ్లు, ఆకుకూర, సాంబారుతో ఒక పూట ఫుల్ మీల్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రహ్మత్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ వి. శ్రీలత దేవి, డి. బాలశ్రీ, ఆరోగ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'పార్క్'కు షాక్

5వ పేజీ తరువాయి

ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో పీఎం మిత్ర పథకం కింద అదనపు నిధులు వచ్చే అవకాశాలు లేనట్టు స్పష్టమవుతోంది.

ఎస్‌పీవీలో జాప్యం

కేంద్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం టెక్స్‌టైల్‌పార్క్ ఏర్పాటులో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) జాయింట్ వెంచర్ కింద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది చేస్తేనే పీఎం మిత్ర కిందకు పార్క్ వచ్చినందువల్ల గ్రీన్‌ఫీల్డ్ హోదా లభించేందుకు అవకాశం ఉంది. అప్పుడే కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎస్‌పీవీ ఏర్పాటులోనే తీవ్ర జాప్యం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చేనేత జౌళి శాఖ అధికారులు ఎస్‌పీవీ, జాయింట్ వెంచర్ బాడీ ఏర్పాటు దిశగా కసరత్తు మొదలు పెట్టారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి రెండుమూడు నెలలు పట్టువచ్చునని తెలుస్తోంది. ఇది పూర్తయిన తర్వాత గ్రీన్‌ఫీల్డ్ హోదా కోసం తాజాగా ప్రతిపాదనలు సమర్పించనున్నారు. ఒకసారి గ్రీన్‌ఫీల్డ్ హోదా లభించిన తర్వాత యేటా కేంద్ర బడ్జెట్‌లో పార్క్‌కు రూ.500.కోట్ల వరకు కేటాయింపు జరుగుతుంది.

ఎంపీ అభ్యర్థిగా మోజెస్ ఆనంద్‌కు మద్దతిస్తాం

టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ

హనుమకొండ సిటీ, జనవరి 30: టీపీసీసీ ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్ మోజెస్ ఆనంద్ పాల్‌కు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ అవకాశం కల్పించాలనే అంశానికి టీఎంఆర్‌పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల బిక్షపతి మాదిగా వెల్లడించారు. మంగళవారం హనుమకొండలో జరిగిన తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండకు చెందిన మోజెస్ పాల్ ఆనంద్‌కు వరంగల్ ఎంపీ టికెట్ కేటాయిస్తే మద్దతు ఇస్తామని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్‌కు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న మోజెస్ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆయనకు ఉన్న ఆసక్తిని పరిశీలించే తాము మద్దతు ప్రకటిస్తున్నట్లు బిక్షపతి మాదిగా పేర్కొన్నారు. ఆయన గెలుపు కోసం తాము పని చేస్తామన్నారు.

సంక్షేమ బోర్డును రక్షించాలి

హనుమకొండ రూరల్, జనవరి 30: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కార్మికశాఖ అధికారి రమేశ్‌బాబుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాజకీయ సంస్థల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది మంది కార్మికవర్గంతో సమ్మె చేపడుతున్నామని, ఈ సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బానోతు వెంకన్న, రాచమల్ల వెంకటేశ్, పుల్ల అశోక్, కూస రాజేష్, గద్దల కుమార్, వల్లపు రాజు, లింగమూర్తి, శ్రీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీని ప్రవేశపెట్టాలి

డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్

హసన్‌పర్తి, జనవరి 30: పట్టణ ప్రాంత కుటుంబాలకు ఉపాధి హామీని ప్రవేశపెట్టాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హసన్‌పర్తిలో ఉపాధిహామీ పరిరక్షణ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఉపాధిహామీ చట్టాని ఉల్లంఘించిందన్నారు. వారిహక్కుల గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలను పట్టించుకోవాలన్నారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో జరిగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు బొర్ర సంపూర్ణ, చుంచు నరేష్, మేకల అనిత, రాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాషన్



తెలుగు రాష్ట్రాల్లో శ్రీకాళహస్తి, పెడన దగ్గర ఎక్కువగా కలంకారి పరిశ్రమ కేంద్రీకృతమై ఉంది. కలంకారి బట్టల తయారీలో ఎక్కువగా నీళ్ల ప్రవాహాల అవసరం ఉంటుంది. అందుకే ఈ పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉంది. అంతే కాకుండా ఒక కలంకారి వస్త్రం తయారవ్వాలంటే సుమారు 45 రోజులు పడుతుంది. దీనివల్ల ఈ పరిశ్రమకు పరిమితులు ఎక్కువ. "ఇంతకు ముందు కేవలం కాటన్ పైనే కలంకారి డిజైన్లు వేసేవారు. ఇప్పుడు తయారీ ప్రక్రియలో కొన్ని మార్పులు చేసి సిల్క్, హోసరీ వస్త్రాలపై డిజైన్లు వేయగలుగుతున్నాం" అంటారు కలంకారి వస్త్ర వాణిజ్యవేత్త మనోజ్ఞ. తాజాగా ఆమె మార్కెట్లో విడుదల చేసిన లెగ్గింగ్స్‌కు, రెడీ టూవేర్ జాకెట్స్‌కు విపరీతమైన డిమాండ్ వచ్చింది. దీనితో కేవలం చీరలు మాత్రమే కాకుండా చుడీదార్లు, కుర్తీలు, స్టోల్స్, దుపట్టాలు, దుప్పట్లు మొదలైనవి కూడా తయారు చేస్తున్నామంటున్నారు మనోజ్ఞ. మనకు ప్రకృతిలో దొరికే కరక్కాయ, జాజిఆకు, పసుపు వంటి సేంద్రియ పదార్థాలతో చేసే కలంకారి దుస్తుల తయారీ లైఫ్ సైకిల్‌ను ఆమె 'నవ్య'కు వివరించారు.

కలంకారికి కొత్త అర్థం!





కలంకారి బట్టల తయారీలో మొత్తం 16 స్టెప్స్ ఉంటాయి. దీనిలో ఏ ఒక్కటి తేడా వచ్చినా మొత్తం పాడైపోతుంది. అందువల్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

తయారీ ఇలా...

వీటిలో మొదటిది ఎంచుకున్న కోరా లేదా తెల్ల బట్టను గంజిపోయే వరకూ ఉతికి ఆరబెడతారు. ఇలా ఆరబెట్టిన బట్టను ముందుగా తయారుచేసుకున్న కరక్కాయ రసంలో నానబెడతారు. ఈ రసంలో కొద్దిగా పాలు కూడా కలుపుతారు. ఇలా నానబెట్టిన గుడ్డను ఎండలో ఆరబెడతారు. అందువల్ల చాలా సందర్భాలలో కలంకారి బట్టలు మొదటి సారి వేసుకున్నప్పుడు పాల వాసన వస్తూ ఉంటాయి. ఇలా ఆరబెట్టిన బట్టలపై బ్లాక్‌ల ద్వారా తొలి డిజైన్ వేస్తారు. ఈ బ్లాక్‌లను టేకు చెక్కతో నాలుగు ఇంచుల పొడవు, 9 ఇంచుల వెడల్పు ఉండేలా తయారుచేస్తారు. వీటిని ప్రత్యేకంగా తయారుచేసిన నూనెలలో సీజనింగ్ చేస్తారు. వీటిపై రకరకాల డిజైన్లను చెక్కుతారు. ఈ గుడ్డలపై ప్రకృతిసిద్ధమైన రంగుల డిజైన్లను వేసిన తర్వాత ఆ గుడ్డలను నీటి ప్రవాహం పారే ప్రాంతంలో తాడు కట్టుల మీద వదిలివేస్తారు. ఇలా గుడ్డ నానిన తర్వాత-దానిని పెద్ద పెద్ద రాగి బాండీలలో ఉడకపెడతారు. ఈ సమయంలో జాజి ఆకును తప్పనిసరిగా వాడతారు. దీని వల్ల రంగులు కాంతిమంతంగా తయారవుతాయి. ఆ తర్వాత దానిని సహజసిద్ధమైన ఎండలో ఆరబెడతారు. ఈ విధంగా తయారుచేసిన కలంకారీ గుడ్డలపై రంగులు ఎప్పటికీ నిలిచిఉంటాయి.

కలంకారీ బ్లాక్‌లపై చెక్కే డిజైన్లు కూడా చాలా ప్రత్యేకంగా ఉంటాయి. సాధారణంగా ఈ బ్లాక్‌లను గుడ్డలపై అద్దేది మహిళలే! అందుకే కలంకారి పరిశ్రమలో 90 శాతం మంది మహిళలే ఉంటారు. కొన్ని పనులకు మాత్రమే పురుషులు కనిపిస్తారు. దీనిలో వాడే కరక్కాయ, జాజిఆకు వంటి వాటిని ఆదివాసులు అడవుల నుంచి సేకరించి తీసుకువస్తారు.

వేటితో రంగులు తయారుచేస్తారు? దానిమ్మపొడి, ఎర్రకాసు (కిళ్లీల తయారీలో కూడా వాడతారు), అల్లిరియన్, ఉల్లిపాయల పొట్టు, బంతిపువ్వుల రేకులు, బెల్లం, అడవుల్లో దొరికే కొన్ని రకాల వేళ్లు.



ఫ్రాక్స్
ఈ ఫ్రాక్‌లు పార్టీలకు వేసుకు వెళ్లటానికి బావుంటాయి. అదే సమయంలో డైలీ వేర్‌కు కూడా పనికొస్తాయి.



మనోజ్ఞ
మానవ్ కలంకారి
9666588111



స్టిచబుల్ జాకెట్లు
హోసరీ మెటీరియల్‌తో వీటిని తయారు చేస్తున్నారు. అన్ని వయసులవారూ వీటిని ధరించవచ్చు.



లెగ్గింగ్స్
లెగ్గింగ్స్ ఇప్పుడు మహిళల వార్డ్‌రోబ్‌లో ఒక ముఖ్య భాగమయిపోయాయి. కలంకారీ డిజైన్లలో హోసరీ మెటీరియల్ ద్వారా తయారుచేసే లెగ్గింగ్స్‌కు ఇప్పుడు విపరీతమైన డిమాండ్ ఉంది.

చీరలు
కాటన్, సిల్క్, కోటా సిల్క్ మొదలైన వాటితో తయారుచేసిన చీరలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఒకప్పుడు కలంకారీలో కాటన్ చీరలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు సిల్క్ చీరలు కూడా లభిస్తున్నాయి.

దానిమ్మతో ఫేస్‌ప్యాక్స్



దానిమ్మ తింటే ఆరోగ్యమే కాదు చర్మ సౌందర్యానికి మేలు చేస్తుంది. చర్మ ఆరోగ్యానికి మేలు చేసే అద్భుతమైన గుణాలుండే దానిమ్మతో సులువుగా ఫేస్‌ప్యాక్స్ చేసుకోవచ్చు..

- బౌల్‌లో టేబుల్ స్పూన్ దానిమ్మరసం, టేబుల్ స్పూన్ పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడచుట్టూ పట్టిస్తే చర్మంలో మెరుపు వస్తుంది.
- తరచుగా దానిమ్మ పండు తిన్నా ఇందులోని విటమిన్లు, యాంటీయాక్సిడెంట్లు, మినరల్స్ వల్ల చర్మంలో నిగారింపు వస్తుంది. ఇందులో విటమిన్-సి ఉండటం వల్ల మొటిమలు రావు.
- టేబుల్ స్పూన్ దానిమ్మరసంలో, టీస్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే నల్లటి మచ్చలు తొలగిపోతాయి.
- ఇంట్లో రోజ్‌వాటర్ ఉంటే .. ఒక టీ స్పూన్ తీసుకుని అందులోకి అంతే పరిమాణంలో దానిమ్మరసం వేసి కలిపిన తర్వాత ముఖానికి మసాజ్ చేసినట్లు చేయాలి. తరచూ ఇలా చేస్తే.. ముఖం తేజోవంతంగా కనిపిస్తుంది.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ దానిమ్మగింజల గుజ్జు తీసుకుని ఇందులోకి అంతే పరిమాణంలో కలబంద గుజ్జును కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించిన తర్వాత అరగంట ఆగి శుభ్ర పరచాలి. ఇలా చేస్తే చర్మంలో ఉండే దురద తగ్గిపోతుంది. మంటలు తగ్గిపోతాయి.
- టేబుల్ స్పూన్ దానిమ్మరసంలోకి టీస్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి నలభై నిముషాల తర్వాత శుభ్రం చేస్తే చర్మం స్మూత్‌గా తయారవుతుంది.

పిల్లలకు దెబ్బలు తగలకుండా సున్నితంగా పెంచుకుంటాం! కానీ హైదరాబాద్‌కు చెందిన రవి మంజూష, తన తొమ్మిదేళ్ల కూతురు గగనను తైక్వాండో ఫైటర్‌గా తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన గగన, త్వరలో నేపాల్, అర్జెంటీనాల్లో జరగబోయే ప్రపంచ పోటీల్లో కూడా పాల్గొనబోతోంది. తైక్వాండో క్రీడ పట్ల గగనకు ఉన్న ఆసక్తి, సాధించిన విజయాల గురించి మంజూష 'నవ్య'తో ఇలా పంచుకుంది.

స్ఫూర్తి

తైక్వాండోలో తడాఖా చూపిస్తూ



"అమ్మాయిల మీద అఘాయిత్యాలను ప్రతి రోజూ చూస్తున్నాం. చివరకు బడుల్లో కూడా పిల్లల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అలాంటప్పుడు ఆడపిల్లకు స్వీయరక్షణ అవసరమని అనిపించింది. అలా గగనకు తైక్వాండో శిక్షణ ఇప్పించడం మొదలుపెట్టాం. తక్కువ వ్యవధిలోనే తను ఆ క్రీడ మీద ఆసక్తినీ, పట్టునూ పెంచుకుంది. పైగా తెలంగాణా స్టేట్ పోలీస్ అకాడమీలో ట్రైనర్‌గా పని చేస్తున్న సుబ్బారావు మాస్టారు పాపకు గురువుగా మారారు. ఆయన తైక్వాండోలో ఒలంపిక్స్‌లో ఆరు సార్లు విజయం సాధించారు. అలా గత రెండున్నరేళ్లుగా ఆయన ఆధ్వర్యంలో గగన, తైక్వాండోలో పరిణతి సాధించగలిగింది.

వచ్చే నెల నేపాల్‌లో జరగబోయే ఏసియన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కూ, మేలో అర్జెంటీనాలో జరగబోయే వరల్డ్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కూ ఎంపికైంది. ఈ పోటీలకు పాపను పంపించాలనే నిర్ణయించుకున్నాం. స్పోర్ట్స్ అథారిటీ ఆర్థిక సహాయాన్ని కోరాం!

దెబ్బ తగిలినా వెరవకుండా...

పోరాట క్రీడలో దెబ్బలనేవి సహజం. కానీ పాపకు తైక్వాండోలో ఎలాంటి దెబ్బలు తగలకపోయినా, రోడ్ డివైడర్‌కు తగిలి కాలికి గాయమైంది. దాంతో వెంటనే డాక్టరుకు చూపించాం. ఆయన కొద్ది రోజులు విశ్రాంతి అవసరం అన్నారు. కానీ రెండు రోజుల్లోనే ఇంటర్‌స్టేట్ లెవల్ పోటీలున్నాయి. ఆ పోటీల నుంచి తప్పుకుందాం అనుకున్నాం. కానీ గగన పోటీల్లో పాల్గొని తీరవలసిందేనని పట్టు పట్టింది. కాలు నొప్పిని సైతం లెక్క చేయకుండా పోటీలో పాల్గొని వెండి పతకాన్ని గెలుచుకుంది. తర్వాత దెబ్బ తగిలిన కాలి పరిస్థితి మరింత దిగజారి, సర్జరీ చేయించే పరిస్థితి తలెత్తింది. ఆ తర్వాత సర్జరీ అవసరం లేకుండా కొద్ది రోజుల విశ్రాంతితో నయమైపోవడంతో మేమంతా ఊపిరి పీల్చుకున్నాం. జాతీయ పోటీలకు ముందు కూడా గగనకు చికెన్ పాక్స్ సోకింది. అదృష్టవశాత్తూ ఆ పోటీలు నెల రోజులకు వాయిదా పడ్డాయి. ఈ క్రీడ శ్రమతో కూడుకున్నది కాబట్టి గగనకు డ్రై ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్ లడ్డు, పళ్ల రసాలు లాంటి బలవర్ధకమైన ఆహారం అందిస్తూ ఉంటాం. రోజంతా చురుగ్గా ఉండడం కోసం, హుషారుగా తైక్వాండో శిక్షణ తీసుకోవడం కోసం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ ఉంటాం. తైక్వాండో క్రీడకు తగ్గట్టుగా శరీరం చలాకీగా ఉండడం కోసం గగన, ఉదయాన్నే గంట పాటు బ్యాడ్మింటన్ కూడా ఆడుతూ ఉంటుంది.

చదువులోనూ ముందంజే...

గగన రోజూ ఉదయాన్నే ఐదున్నరకే నిద్ర లేస్తుంది. తర్వాత గంట పాటు బ్యాడ్మింటన్ ఆడుతుంది. తర్వాత ఒక గంట ట్యూషన్‌కు హాజరై ఎనిమిదిన్నరకు స్కూల్‌కు వెళ్తుంది. మధ్యాహ్నం మూడున్నరకు స్కూల్ నుంచి వచ్చిన తర్వాత గంట పాటు విశ్రాంతి తీసుకుని, అకాడమీకి వెళ్లి మూడు గంటల పాటు తైక్వాండో సాధన చేసి వచ్చి, గంట పాటు హోమ్‌వర్క్ పూర్తి చేసుకుని, తొమ్మిది గంటలకు నిద్ర పోతుంది. ప్రస్తుతం గగన అల్కాపురిలోని ఇలైట్ ఇంటర్నేషనల్ స్కూల్లో మూడో తరగతి చదువుతోంది. సాధారణంగా పిల్లలు కొద్ది పాటి శ్రమకే అలసిపోతూ ఉంటారు. కానీ గగన ఇంత టైట్ షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నప్పటికీ ఎప్పుడూ ఇతరత్రా వ్యాపకాల పట్ల ఆసక్తిని కనబరచలేదు. పోటీల్లో నెగ్గడమే లక్ష్యంగా కష్టపడుతూ ఉంటుంది. చదువులో కూడా తనది ముందంజే! మొదటి మూడు ర్యాంకుల్లోనే ఉంటూ ఉంటుంది."



మాది ఖమ్మం. హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. మా వారు రవి కృష్ణ. ఐబిఎమ్‌లో సీనియర్ మేనేజర్. బాబు కాశ్విన్ ఎల్‌కెజిలో ఉన్నాడు. నేను చార్టర్డ్ అకౌంటెంట్‌గా పని చేశాను. కానీ గగనకు పూర్తి సమయాన్ని కేటాయించాలనే ఉద్దేశంతో ఇంటికే పరిమితమైపోయాను. పాల్గొన్న ప్రతి పోటీలో గగన గెలిచి తీరాలన్నది మా లక్ష్యం కాదు. పాప గెలుపోటములను సమానంగా స్వీకరించగలగాలి. మరీ ముఖ్యంగా తనను తాను అన్వేషించుకోవాలనే మేం కోరుకుంటూ ఉంటాం. పెరిగి పెద్దయ్యాక తాను ఏ రంగంలో స్థిరపడాలన్నది పాప నిర్ణయానికే వదిలేశాం!

• గోగుమళ్ల కవిత

ఆరోగ్యానికి అసలైన నియమాలు...



- ఎన్ని మాటలు చెప్పినా ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాట వాస్తవం. ఆరోగ్యంగా ఉండాలనుకోవటం వేరు.. ఆరోగ్యం కోసం నియమాలను పాటించటం వేరు. ఈ రెండో కోవలోకి చెందినవారే ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. తిండి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. జిహ్వ రుచికోసం ఆలోచిస్తే.. పొట్ట పెరగటంతో పాటు పలురకాల సమస్యలు వేధిస్తాయి. అందుకే తిని సంతోషపడటం కంటే శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవటం మంచిది.
- ఉప్పు, చక్కెర శాతం అధికంగా ఉండకుండా జాగ్రత్త పడాలి. వీలైతే వాటిని పక్కన పెట్టడం మంచిది. తాజా ఆహారమే తినాలి. ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినాలి.
- ఒకేచోట కదలకుండా గంటలతరబడి కూర్చున్నా, కనీస శారీరక శ్రమ లేకపోయినా ఆరోగ్య సమస్యలు వస్తాయి. కనుక రోజూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి. నడక, జిమ్, యోగా లాంటి వాటివల్ల శరీరంలో టాక్సిన్స్ తొలగిపోతాయి.
- డిజిటల్ పొల్యూషన్‌లో చిక్కుకుని ఫోన్‌తో ఎక్కువ సమయం గడపటంవల్ల నిద్ర సమస్యలు వస్తాయి. ఎంత తిన్నా, ఎంత వ్యాయామం చేసినా సుఖమైన నిద్ర తప్పనిసరి.

ముప్ఫై ఆరేళ్లు... 500 గ్రామాలు... 30 లక్షల మొక్కలు... 2,800 స్వయం సహాయక బృందాలు ఏర్పాటు ద్వారా 30 వేల మందికి పైగా మహిళలకు స్వయం ఉపాధి. 'జార్ఖండ్ లేడీ టార్జాన్' ఛామీ ముర్ము సాధించిన ఘనతల్లో ఇవి కొన్ని. ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారం పొందిన ఆమె తన జీవితాన్ని పర్యావరణ పరిరక్షణకు, మహిళల శ్రేయస్సుకు అంకితం చేశారు.

'మొక్క'వోని దీక్ష... పర్యావరణానికి రక్ష



అది 1996. ఒక రోజు తెల్లవారుజామునే ఎవరో తలుపు తట్టడంతో నిద్ర నుంచి మేలుకున్నారు ఛామీ ముర్ము. వీధిలో జనం గట్టిగా మాట్లాడుకుంటున్న శబ్దాలు. తలుపు తీసి చూశారు. చాలామంది మహిళలు ఆమె ఇంటి బయట నిలబడి ఉన్నారు. వారిలో ఆందోళన, ఆగ్రహం కనిపిస్తోంది. "మొక్కలన్నీ నరికేశారమ్మా!" అని వాళ్లు కన్నీరు మున్నీరవుతూ చెప్పిన మాటలు విని ఛామీ దిగ్భ్రాంతి చెందారు. వాళ్లను సముదాయిస్తూ, ఊరి బయటకు వెళ్లి చూశారు. లక్ష మొక్కలు! ఎనిమిదేళ్ల పాటు ఒక యజ్ఞంలా సాగించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆ మైలురాయిని కొద్ది రోజుల ముందే చేరుకున్నారు. చూస్తే ఒక్క మొక్కనైనా మిగల్చకుండా అన్నిటినీ నరికేశారు. అది గ్రామంలోని కొందరు పురుషులు చేసిన పనేనని ఆమెకు తెలుసు.

చెట్లు ఉంటేనే మనుగడ...

యాభై రెండేళ్ల ఛామీ స్వగ్రామం జార్ఖండ్‌లోని సరైకేలా ఖార్సావాన్ జిల్లా భుర్‌సాయ్ గ్రామం. ఆమె పదోతరగతిలో ఉండగా... ఒక ప్రమాదంలో తండ్రినీ, అన్నను కోల్పోయారు. అనారోగ్యంతో ఉన్న తల్లి, ముగ్గురు తోబుట్టువుల సంరక్షణ బాధ్యత మీద పడడంతో చదువు ఆపెయ్యాల్సి వచ్చింది. ఊళ్లోనే వ్యవసాయ పనులు చేసేవారు. 1988లో, ఒక స్నేహితురాలి ప్రోత్సాహంతో... అక్కడికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక పట్టణంలో... గ్రామీణ మహిళల వికాసంపై నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరయ్యారు. మహిళలు స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టించుకొని, ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుకొనే మార్గాలతో పాటు పర్యావరణ పరిరక్షణ గురించి కూడా ఆ సదస్సులో వివరించిన విషయాలు ఛామీలో అనేక ఆలోచనలు రేకెత్తించాయి. "వంట చెరకు కోసం చెట్లను నరకడం గ్రామీణ ప్రాంతాల్లో అలవాటే. దానివల్ల పర్యావరణానికి ఎంత హాని జరుగుతోందనేది మా గ్రామం చుట్టుపక్కల బంజరులా తయారైన భూములు చూసిన తరువాత అర్థమయింది. చెట్లు ఉంటేనే మనకు మనుగడ. అందుకే... ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం మొదలుపెట్టాను. కానీ ఇలాంటి పని ఒక మహిళ చేయడం మా గ్రామంలో పురుషులకు ఇష్టం లేదు. ఎన్నో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మా ఇంట్లోనూ వాదనలు నడిచాయి. అయితే నా సోదరుడు నాకు అండగా నిలబడ్డాడు. జీవనోపాధి కోసం పొలాల్లో కూలీగా పని చేస్తూనే... కొంత సమయాన్ని మొక్కలు నాటే పనికి కేటాయించేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు ఛామీ. ప్రకృతిని సంరక్షించడం ఎంత అవసరమో తోటి మహిళలకు ఆమె వివరించారు. పదకొండుమంది సభ్యులతో 'సహయోగి మహిళ' అనే సంస్థను స్థాపించారు. ప్రభుత్వ సామాజిక అటవీ కార్యక్రమంలో భాగస్వామి అయ్యారు. స్వయంగా ఒక నర్సరీని ప్రారంభించారు. 1996 నాటికి లక్ష మొక్కలు నాటారు. కానీ ఒక్క రాత్రిలోనే వాటిని గ్రామంలోని కొందరు మగవాళ్లు నాశనం చేశారు. "నా కుటుంబ సభ్యులకు హాని జరిగినట్టు విలవిలలాడిపోయాను. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. నిందితులు అరెస్టయ్యారు. ఇక మొక్కలు నాటడం ఆపెయ్యాలని శ్రేయోభిలాషులు కొందరు సూచించారు. అలా చేస్తే వాళ్లను గెలిపించినట్టవుతుంది. మరింత ఉత్సాహంగా పని చేస్తాను" అని చెప్పాను. మళ్లీ లక్షకు పైగా మొక్కలు నాటాను. అప్పుడే కేంద్ర ప్రభుత్వం నాకు 'ఇందిరా ప్రియదర్శిని వృక్ష మిత్ర' పురస్కారాన్ని అందజేసింది. దాంతో నన్ను వ్యతిరేకిస్తున్న వారి నోళ్లు మూతపడ్డాయి. ఆ తరువాత ఎవరినుంచీ, ఎటువంటి ఇబ్బందీ నాకు ఎదురు కాలేదు" అని ఆమె తెలిపారు.



అందుకే వివాహం చేసుకోలేదు...

అప్పటినుంచి రెట్టించిన ఉత్సాహంతో తన కార్యకలాపాలను మరిన్ని గ్రామాలకు ఛామీ విస్తరించారు. 500కు పైగా గ్రామాల్లో వేలాది మంది మహిళలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. గత ముప్ఫై ఆరేళ్లలో 30 లక్షల పైచిలుకు మొక్కలు నాటడానికి దోహదపడ్డారు. "ఎక్కువగా యూకలిప్టస్, తుమ్మ, మద్ది, వేప, జామ, రోజ్‌వుడ్, మామిడి తదితర రకాల చెట్లు నాటుతూ ఉంటాం. గ్రామాల్లో బంజరు భూముల్ని ప్రధానంగా ఎంపిక చేసుకుంటాం. మొక్కలకు, సమీపంలోని పొలాలకు నీరు అందడానికి, భూగర్భ జలమట్టాలు పెంచడానికి చెక్‌డ్యాంలు, వాటర్‌షెడ్ల నిర్మాణం కూడా చేపట్టాం. గ్రామాలు పచ్చదనం సంతరించుకోవడమే కాదు, ఫలసాయం ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థికంగానూ మేలు చేకూరింది" అంటున్నారు ఛామీ. వన్యప్రాణుల పరిరక్షణకోసం, కలప మాఫియా నుంచి అడవులను కాపాడడానికీ ఎడతెగని పోరాటాలు చేసిన ఆమెను 'లేడీ టార్జాన్ ఆఫ్ జార్ఖండ్' అని ఆ ప్రాంతాల వారు పిలుచుకుంటారు. తాను కార్యకలాపాలు సాగిస్తున్న గ్రామాల్లో 2,800 స్వయం సహాయక మహిళా బృందాలను ఆమె ఏర్పాటు చేశారు. సుమారు 30 వేలమంది మహిళల స్వయంఉపాధికి సాయపడ్డారు. దానికోసం ఒక సహకార మహిళా సొసైటీని ఏర్పాటు చేశారు. కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకం, ఆకుకూరలు, కూరగాయల పెంపకం తదితరాలకు ఈ సొసైటీ ఆర్థిక సాయాన్నీ, ఇతర సహకారాన్నీ అందిస్తోంది. ఆమె నేతృత్వంలోని 'సహయోగి మహిళ' సంస్థ బాలికా విద్య, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనతల నివారణ, గర్భిణుల సంరక్షణ తదితర అంశాలపై పని చేస్తోంది. అంగన్వాడీ కేంద్రాలు లేని ప్రాంతాల్లో పోషకాహారాన్ని పంపిణీ చేస్తోంది. జిల్లాపరిషత్ సభ్యురాలుగానూ వ్యవహరిస్తున్న ఛామీ... పర్యావరణానికీ, మహిళా సాధికారతకు చేసిన సేవలకు గుర్తింపుగా 2000లో 'నారీ శక్తి' పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ ఏడాది ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. "దీన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. పర్యావరణ పరిరక్షణకే నా జీవితం అంకితం చేశాను. నా సేవా కార్యక్రమాలకు ఆటంకం కాకూడదని వివాహం కూడా చేసుకోలేదు" అని చెబుతున్న ఛామీ ధైర్యం, ఓర్పు, ఆత్మవిశ్వాసాలకు చిరునామా. "మంచి చెయ్యాలనే ఆలోచనతో నిరంతరం శ్రమిస్తే సత్ఫలితాలు సాధించగలం" అని చెబుతారామె. దానికి ఆమే గొప్ప ఉదాహరణ.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 31 జనవరి 2024
cinema@andhrajyothy.com



పద్మశ్రీ అవార్డ్ విజేతలకు చిరు సత్కారం

పద్మశ్రీ పురస్కారం పొందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, స్థపతి ఎ.వేలు ఆనందాచారిలను పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత మెగాస్టార్ చిరంజీవి సోమవారం తన ఇంట్లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న యక్షగాన కళారూపానికి జీవం పోస్తున్న సమ్మయ్యకు పద్మశ్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. చిత్తూరు జిల్లా వెన్నంపల్లికి చెందిన ఆనందాచారి స్థపతిగా దేవాదాయశాఖలో పనిచేశారు. అనేక ఆలయ నిర్మాణాలకు శిల్పకళా నైపుణ్యాన్ని అందించారు. శిల్పశాస్త్ర విషయాలను శిల్పకళాకారులకు నేర్పిస్తూ ఆయన చేస్తున్న సేవలను చిరంజీవి కొనియాడారు. ఇలాంటి కళారూపాలను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిరంజీవిని సమ్మయ్య, ఆనందాచారి కూడా సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళలను కాపాడాలని ఇరువురూ కోరారు.



'సంఘీ' తప్పుడు పదమని నా కూతురు అనలేదు

ఐశ్వర్య వ్యాఖ్యలపై స్పందించిన రజనీకాంత్

"సంఘీ' అనేది ఎవరి వ్యక్తిత్వాన్నీ కించపరిచే పదం కాదు, ఎవరినో అవమానించాలనే ఆలోచన నా కూతురు ఐశ్వర్యకు లేదు" అని రజనీకాంత్ అన్నారు. ఇటీవలే జరిగిన 'లాల్‌సలామ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో ఐశ్వర్య 'నా తండ్రి సంఘీ కాదు' అంటూ ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలను రజనీకాంత్ సమర్థించుకున్నారు. ఆ చిత్రం ఆడియో ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో మా నాన్నని కొందరు 'సంఘీ' అంటూ విమర్శిస్తున్నారు. నా తండ్రి సంఘీ అయి ఉంటే 'లాల్‌సలామ్' లాంటి సినిమా చేసుండేవారు కాదు. ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అంటారని తర్వాత తెలిసింది. ఈ వేదిక సాక్షిగా చెబుతున్నాను. మా నాన్న 'సంఘీ' కాదు. ఆయన అలాంటివారైతే నా 'లాల్ సలామ్'లో నటించేవారే కాదు' అని ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. హిందుత్వ వాదాన్ని బలపరచడం తప్పు ఎలా అవుతుంది అని నెటిజన్లు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లాలో జరుగుతున్న 'వేట్టైయాన్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న రజనీకాంత్ ఈ వివాదంపై మీడియా ముందు స్పందించారు. 'నా కూతురు ఎక్కడా తప్పుగా మాట్లాడలేదు. 'సంఘీ' అనేది తప్పుడు పదం అని తను చెప్పలేదు. తన తండ్రిని ఆ ఉద్దేశంతో చూడొద్దు అని మాత్రమే చెప్పింది. 'ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తిని అలాంటి దృష్టితో ఎందుకు చూస్తున్నారు' అని ప్రశ్నించడం ఆమె ఉద్దేశం'అని చెప్పారు. 'లాల్‌సలామ్' సినిమాకు ఐశ్వర్య దర్శకురాలు కావడం వల్ల ఆ సినిమాకు ప్రచారం కల్పించేందుకే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారా అని విలేకరులు అడగ్గా అలాంటి అవసరం తమకు లేదని కొట్టిపారేశారు. ఫిబ్రవరి 9న 'లాల్ సలామ్' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.



మహారాష్ట్ర మహారాణిగా..

కెరీర్ బిగినింగ్‌లో యువతరాన్ని మాత్రమే టార్గెట్ చేశారు నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. నటిగా మెప్పిస్తే ఉండే కిక్కేంటో 'యానిమల్' సినిమా తర్వాత అర్థమైనట్టుంది. ఇప్పుడు అన్ని జనరేషన్స్‌నూ ఆకట్టుకునే పనిలోవున్నారామె. అందులో భాగంగా తాను చేస్తున్న సినిమానే 'చావా'. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత గాథ ఆధారంగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. శంభాజీ భార్య, మహారాష్ట్ర ఎంపైర్ మహారాణి యేసుభాయ్ భోస్లే పాత్రను ఇందులో రష్మిక పోషిస్తున్నారు. ఆమె నటిస్తున్న తొలి హిస్టారికల్ మూవీ ఇది. మహారాష్ట్ర చరిత్రలో యేసుభాయ్ భోస్లే పాత్ర విశిష్టమైనది. ఆ పాత్ర చేయడం సామాన్యమైన విషయం కాదు. అలాంటి గొప్ప పాత్రను పోషించనున్నారు రష్మిక మందన్నా. ఇందులో శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్ నటిస్తుండగా, అశుతోష్ రాణా, అక్షయ్‌ఖన్నా ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాత్ర చేస్తుండటం పట్ల రష్మిక ఆనందం వెలిబుచ్చారు. 'అరుదుగా దొరికే అదృష్టం ఇది. ఇంత మంచి పాత్ర ఇచ్చినందుకు దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌కు థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను' అన్నారామె.

సెప్టెంబర్‌లో ఓజీ రాక



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 27న 'ఓజీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం మంగళవారం ప్రకటించింది. 1950ల నాటి ముంబై మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో సుజీత్ ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. గతంలో పవన్ కల్యాణ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'అత్తారింటికి దారేది' చిత్రం కూడా సెప్టెంబర్ 27న విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది.

ముహూర్తం కుదిరింది



'అంటే సుందరానికి' లాంటి హిట్ చిత్రం తర్వాత నాని - దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో వస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నానికి జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

మనసుల్ని కదిలించే సినిమా ఇది



'ఈ సినిమాకోసం ఎక్కువరోజులు ప్రిపేర్ అయ్యాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నాను. కథతో కనెక్ట్ అవ్వడానికి సీన్స్ మళ్లీ మళ్లీ ప్రాక్టీస్ చేశాను. పాత్ర కోసం రెండు సార్లు గుండు గీయించుకున్నాను. నా రెండేళ్ల కష్టం ఈ సినిమా. మంచి ఫలితం వస్తుందని ఆశగా ఉన్నాను. అన్నారు హీరో సుహాస్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండు'. శివాని నాగారం కథానాయిక. దుష్యంత్ కటినేని దర్శకుడు. వెంకటేశ్ మహా, ధీరజ్ మొగిలినేని కలిసి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో ముచ్చటించారు. 'దుష్యంత్ రాసిన కథ నన్ను కదిలించింది. రియల్‌లైఫ్‌లో తను చూసిన కొన్ని సంఘటనల స్ఫూర్తి ఈ కథలో ఉంది. లాక్‌డౌన్ టైమ్ కాబట్టి స్క్రిప్ట్‌ను బాగా స్టడీ చేసే అవకాశం దొరికింది. కథ మీద నమ్మకంతోనే గుండు గీయించుకున్నా. 2007లో జరిగే కథ ఇది. ఇంటర్వెల్ ఇరవై నిమిషాల ముందు వరకు సరదాగా సాగుతుంది. అక్కడ్నుంచి వేరే లెవల్‌కు వెళుతుంది. సెకండాఫ్ మొత్తం ఎమోషనల్ ఫీల్. 'కలర్ ఫోటో'ను మించిన హై ఎమోషన్ ఈ కథలో ఉంటుంది' అని చెప్పారు సుహాస్. ఇంకా మాట్లాడుతూ 'మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ కథ. నేను, శరణ్య కవలలం. మాఇద్దరి పుట్టినరోజున జరిగిన సంఘటనలు మీ జీవితాలను ఎలాంటి మలుపు తిప్పాయి అనేది ఈ మూవీలో కీలకంగా ఉండే అంశం. కథలోని చాలా సీన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి. వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఫైనల్ కాపీ చూశాక సినిమాపై నమ్మకం కుదిరింది. ముఖ్యంగా శేఖర్‌చంద్ర నేపథ్య సంగీతం సినిమాను మరో రేంజ్‌కి తీసుకెళ్లింది. ఇందులో కథానాయికగా పరిచయం అవుతున్న శివానికి మంచి ఫ్యూచర్ ఉంది. మంచి నటి తను. సినిమా విషయంలో మేమంతా కాన్ఫిడెంట్‌తో ఉన్నాం. ఫిబ్రవరి 2న అందరూ థియేటర్ కెళ్లి చూడాలని కోరుకుంటున్నా' అన్నారు సుహాస్.



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కూతురు భవతరిణి ఇటీవలే అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. నటుడు మంచు మోహన్‌బాబు ఇళయరాజా ఇంటికి వెళ్లి ఆయన్ను ఓదార్చారు. ఈ విషయాన్ని మంగళవారం ఆయన సోషల్ మీడియాద్వారా తెలిపారు.

ఇల్లు కొందామనుకున్న డబ్బు ఈ సినిమాలో పెట్టా

సొహైల్



'పాషా లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం. సినిమా అంటే ప్యాషన్‌తో చాలా హర్డ్ వర్క్ చేసి ఈ సినిమా తీశారు. సగం సినిమా పూర్తయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. అప్పుడు మా నాన్న రిటైర్‌మెంట్ పైసలు, ఇల్లు కొందామని నేను దాచుకున్న డబ్బు ఈ సినిమాకు పెట్టా. నిర్మాత దిల్‌రాజుగారికి మా పరిస్థితి చెబితే 'తెలంగాణ నేను చూసుకుంటా. నువ్వు టెన్షన్ పడొద్దు' అని ధైర్యం చెప్పారు. ఆయనకు నా కృతజ్ఞతలు' అన్నారు 'బిగ్‌బాస్' సొహైల్. ఆయన హీరోగా నటించిన 'బూట్‌కట్ బాలరాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన చాలా ఎమోషనల్ అయ్యారు. 'మనం జీవితంలో ఓడినా గెలిచినా ఏ తల్లికీ కొడుకు మీద ప్రేమ పోదు. అదే ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. ఇందులో ఫన్ ఎమోషన్ ఉంది. హీరోయిన్ మేఘలేఖ చక్కగా నటించడమే కాకుండా మా పరిస్థితిని అర్థం చేసుకుని సపోర్ట్‌గా నిలిచారు. దయచేసి ఈ సినిమాను థియేటర్‌లోనే చూడాలని అందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నాను' అన్నారు సొహైల్. చిత్ర దర్శకుడు శ్రీకోనేటి మాట్లాడుతూ 'కథ దగ్గర నుంచి సినిమా తయారయ్యే వరకూ ఈ ప్రయాణంలో బెక్కం వేణుగోపాల్ ఎంతో సహకరించారు. సొహైల్ ఈ సినిమాను తన భుజాల మీద వేసుకుని నడిపించారు. వినోదంతో పాటు మంచి భావోద్వేగం ఉన్న చిత్రమిది' అని చెప్పారు. సొహైల్ ఇమేజ్‌కి తగ్గ కథను ఎన్నుకున్నామనీ, యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా చిత్రాన్ని తీర్చిదిద్దామనీ బెక్కం వేణుగోపాల్ చెప్పారు. సొహైల్‌కు సినిమా అంటే చాలా ఇష్టం. అతనితో ఈ చిత్రం నిర్మించడం గర్వంగా ఉందని నిర్మాత పాషా చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోలు మంచు మనోజ్, సందీప్ కిషన్, రోషన్ కనకాల, విరాజ్ అశ్విన్, బ్రహ్మానందం, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తదితరులు పాల్గొని చిత్రం విజయం సాధించాలని కోరారు.

థ్రిల్లింగ్ భైరవకోన



సందీప్‌కిషన్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఊరిపేరు భైరవకోన'. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సందీప్‌కిషన్ మంత్రదండం పట్టుకుని కనిపించారు. అతని వెనుక హీరోయిన్స్ కనిపించారు. ప్రచార చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని, సినిమా కూడా అందరికీ నచ్చుతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు. వెండితెరపై ఇప్పటివరకూ చూడని థ్రిల్లింగ్ అంశాలు ఈ సినిమాలో ఉంటాయని వారు చెప్పారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, కెమెరా: రాజ్ తోట, సంగీత: శేఖర్ చంద్ర.

మా గేమ్‌ను గెలిపించాలి

చిత్ర యూనిట్




గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం గేమ్ ఆన్. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన ప్రీ గేమ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత వివేక్ కూచిభొట్ల సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'సినిమా నేను చూశాను. మంచి కాన్సెప్ట్‌తో బాగా తీశారు. కంటెంట్ బాగున్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా విజయవంతం చేయాలి' అని కోరారు. హీరో గీతానంద్ మాట్లాడుతూ 'ఇది చాలా యూనిక్ కాన్సెప్ట్. తెలుగులో ఇంతవరకూ రాలేదు. రియల్ టైమ్‌లో సాగే సైకలాజికల్ గేమ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా మీద కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అన్నారు. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'ప్రతి సీన్ కొత్తగా ఉండాలని ప్రయత్నిస్తూ ప్రేక్షకులకు నచ్చేలా చిత్రాన్ని రూపొందించా. కాన్సెప్ట్ కొత్తగా ఆసక్తికరంగా ఉంటుంది. మా గేమ్‌ను గెలిపించాలి' అని కోరారు. ప్రేక్షకులకు ఫ్రెష్ ఫీల్ ఇచ్చే ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉందని నిర్మాత రవి కస్తూరి చెప్పారు.

ఆసక్తిని రేకెత్తిస్తున్న మమ్ముట్టి భ్రమయుగం



విభిన్నమైన పాత్రలు పోషిస్తున్న మహానటుడు మమ్ముట్టి. మలయాళంలో ఆయన సూపర్‌స్టార్. అంత స్టార్‌డమ్‌లోనూ ఏ తరహా పాత్రనైనా చేసేస్తారాయన. రీసెంట్‌గా వచ్చిన మలయాళ చిత్రం 'కాదల్ కోర్'లో స్వలింగసంపర్కునిగా నటించారాయన. ఆయన స్థాయిలో ఉన్న ఏ నటుడూ ఆ పాత్ర చేయరు. దటీజ్ మమ్ముట్టి. ఆయన నటిస్తున్న మరో వైవిధ్య చిత్రం 'భ్రమయుగం'. కేరళ సాంప్రదాయంతో కూడిన మమ్ముట్టి గెటప్స్ చూస్తుంటే, కథలో ఆసక్తికలిగించే అంశం ఏదో ఉన్నట్టు అనిపిస్తోంది. మలయాళంతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం విడుదల కానుంది. రాహుల్ సదాశివన్ రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ కలిసి నిర్మించారు. ఫిబ్రవరి 15న ఈ పాన్ ఇండియా సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: మాటలు: టి.డి.రామకృష్ణన్, షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జెవియర్.

నోయిడాలో ఫిల్మ్ సిటీ.. బిడ్ గెలుచుకున్న బోనీ కపూర్



యమునా ఎక్స్‌ప్రెస్ వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఆధ్వర్యంలో నోయిడాలో వెయ్యి ఎకరాల్లో అంతర్జాతీయ హంగులతో ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసే ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కోసం ప్రభుత్వం నిర్వహించిన ఫైనాన్షియల్ బిడ్‌లో అధిక ధర కోట్ చేసి బే వ్యూ ప్రాజెక్ట్ సంస్థ బిడ్ గెలుచుకుంది. బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్, రియల్ ఎస్టేట్ సంస్థ భూటానీ గ్రూప్‌లకు చెందిన సంస్థ ఇది.. టీ సిరీస్‌కు చెందిన సూపర్ క్యాసెట్స్, నటుడు అక్షయ్‌కుమార్ ఆధ్వర్యంలోని సూపర్ సోనిక్ టెక్నో బిల్డ్, నిర్మాత కె.సి.బొకాడియా సొంత సంస్థ ఫోర్ లయన్స్ ఫిల్మ్స్ సంస్థలు కూడా ఈ పోటీలో పాల్గొన్నాయి. వెయ్యి ఎకరాల స్థలంలో మొదట 230 ఎకరాలల్లో ఫిల్మ్ సిటీ పనులు ప్రారంభిస్తారు.

అర్బాజ్‌ఖాన్ కీలక పాత్రలో అశ్విన్‌బాబు సినిమా..



చిరంజీవి 'జై చిరంజీవ', మోహన్‌లాల్ 'బిగ్ బ్రదర్' చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులకు కూడా సుపరిచితుడైన బాలీవుడ్ నటుడు అర్బాజ్‌ఖాన్, ఓ తెలుగు సినిమాలో కీలకపాత్రలో కనిపించనున్నారు. అశ్విన్‌బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి మహేశ్వరరెడ్డి మూలి నిర్మాత. చాలాకాలం తర్వాత తెలుగు సినిమాలో నటిస్తుండటం, ఓ మంచి కథలో ముఖ్య పాత్ర పోషిస్తుండటం చెప్పలేని ఆనందాన్ని ఇస్తోందని అర్బాజ్‌ఖాన్ ఆనందం వెలిబుచ్చారు. ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ 'వైవిధ్యమైన కథతో రూపొందుతోన్న చిత్రమిది. మా మొదటి ప్రయత్నంలో అర్బాజ్‌ఖాన్ భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఆయన పాత్ర అద్భుతంగా ఉంటుంది. భారీ సాంకేతిక విలువలతో ఈ చిత్రం ఉంటుంది' అని తెలిపారు. దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో హైపర్ ఆది, సాయిధీన ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిస.



పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుతారు

అపూర్వరావ్

'హ్యాపీ ఎండింగ్ ప్యూర్ యూత్‌ఫుల్ మూవీ. ఇందులో హ్యూమర్‌కి కొదవుండదు. ప్రతి పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుకుంటారు' అంటున్నారు కథానాయిక అపూర్వరావ్. 'హ్యాపీ ఎండింగ్' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నారు. యష్ పూరి హీరోగా, కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అపూర్వరావ్ విలేకరులతో మాట్లాడారు. 'మా నేటివ్ ప్లేస్ ఒంగోలు. నాన్న ఉద్యోగం వల్ల చైల్డ్‌హుడ్ మొత్తం గుజరాత్‌లో గడిచింది. అక్కడ్నుంచి కువైట్‌వెళ్లాం. అక్కడే ప్రైమరీ ఎడ్యుకేషన్ కంప్లీట్ చేశాను. ఇండియాకు తిరిగొచ్చి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కొంతకాలం జాబ్ కూడా చేశాను. సంతృప్తినివ్వలేదు. నాకు నటనంటే పిచ్చి. ఇంట్లోవాళ్ల సహకారం లేదు. ఇక పట్టుబట్టి, వాళ్లను ఒప్పించి హైదరాబాద్‌లో దాదాఫాల్కే ఫిల్మ్‌స్కూల్‌లో జాయినై ట్రైనింగ్ తీసుకున్నాను. ఆ టైమ్‌లో పరిచయమైన కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, వాళ్ల కామన్ ఫ్రెండ్స్ ద్వారా 'హ్యాపీ ఎండింగ్' ఆడిషన్స్‌కు వెళ్లే అవకాశం వచ్చింది. బాగా పర్‌ఫార్మ్ చేసే తెలుగమ్మాయి కోసం చూస్తున్న వాళ్లకు నేను నచ్చాను. అలా ఈ సినిమాలో అవకాశం దొరికింది. ఒక మంచి ఎంటర్‌టైనర్ ద్వారా పరిచయం అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు అపూర్వరావ్. ఇంకా మాట్లాడుతూ 'ఇందులో హీరోకు ఓ సమస్య ఉంటుంది. దానివల్ల తను చేయాలనుకున్న పనులు చేయలేకపోతాడు. ఈ సమస్యను హీరో ఎలా ఎదుర్కొన్నాడు, అందుకు తను చేసే ప్రయత్నాలేంటి అనేది చాలా హ్యూమరస్‌గా ఉంటుంది.' అని తెలిపారు అపూర్వ. కో ఆర్టిస్టులందరూ చక్కగా సహకరించారని, సాంకేతికంగా సినిమా అద్భుతంగా ఉంటుందని, ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా చూడాల్సిన సినిమా ఇదని ఆమె పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● బుధవారం 31 జనవరి 2024



మార్కెట్ మళ్లీ ఢమాల్

సెన్సెక్స్ 802 పాయింట్లు డౌన్

రిలయన్స్, ఇతర కంపెనీల షేర్లలో

అమ్మకాలకు పాల్పడిన మదుపర్లు

రూ.2 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: క్రితం సెషన్‌లో భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం మళ్లీ కుప్పకూలాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ సహా ఇతర షేర్లలో మదుపరులు అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ఒక దశలో 865.85 పాయింట్లు పతనమై 71,075 స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. చివరికి 801.67 పాయింట్ల నష్టంతో 71,139.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 215.50 పాయింట్లు క్షీణించి 21,522.10 వద్ద క్లోజైంది. అమ్మకాల హోరులో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్లు తగ్గి రూ.375.20 లక్షల కోట్లకు పరిమితమైంది. "ఆఖరి గంటలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. ఆసియా మార్కెట్ల సంకేతాలు బలహీనంగా ఉండటంతో పాటు వచ్చే నెల 1న పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందుజాగ్రత్త చర్యగా కీలక కంపెనీల షేర్లలో పెట్టుబడుల ఉపసంహరణకు మొగ్గుచూపారు"ని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (రీసెర్చ్) ప్రశాంత్ తాప్సే అన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టాల్లో ముగిశాయి. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపర్చడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 5.17 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఈప్యాక్ లిస్టింగ్ ఫ్లాప్: రూమ్ ఎయిర్‌కండీషనర్లు, చిన్న గృహోపకరణాల తయారీ సంస్థ ఈప్యాక్ డ్యూరబుల్స్ లిమిటెడ్ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.230తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 2.17 శాతం తక్కువకు రూ.225 వద్ద లిస్టయింది. ఒక దశలో 10.56 శాతం వరకు క్షీణించిన కంపెనీ షేరు చివరికి 9.69 శాతం నష్టంతో రూ.207.70 వద్ద ముగిసింది.

ఇష్యూ ధర పైకి ఎల్ఐసీ షేరు

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ షేరు తొలిసారిగా ఐపీఓ ధర ఎగువకు చేరింది. ఇంట్రాడేలో కంపెనీ షేరు ధర రూ.954.85 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. చివరికి 1.82 శాతం లాభంతో రూ.932.75 వద్ద ముగిసింది. దాంతో సంస్థ మార్కెట్ క్యాప్ రూ.5,89,964.16 కోట్లుగా నమోదైంది. 2022 మే 17న ఎల్ఐసీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.949తో పోలిస్తే, బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు 8.62 శాతం డిస్కౌంట్‌తో రూ.867.20 వద్ద లిస్టయింది. తొలిరోజు రూ.920 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన షేరు ధర చివరికి 7.75 శాతం నష్టంతో రూ.875.45 వద్ద స్థిరపడింది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. గత ఏడాది మార్చి చివర్లో షేరు ఆల్‌టైం కనిష్ఠ స్థాయి రూ.530.20 కి పతనమైంది. అప్పటి నుంచి క్రమంగా పుంజుకుంటూ వచ్చింది. జీవనకాల కనిష్ఠ స్థాయి నుంచి దాదాపు 80 శాతం మేర పుంజుకుంది.

మారుతిని దాటేసిన టాటా మోటార్స్

సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచిన టాటా మోటార్స్ షేరు ఒక దశలో 5 శాతానికి పైగా పెరిగి రూ.886.30 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.16 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆ సమయానికి దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ మార్కెట్ క్యాప్ రూ.3.15 లక్షల కోట్ల కంటే అధికమిది. దాంతో స్వల్పకాలం పాటు టాటా మోటార్స్.. మారుతి సుజుకీని వెనక్కి నెట్టి మార్కెట్లో అత్యంత విలువైన వాహన రంగ కంపెనీగా నిలిచింది. అయితే, బీఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి టాటా మోటార్స్ షేరు 2.19 శాతం లాభంతో రూ.859.25 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,85,515.64 కోట్లకు పరిమితమైంది. కాగా, మారుతి సుజుకీ షేరు 0.36 శాతం నష్టంతో రూ.9,957.25కు జారుకున్నప్పటికీ, రూ.3,13,058.50 కోట్ల మార్కెట్ క్యాప్‌తో తన అగ్రస్థానాన్ని తిరిగి నిలబెట్టుకోగలిగింది.



డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,379 కోట్లు

అంచనాలు మించిన క్యూ3 లాభం • ఆదాయంలో 7 శాతం వృద్ధి • కలిసొచ్చిన విదేశీ మార్కెట్లు


హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మార్కెట్ అంచనాలకు మించి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.7,215 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.1,379 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 7 శాతం, నికర లాభం 11 శాతం పెరిగాయి. 'ఉత్తర అమెకా, ఐరోపా దేశాల మార్కెట్లలో కంపెనీ ప్రస్తుత ఔషధాల మార్కెట్ వాటా పెరగడం, కొత్త ఔషధాల విడుదలతో గతంలో ఏ త్రైమాసికంలోనూ లేనంత సాయిలో అమ్మకాలు పెరిగాయి. దీంతో మూడో త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు సాధించగలిగాం' అని కంపెనీ కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు.

[illegible]

డిసెంబరు త్రైమా[illegible] మార్కెట్ ఆదాయం రూ.1,180 కోట్లకు చేరింది. 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది ఐదు శాతం మాత్రమే ఎక్కువ. అయితే ఇదే సమయంలో విదేశీ మార్కెట్ల నుంచి వచ్చే జెనరిక్ ఔషధాల ఆదాయం 7 శాతం పెరిగి రూ.6,300 కోట్లకు చేరిది. ఇందులో ఉత్తర అమెరికా మార్కెట్ ఆదాయం 9 శాతం పెరిగి రూ.3,349 కోట్లకు చేరుకోగా ఐరోపా ఆదాయం 15 శాతం పెరిగి రూ.500 కోట్లకు చేరాయి. దీంతో మూడో త్రైమాసికంలో కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలు సాధించగలిగింది.

[illegible]

మార్కెట్‌పై మం[illegible], అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. డిసెంబరు త్రైమాసికంలోనూ రూ.560 కోట్లు ఇందుకోసం ఖర్చు చేసింది. కంపెనీ క్యూ3 ఆదాయంలో ఇది 7.7 శాతానికి సమానం. గత త్రైమాసికంలో కంపెనీ యూఎస్ఎఫ్‌డీఏ వద్ద రెండు అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్స్ (అండా) ఫైల్ చేసింది. గత ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి అమెరికా ఎఫ్‌డీఏ వద్ద కంపెనీ ఫైల్ చేసిన 79 జెనరిక్ ఔషధాల అనుమతి పెండింగ్‌లో ఉంది.



నాలుగేళ్లలో మూడింతల టర్నోవర్

నూజివీడు సీడ్స్ లక్ష్యం



హైదరాబాద్: వచ్చే నాలుగు నుంచి ఐదేళ్ల కాలంలో విత్తన మార్కెట్లో రెండింతల వృద్ధిని నమోదు చేయవచ్చని నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) అంచనా వేస్తోంది. మంగళవారం నాడిక్కడ నూజివీడు సీడ్స్ కార్యకలాపాలు ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్ఎస్ఎల్ గ్రూప్ చైర్మన్, ఎండీ ఎం ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్లలో విత్తన మార్కెట్ రెండింతల వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ కూడా మూడింతలు పెరగవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.1,100 కోట్లుగా ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ ఈ స్థాయిలోనే ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సంఘటిత విత్తన మార్కెట్ రూ.20,000 కోట్లుగా ఉందని, ఇది ఏటా 10 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందన్నారు. అయితే వచ్చే మూడు నుంచి నాలుగేళ్ల కాలంలో కంపెనీ 19-20 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని ప్రభాకర్ రావు తెలిపారు. కాగా గడచిన మూడేళ్ల కాలంలో మార్కెట్లోకి 30 రకాలైన విత్తనాలను కంపెనీ మార్కెట్లోకి విడుదల చేసింది.

13 ప్రాసెసింగ్ యూనిట్లు: గడిచిన 20 ఏళ్ల కాలంలో మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా ఎన్ఎస్ఎల్ కార్యకలాపాలను విస్తరించినట్లు ప్రభాకర్ రావు తెలిపారు. కంపెనీ ప్రస్తుతం 10కి పైగా రాష్ట్రాల్లో 13 ప్రాసెసింగ్ యూనిట్లు, 29 కోల్డ్ స్టోరేజీ, వేర్‌హౌజ్‌లను నిర్వహిస్తోందన్నారు. అంతేకాకుండా విత్తన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై కంపెనీ ఏటా రూ.50-55 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. పత్తి విత్తన మార్కెట్లో కంపెనీ 15-16%వాటాతో టాప్-3 సంస్థగా ఉందన్నారు.

ఎన్ఎండీసీకి మారుత్ డ్రోన్లు

హైదరాబాద్: డ్రోన్ల తయారీలో అగ్రగామి అయిన మారుత్ డ్రోన్స్.. ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీకి డ్రోన్ ఆధారిత ఖనిజాన్వేషణ చేపట్టడానికి డ్రోన్లు సరఫరా చేసింది. మారుత్ డ్రోన్స్ నుంచి రెండు కస్టమైజ్డ్ ఆక్టాకాప్టర్ డ్రోన్లు సేకరించినట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. ఈ డ్రోన్లకు మాగ్నెటోమీటర్, హైపర్ స్పెక్ట్రల్, లిడార్ వంటి ఆధునిక సెన్సర్లుంటాయి. దీని వల్ల ఖనిజాన్వేషణ సామర్థ్యాలు పెరుగుతాయి. కచ్చితమైన మ్యాపింగ్, అన్వేషణకు ఇవి సహాయపడతాయని మారుత్ డ్రోన్స్ సీఈఓ ప్రేమ్‌కుమార్ విస్లావత్ తెలిపారు.

అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ రెండు కొత్త ప్రాజెక్టులు

హైదరాబాద్‌లో రూ.2,425 కోట్ల పెట్టుబడితో రెండు గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టినట్టు అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రకటించింది. రెండు ప్రాజెక్టుల్లో మొత్తం 2,500 పైగా అపార్ట్‌మెంట్లు ఉంటాయని, అపార్ట్‌మెంట్ల సైజు 1,475 చదరపు అడుగుల నుంచి 3,700 చదరపు అడుగుల మధ్యన ఉంటుందని తెలిపింది. వాటిలో అపర్ణా న్యూలాండ్స్ 14 ఎకరాల్లో విస్తరించి ఉంటుందని, మొత్తం 1,976 హౌసింగ్ యూనిట్లు ఉంటాయని పేర్కొంది. 5 ఎకరాల స్థలంలో విస్తరించి ఉండే అపర్ణా సరోవర్ ప్రాజెక్టులో 585 హౌసింగ్ యూనిట్లుంటాయి.

55% తగ్గిన కోరమాండల్ లాభం

హైదరాబాద్: మురుగప్పా గ్రూప్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. ఈ కాలానికి కంపెనీ రూ.5,510 కోట్ల ఆదాయంపై రూ.243 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 34 శాతం, నికర లాభం 55 శాతం పడిపోయాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,270 ▲	57,850 ▲	78,000 ▲
ముంబై	62,610 ▲	57,351 ▲	71,742 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ	
హైదరాబాద్	520
31 జనవరి	
చిత్తూరు	573
గోదావరి	530
విజయవాడ	530
విశాఖపట్నం	565
వరంగల్	522

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109
వరంగల్	109
కరీంనగర్	109
మహబూబ్‌నగర్	109
కర్నూలు	109
విశాఖపట్నం	110
గోదావరి	113
విజయవాడ	113
గుంటూరు	114
ఒంగోలు	114
చిత్తూరు	123

ఇండెల్ మనీ ఎన్‌సీడీల జారీ

రూ.200 కోట్ల సమీకరణ

హైదరాబాద్: నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.200 కోట్ల వరకు సమీకరించనున్నట్లు గోల్డ్ లోన్ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెల్ మనీ లిమిటెడ్ తెలిపింది. ఈ నెల 30న (మంగళవారం) ప్రారంభమైన ఈ పబ్లిక్ ఇష్యూ.. వచ్చే నెల 12న ముగియనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.1,000 ముఖ విలువ కలిగిన ఎన్‌సీడీలను జారీ చేయనుంది. 366 రోజుల నుంచి 72 నెలల కాలపరిమితులతో కూడిన ఈ బాండ్లపై 12.25 శాతం వరకు వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తున్నట్లు ఎన్‌బీఎఫ్‌సీ తెలిపింది. ఈ ఇష్యూలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు కనీసం 10 యూనిట్లు కొనుగోలు (రూ.10,000 పెట్టుబడి) చేయాల్సి ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది.

స్పోర్ట్స్

టైటాన్స్ 15వ ఓటమి

పట్నా: ప్రొ కబడ్డీ సీజన్-10లో తెలుగు టైటాన్స్ చెత్త ఆటలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. మంగళవారం పుణెరి పల్టన్ జట్టు 60-29 స్కోరుతో టైటాన్స్‌ను చిత్తుగా ఓడించింది. ఈ విజయంతో పుణె 68 పాయింట్లతో లీగ్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. రైడర్లు ఆకాష్ షిండే (11 పాయింట్లు), మోహిత్ గోయత్ (8 పాయింట్లు), మహ్మద్ రేజా (7 పాయింట్లు) పుణె గెలుపులో కీలకపాత్ర పోషించారు. టైటాన్స్ ప్లేయర్లలో సంజీవి (8 పాయింట్లు) వినహా ఎవరూ ఆకట్టుకోలేదు. కెప్టెన్ కమ్ టైటాన్స్ స్టార్ ప్లేయర్ పవన్ షెహ్రావత్ (4 పాయింట్లు) కూడా విఫలమయ్యాడు. మొత్తంగా ఈ లీగ్‌లో టైటాన్స్‌కు ఇది 15వ పరాజయం.

ఆటకంటే.. అనవసర విషయాలపైనే..!

మహిళా ప్లేయర్లపట్ల వివక్షపై దివ్య ఆవేదన



న్యూఢిల్లీ: నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీ సమయంలో ప్రేక్షకుల నుంచి తనకు చేదు అనుభవం ఎదురైందని టీనేజ్ చెస్ ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ ఆవేదన వ్యక్తం చేసింది. ఆట కంటే.. అనవసర విషయాలపైనే ఎక్కువగా దృష్టిపెట్టారని వాపోయింది. తను ఎదుర్కొన్న లింగ వివక్ష గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఈ విషయాన్ని ఎప్పటి నుంచో చెప్పాలనుకొంటున్నా. కానీ, టోర్నీ ముగిసే వరకు వేచి ఉన్నా. మహిళా ప్లేయర్ల పట్ల ప్రేక్షకులు ఎంత చులకనగా వ్యవహరిస్తారనే విషయాన్ని గమనించా. వారు నా ఆటకంటే.. దుస్తులు, కురులు, యాస ఇలా అనవసర విషయాలను పట్టించుకొంటున్నారని తెలిసి ఎంతో బాధేసింద'ని దివ్య రాసింది. అమ్మాయిల విషయంలో ఆట కంటే.. వారి అందం, తదితర వ్యక్తిగత విషయాలపై వీక్షకులు దృష్టిపెట్టడమంటే తమను చులకనగా చూడడమేనని ఆరోపించింది. అదే పురుషుల గురించి అయితే.. వారి ఆటపైనే ఎక్కువగా మాట్లాడతారని దేశ్‌ముఖ్ చెప్పింది. పుణెకు చెందిన 18 ఏళ్ల దివ్య గతేడాది ఆసియా చాంపియన్‌షిప్ గెలిచింది. తాజాగా ముగిసిన టాటా స్టీల్ మాస్టర్స్ చాలెంజర్స్ విభాగంలో 12వ స్థానంలో నిలిచింది. కాగా, దివ్య పోస్టుపై హంగేరి గ్రాండ్ మాస్టర్ సుసాన్ పోల్గర్ (54) స్పందించింది. వయసులో ఉన్నప్పుడు.. ఇలాంటి వేధింపుల నుంచి తప్పించుకొనేందుకు తాను ఎంతో సాదాసీదాగా ఉండేదానినని చెప్పింది.

ఎంపిక ఎలా?

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

వైజాగ్ చేరుకున్న గిల్, కుల్దీప్




ఇంగ్లండ్ చేతిలో తొలి టెస్టు పరాజయం ఓవైపు బాధిస్తుండగానే.. శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టుకు కీలక ఆటగాళ్లు దూరం కావడం టీమిండియాను మరింతగా ఆందోళనపరుస్తోంది. ఈనేపథ్యంలో విశాఖ టెస్టు కోసం పకడ్బందీగా బరిలోకి దిగాలనుకున్న జట్టుకు తుది జట్టు ఎంపిక సమస్యగా మారింది. విరాట్‌తో పాటు ఆల్‌రౌండర్ జడేజా, బ్యాటర్ కేఎల్ రాహుల్ అందుబాటులో లేకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను డైలమాలో పడేస్తోంది. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మెరుగ్గా ఆడడంలో ఈ ఇద్దరిదే ప్రధాన పాత్ర. తాజాగా జట్టులోకి సర్ఫరాజ్ ఖాన్, సౌరభ్ కుమార్, వాషింగ్టన్ సుందర్‌లను తీసుకున్నారు. జడేజా స్థానంలో కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తను ఆడిన ఎనిమిది టెస్టుల్లో 34 వికెట్లు తీశాడు. ఒకవేళ తొలి టెస్టులో ఇంగ్లండ్ మాదిరి ఒక పేసర్‌తో వెళ్లాలనుకుంటే సిరాజ్‌పై వేటు తప్పదు. తొలి టెస్టులో ఈ హైదరాబాదీ కేవలం 11 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి వికెట్ పడగొట్టలేకపోయాడు. అయితే ఏకైక పేసర్‌గా బుమ్రాపై అదనపు భారం పడే అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని కూడా మేనేజ్‌మెంట్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.


రజత్ లేక సర్ఫరాజ్?


సర్ఫరాజ్


పటీదార్

మిడిలార్డర్‌ను పటిష్ఠం చేసేందుకు రజత్ పటీదార్ లేక సర్ఫరాజ్‌లలో ఒకరికి అరంగేట్ర చాన్స్ దక్కవచ్చు. దేశవాళీల్లో ఇద్దరూ అత్యద్భుతంగా రాణిస్తున్నారు. రజత్ 55 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 45.97 సగటుతో 4000 పరుగులు సాధించగా, ఇందులో 12 శతకాలున్నాయి. ఒత్తిడిలోనూ తడబాటు లేకుండా బ్యాటింగ్ చేయగలడు. అంతేకాకుండా భారత్ 'ఎ' తరఫున ఇంగ్లండ్ లయన్స్‌తో వరుసగా 111, 151 పరుగులు చేయడం రాహుల్ స్థానంలో అతడిని తీసుకునేందుకు అదనపు బలం కానుంది. అటు సర్ఫరాజ్ ప్రస్థానం తక్కువేమీ కాదు. 45 మ్యాచ్‌ల్లో 69.85 సగటుతో 3912 రన్స్ సాధించాడు. ఇందులో 14 సెంచరీలుండడం విశేషం. లయన్స్‌పైనా 96, 55, 4, 161 రన్స్‌తో అదరగొట్టాడు. ఇద్దరూ స్పిన్‌ను ప్రభావవంతంగా ఎదుర్కోగలరు. అయితే భారత పిచ్‌లపై సుదీర్ఘంగా ఆడగలిగే సర్ఫరాజ్ టాలెంట్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ తక్కువగా చూడకపోవచ్చు. ఒకవేళ ఒకే పేసర్‌తో బరిలోకి దిగి స్పెషలిస్ట్ బ్యాటర్ కావాలనుకుంటే ఈ ఇద్దరికీ చాన్స్ దక్కవచ్చు. మరోవైపు గిల్, శ్రేయాస్ అయ్యర్‌ల బ్యాటింగ్ వైఫల్యం ఓవైపు జట్టును మరింతగా ఇబ్బందిపెడుతోంది. కొత్త ఆటగాళ్లు తమ సత్తా నిరూపించుకుంటే వీరికి కష్టకాలం ఆరంభమైనట్టే. అయితే పిచ్‌ను, జట్టు కాంబినేషన్‌ను బట్టి కూడా వీరి ఎంపిక ఉంటుంది.

మిగతా టెస్టులకూ విరాట్ డౌటే!



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో తొలి రెండు మ్యాచ్‌లకు వ్యక్తిగత కారణాలతో దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మిగతా టెస్టులు ఆడేది కూడా సందేహంగా మారింది. తన తల్లి లివర్ సమస్యతో బాధపడుతున్నందుకే కోహ్లీ బ్రేక్ తీసుకున్నట్టు సమాచారం. ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఈ సిరీస్‌లోని మిగిలిన మూడు టెస్టులకు కూడా కోహ్లీ దూరమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు ఇప్పటి వరకు తన రీఎంట్రీ గురించి విరాట్ నుంచి ఎటువంటి సమాచారమూ లేదని బోర్డు అధికారి సైతం పేర్కొన్నాడు. ఇప్పటికే జడేజా, రాహుల్ గాయాలతో రెండో టెస్టుకు దూరమయ్యారు. ఇందులో జడేజా గాయం కాస్త ఆందోళనకరంగానే ఉందని, అతడు మిగిలిన సిరీస్ ఆడేది కష్టమేననే వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్‌సీఏ మెడికల్ సిబ్బంది నివేదికపై బోర్డు ఓ అంచనాకు రానుంది.

విశాఖపట్నం చేరిన క్రికెటర్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్)/గోపాలపట్నం : ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి జరగనున్న టెస్ట్‌మ్యాచ్ కోసం భారత్, ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు మంగళవారం నగరానికి చేరుకున్నారు. వీరంతా హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చారు. విమానాశ్రయం నుంచి పోలీసుల భద్రత మధ్య బస్సుల్లో నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. బుధ, గురువారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొంటారు. కాగా, కోచ్ రాహుల్ ద్రవిడ్ సోమవారమే చేరుకున్నాడు.

గాయత్రి జోడీ ముందంజ

బ్యాంకాక్: థాయ్ మాస్టర్స్‌లో గాయత్రి జంట రెండో రౌండ్‌కు చేరుకొంది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట 16-21, 21-10, 21-18తో హాంకాంగ్‌కు చెందిన లి లోక్-యింగ్ యంగ్ జంటపై గెలిచింది. కాగా, మరో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో ద్వయం 21-13, 21-17తో చైనీస్ తైపీ జంట హు లింగ్ ఫాంగ్-లింగ్ జో మిన్‌పై నెగ్గింది. రెండో రౌండ్‌లో గాయత్రి జోడీతో అశ్విని జంట తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ, శంకర్ ముత్తుస్వామి మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

ముషీర్ ఆల్‌రౌండ్ షో



ముషీర్

- 214 పరుగులతో భారత్ విజయం
- న్యూజిలాండ్‌తో సూపర్-6 మ్యాచ్
- అండర్-19 వరల్డ్‌కప్

బ్లూంఫోంటీన్: సూపర్ ఫామ్‌లో ఉన్న ముషీర్ ఖాన్ (126 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 131, 2/10) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. అండర్-19 వరల్డ్ కప్ సూపర్-6లో భారత్ ఘనంగా బోణీ చేసింది. గ్రూప్-1లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 214 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 295 పరుగులు చేసింది. అరవెల్లి అవనీష్ (17) దూకుడుగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. మసన్ క్లార్క్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. కానీ, మరో ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (52)తో కలసి రెండో వికెట్‌కు 77 పరుగులు జోడించిన ముషీర్.. కెప్టెన్ ఉదయ్ సహరన్ (34)తో కలసి మూడో వికెట్‌కు 87 రన్స్ భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నాడు. అయితే, ముషీర్‌ను క్లార్క్ అవుట్ చేయడంతో.. డెత్ ఓవర్లలో టీమిండియా వేగంగా ఆడలేక పోయింది. సౌమీ పాండే (4/19) తిప్పేయడంతో.. ఛేదనలో న్యూజిలాండ్ 28.1 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే టామ్ జోన్స్ (0), స్నేహిత్ రెడ్డి (0)ని రాజ్ లింబానీ పెవిలియన్ చేర్చడంతో.. కివీస్ ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది. ఆస్కార్ జాక్సన్ (19) టాప్ స్కోరర్.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 50 ఓవర్లలో 295/8 (ముషీర్ 131, ఆదర్శ్ 52; క్లార్క్ 4/62); **న్యూజిలాండ్:** 28.1 ఓవర్లలో 81 ఆలౌట్ (జాక్సన్ 19; సౌమీ 4/19, లింబానీ 2/17, ముషీర్ 2/10).

తెలంగాణ షూటర్లకు 2 పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ షూటర్లు రెండు పతకాలు సాధించారు. చెన్నైలో జరుగుతున్న ఈ పోటీల్లో మంగళవారం ముగిసిన షాట్‌గన్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఎల్.వెంకటలక్ష్మి, బత్తుల యువేక్ జోడీ స్వర్ణం సాధించింది. ఉదయ్-వన్షిక (మధ్యప్రదేశ్) జోడీ రజతం దక్కించుకుంది. మహిళల షాట్‌గన్ స్కీట్ ఈవెంట్‌లో తెలంగాణ అమ్మాయి వెంకటలక్ష్మి కాంస్యపతకం నెగ్గింది. స్విమ్మింగ్ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో హైదరాబాద్ అమ్మాయి నిత్య రజతం సాధించింది. ఇక బాలుర 92 కిలోల రెజ్లింగ్‌లో హైదరాబాద్‌కు చెందిన గజానంద్ సింగ్ కాంస్యంతో మెరిశాడు. కాంస్య పతక పోరులో గజానంద్ 8-0తో కనియా గుజ్జర్ (రాజస్థాన్)ను చిత్తుగా ఓడించాడు.

3 కోట్ల నగదు డీఎస్పీ పోస్టు

దీప్తికి నజరానా



న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం ఇచ్చింది. ఆగ్రాకు చెందిన ఈ 26 ఏళ్ల క్రికెటర్ గత కొంతకాలంగా టీమిండియా తరఫున అద్భుతంగా ఆడుతోంది. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, దీప్తికి ఉద్యోగంతో పాటు రూ.3 కోట్లు నగదు బహుమతి ఇచ్చి, ఘనంగా సత్కరించారు.

ర్యాంకింగ్స్‌లో సంయుక్తంగా రెండో స్థానంలో దీప్తి

తాజా టీ20 ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో దీప్తి శర్మ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకొని పాకిస్థాన్ బౌలర్ సాదియా ఇక్బాల్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫియా ఎకెల్‌స్టోన్ అగ్రస్థానం నిలబెట్టుకుంది. ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో దీప్తి నాలుగో స్థానంలో ఉంది.

విమానంలో మయాంక్‌కు అస్వస్థత

ఆసుపత్రికి తరలింపు



అగర్తలా: కర్ణాటక రంజీ కెప్టెన్ మయాంక్ అగర్వాల్ హఠాత్తుగా అస్వస్థతకు గురి కావడంతో.. ఢిల్లీ వెళ్లాల్సిన విమానం నుంచి కిందకు దించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) అధికారి ఒకరు తెలిపారు. త్రిపురతో మ్యాచ్ ముగిసిన అనంతరం.. కర్ణాటక జట్టు మంగళవారం ఢిల్లీ మీదుగా సూరత్ బయల్దేరింది. అయితే, విమానంలో సీటువద్ద ఉన్న బాటిల్‌లోని పానీయాన్ని నీళ్లుగా భావించి తాగిన తర్వాత గొంతు మంట, కడుపులో అసౌకర్యంగా ఉందని అగర్వాల్ ఫిర్యాదు చేశాడట. వాంతులు కావడంతో వైద్యం కోసం అగర్తలాలోని ఐఎల్ఎస్ ఆసుపత్రిలో చేర్చారు.అప్పటికి పెదాలు వాచిపోయి, మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. కాగా కర్ణాటక జట్టు తమ తర్వాతి రంజీ మ్యాచ్‌లో రైల్వేస్‌తో శుక్రవారంనుంచి ఆడనుంది ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కర్ణాటక క్రికెట్ జట్టు మేనేజర్ త్రిపుర పోలీసులను కోరాడు.



సచివాలయంలోని మీడియా సెంటర్‌లో మాట్లాడుతున్న కొండా సురేఖ

రాడార్ కేంద్రంతో ముప్పులేదు: కొండా సురేఖ

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్‌లో వీఎల్ఎఫ్(రాడార్) ఏర్పాటుతో పర్యావరణానికి, ప్రజలకు ఎలాంటి హాని జరగబోదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. పర్యావరణంపై ప్రభావం ఉండదని నిర్ధారించుకున్న తర్వాతే ప్రభుత్వం అనుమతులను మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లోని మీడియా సెంటర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అటవీ భూములు నేవీకి బదిలీ అయ్యాయని, వీఎల్ఎఫ్ నిర్మాణానికి జీవో నెం.44 ద్వారా అనుమతులు లభించాయని తెలిపారు. రాడార్ కేంద్రం ఏర్పాటు దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారమని, ఎవరి ప్రయోజనాలకు సంబంధించింది కాదని మంత్రి స్పష్టం చేశారు.

బడ్జెట్‌లో 37 వేల కోట్లను కేటాయించండి

» ప్రభుత్వానికి నీటిపారుదలశాఖ విజ్ఞప్తి

» బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి ఉత్తమ్‌ల సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల రంగానికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.37 వేల కోట్లు కేటాయించాలని ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదించింది. మంగళవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన బడ్జెట్ ప్రతిపాదనలపై నిర్వహించిన సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఫైనాన్స్, ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు పూర్తిచేయడానికి నిర్ణయించామని, ఈ క్రమంలోనే నిధులు కేటాయించాలని మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసం చేసిన అప్పులకే రూ.14,462.15 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉందని, తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ రుణాలతో పాటు వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు మరో రూ.5 వేల కోట్ల వరకు అవసరమని ప్రతిపాదించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో ప్రాణహిత ప్రాజెక్టును పూర్తిచేయడంపై దృష్టి సారించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దీని ద్వారా మంచిర్యాల, కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. కాగా, ఇరిగేషన్‌ప్రాజెక్టుల కోసం చేసిన ఖర్చు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, పెండింగ్ పనులపై ఇంజనీర్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ప్రభుత్వాన్ని కూల్చే దమ్ముందా?: పొన్నం

సిరిసిల్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): "కేటీఆర్ నేరుగా ఎమ్మెల్యే అయ్యాడు. కేసీఆర్ పుత్రుడిగా మంత్రి పదవి పొందాడు. అధికారం పోగానే అసహనానికి గురవుతున్నాడు. ప్రభుత్వాన్ని కులుస్తామంటున్నాడు. కూల్చే దమ్ముందా? విచక్షణ కోల్పోయి మాట్లాడితే ఊర్కోం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులు కూడా కాలేదు. కేటీఆర్ అవాకులు చెవాకులు పలుకుతున్నాడు. ఆయనకు ఇంకా అహంకారం తగ్గలేదు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముస్తాబాద్‌లో పొన్నం ఆధ్వర్యంలో భారీగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారిలో జడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, ప్యాక్స్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, సర్పంచ్ దేవేందర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్‌ను ఎవరూ ఏమీ చేయలేరన్నారు.

పదేళ్లలో బీసీలు గుర్తుకురాలేదా?

» ఎమ్మెల్సీ కవితకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్న

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీ కవితకు అసెంబ్లీలో జ్యోతిబాఫూలే విగ్రహం ఏర్పాటు సంగతి ఎందుకు గుర్తుకురాలేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. విగ్రహం ఏర్పాటు చేయకుండా అప్పటి సీఎం అడ్డుకున్నారా లేక స్పీకర్ అడ్డుకున్నారా? అనేది ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీలోని గాంధీ విగ్రహం వద్ద స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కలిసి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మహనీయులను స్మరించడం గురించి తమకు ఎవరు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. జ్యోతిబాఫూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన పేర్కొన్నారు.

గ్రూప్-1 పోస్టుల ఖాళీల వివరాలివ్వండి

» అన్ని శాఖలకు ఆర్థిక శాఖ అత్యవసర ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష ఎంపిక విధానం(డైరెక్ట్ రిక్రూట్‌మెంట్)లో భర్తీ చేయాల్సిన గ్రూప్-1 పోస్టుల తాజా ఖాళీల వివరాలు ఇవ్వాలని అన్ని శాఖలను ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. వీటితో పాటు భర్తీ చేయడానికి అనుమతిస్తూ 2022 మార్చి 23న ఆర్థిక శాఖ జారీ చేసిన జీవో నెంబర్ 26కు సంబంధించిన గ్రూప్-1 పోస్టుల వివరాలు కూడా నివేదించాలని తెలిపింది. దీనిని అత్యవసరంగా భావించాలని, బుధవారం(31న) సాయంత్రం 5 గంటల లోగా వివరాలను ఆర్థిక శాఖకు పంపించాలని ఆదేశించింది.

ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని కూల్చాలా? వద్దా?

» హైకోర్టులో కొనసాగిన వాదనలు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ ఆస్పత్రి (ఓజీహెచ్) భవనాన్ని కూల్చాలా, వద్దా? అనే అంశంపై మంగళవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. అది పాతపడినందున కూల్చాలని, వారసత్వ భవనం కావడంతో కూల్చరాదంటూ వేర్వేరుగా దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఆ భవనం అవసరాలకు సరిపడే విధంగా లేనందున 1800 పడకలతో నూతన భవనం నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఆ భవనం ప్రమాదకరంగా మారిందని నిపుణుల కమిటీలు తేల్చాయని పేర్కొన్నారు. వారసత్వ భవనం కావడంతో దాన్ని కాపాడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు పాత భవనాన్ని కూల్చాలని సిఫార్సు చేయలేదని, కొత్తది నిర్మించాలని మాత్రమే సిఫార్సు చేశాయని గుర్తుచేశారు. పాత భవనాన్ని అలాగే ఉంచి కొత్త భవనాలు కట్టుకోవచ్చని పేర్కొన్నారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 12కు వాయిదా పడింది.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

» సీఎంకు బార్ కౌన్సిల్ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర బార్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్ గౌడ్, బీసీఐ మెంబర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులందరూ సచివాలయంలో మంగళవారం సీఎంతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా లాయర్ల ఆరోగ్య బీమా కోసం అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్‌కు రూ.100 కోట్లు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు స్టైఫండ్ ఇవ్వాలని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. లాయర్లకు డెత్ బెనిఫిట్ కింద ఇచ్చే మొత్తానికి అదనంగా ప్రభుత్వం నుంచి మ్యా చింగ్ గ్రాంటు ఇవ్వాలని విన్నవించారు. కాగా న్యాయవాదులకు ప్రభుత్వం తరఫున భూములు కేటాయించడం సాధ్యం కాదని సీఎం పేర్కొనట్లు తెలిసింది.

శిశువు గుండె ఘోషకు 'ప్రజావాణి' సాంత్వన!

» సాయం కోసం తీసుకొచ్చిన తల్లిదండ్రులు

» నోడల్ అధికారి దివ్య ఆదేశాలు

» స్టార్ ఆస్పత్రిలో శిశువుకు వైద్యం

బేగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ శిశువుకు 'ప్రజావాణి' సాంత్వనిచ్చింది. వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళితే రూ.4 లక్షలు ఖర్చవుతుందని నిర్వాహకులు చెప్పారు. కూలీనాలి చేసుకొని బతుకుతున్న ఆ తల్లిదండ్రులు, ఖరీదైన వైద్యం చేయించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వం ఆదుకుంటుందనే ఆశలతో వస్తే 'ప్రజాభవన్' శిశువును అక్కున చేర్చుకుంది. శిశువుకు మెరుగైన వైద్యం అందేలా అప్పటికప్పుడు చర్యలు తీసుకుంది. శుక్రవారం జియాగూడకు చెందిన సునీత, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తన 4నెలల కుమారుడిని ఎత్తుకొని ప్రజావాణికి వచ్చారు. తన బిడ్డకు పుట్టినప్పటి నుంచే గుండెకు రంధ్రం ఉందని, చికిత్స కోసం పలు ఆస్పత్రులకు వెళ్లగా రూ.4 లక్షల ఖర్చు అవుతుందని చెప్పడంతో అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో సాయం కోసం కుమారుడితో సహా శుక్రవారం ప్రజావాణికి వచ్చామని చెప్పారు.అక్కడే ఉన్న నోడల్ అధికారి దివ్యకు రోదిస్తూ సమస్యను వివరించారు. దీంతో వెంటనే స్పందించిన ఆమె చిన్నారికి అవసరమైన గుండె శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీలో చేయాలని అదేశాలు ఇవ్వడంతో పాటు స్టార్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం చిన్నారిని అంబులెన్స్‌లో పంపించారు. గుండె ఆపరేషన్ జరిగే వరకు అన్ని వివరాలు ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని అధికారు


గుండె ఆపరేషన్ కోసం ప్రజావాణికి వచ్చిన చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న అధికారులు

లను ఆదేశించారు. ఈ విషయాన్ని గమనించిన దరఖాస్తులు చేయడానికి వచ్చిన వందలాది మంది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ఇలా పలు ఆరోగ్య సమస్యలతోవచ్చిన ఆరుగురికి కార్పోరేట్ వైద్య సేవలు అందించాలని ప్రజావాణి అధికారులు ఆరోగ్య శ్రీ అధికారులను ఆదేశించడంతో వారికి మెరుగైన వైద్య సేవల కోసం కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాగా శుక్రవారం మొత్తంగా ఏడుగురు పలు అనారోగ్య సమస్యలతో ప్రజావాణికి వచ్చారు. వారందరికీ ఆరోగ్య శ్రీ కింద మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. శుక్రవారం ప్రజావాణికి 1947 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులను తీసుకుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దరఖాస్తుదారులకు భరోసా ఇచ్చారు. విద్యుత్త సంస్థలో విలీనం కాకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, తమను ఆర్టిజన్‌లుగా గుర్తించి కనీస వేతనం ఇప్పించి ఆదుకోవాలని పలువురు తెలంగాణ ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కార్మికులు ప్రజావాణిలో వినతిపత్రమిచ్చారు.

ఆగిన కోదండ ప్రమాణం!

(మొదటి పేజీ తరువాయి)



సీనియర్ న్యాయవాదులు ఆదిత్య సోంధి, మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషన్ దాఖలు చేసినప్పుడే కొత్తగా భర్తీ చేయకుండా స్టే ఇవ్వాలని తాము కోరామని గుర్తు చేశారు. ఈ పిటిషన్‌లలో తుది నిర్ణయం వెలువడే వరకు నిర్ణయం తీసుకోబోమని హామీ ఇచ్చిన గవర్నర్.. తన నిర్ణయాన్ని మార్చుకుని నూతనంగా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం సమంజసం కాదని పేర్కొన్నారు. హై కోర్టులో విషయం పెండింగ్‌లో ఉండగా సంయమనం పాటించకుండా నిర్ణయం తీసుకున్నారని తప్పుబట్టారు. ఫిబ్రవరి 8 వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోరాదన్న మర్యాదపూర్వక ఒప్పందానికి(జంటిల్మన్ అగ్రిమెంట్) విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. నియామక జీవోపై స్టే విధించడంతో పాటు ఇద్దరు నూతన ఎమ్మెల్సీలను ఇంప్లీడ్ చేయాలని కోరారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. జెంటిల్మన్ అగ్రిమెంట్ గత వాయిదా వరకే అని తాము చెప్పామన్నారు. హైకోర్టు సైతం ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని, భర్తీ ప్రక్రియను ఆపాలని చెప్పలేదని వ్యాఖ్యానించిందని గుర్తు చేశారు. గవర్నర్ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్ కుమార్ వాదనలు వినిపిస్తూ, దాసోజు శ్రవణ్, సత్యనారాయణలకు సంబంధించిన సిఫార్సులను మంత్రివర్గం వెనక్కి తీసుకుందని తెలిపారు. మంత్రివర్గం నూతన పేర్లను సిఫార్సు చేసిందని, సదరు పేర్లను గవర్నర్ క్లియర్ చేశారని చెప్పారు. ఈ మేరకు నోటిఫికేషన్ సైతం విడుదలైందని ప్రస్తావించారు. గవర్నర్ ఎదుట పాత సిఫార్సు లు పెండింగ్‌లోనే లేవన్నారు. వాటిని రాష్ట్ర క్యాబినెట్ స్వయంగా వెనక్కి తీసుకుందని చెప్పారు. ప్రతిపాదనలే పెండింగ్‌లో లేనప్పుడు ఎలా ప్రశ్నిస్తారని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తాజా పేర్లను సిఫార్సు చేయకుండా ఉండి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. అయినా, కేవలం తాము మధ్యంతర దరఖాస్తులపై మాత్రమే విచారణ చేపడుతున్నామని.. తుది విచారణ చేపట్టడం లేదని పేర్కొంది. ఈ మేరకు ఇద్దరు ఎమ్మెల్సీల నియామకాలపై స్టేటస్ కో విధిస్తున్నట్లు పేర్కొంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. కాగా ఇప్పటికే ఎమ్మెల్సీల నియామకం పూర్తి కాగా.. ప్రమాణ స్వీకారం మాత్రం వాయిదా పడనుంది.

అర్హతలు లేవని...

అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్‌లో కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయడానికి సిఫార్సు చేశారు. వారిద్దరికీ అర్హతలు లేవని గవర్నర్ ఈ ప్రతిపాదనలను తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయం చెల్లదని వారిద్దరూ హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సిఫార్సులను వెనక్కి తీసుకుని కొత్త సిఫార్సులు చేసింది. దీనికి అనుగుణంగా కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకానికి గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ నియామక జీవోను సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో మధ్యంతర పిటిషన్‌లు దాఖలు చేశారు.

పరిస్థితిని ముందే ఊహించి..

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన కోదండరాం, మీర్ అమిర్ అలీ ఖాన్‌లు ప్రమాణ స్వీకారం చేసేందుకు సోమవారం ఉదయం 11.30 గంటల శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఛాంబర్‌కు వెళ్లారు. హైకోర్టు మంగళవారం స్టేటస్ కో విధించే అవకాశం ఉందని ముందే గ్రహించి అప్రమత్తమైన ఇద్దరూ మండలిలో రెండు గంటల పాటు చైర్మన్ కోసం ఎదురు చూశారు. ఆయన రాలేదు. చైర్మన్ గొంతు నొప్పి, జ్వరం కారణంగా రాలేక పోతున్నట్లు సమాచారాన్ని పంపారని అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయ ఉద్యోగులు వెల్లడించారు. బీఆర్ఎస్ అధినాయకత్వం ఒత్తిడి మేరకే మండలి చైర్మన్ రావట్లేదన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో జరగడంతో ఆ పార్టీ ఎమ్మెల్సీలు మహేష్ కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌లు అక్కడికి చేరుకున్నారు. కోదండరాం మాత్రం తాము ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే వచ్చామని చెప్పారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రమాణం చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. అయితే, వారికి ఎలాంటి హామీ లభించలేదు. మంగళవారం హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు రావడంతో ప్రమాణం జరిగే అవకాశం లేకుండా పోయింది.

కోదండరాంపై కేసీఆర్ కుట్ర: టీజేఎస్

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ నేత కోదండరాంపైన కేసీఆర్ కుట్ర మరోసారి బహిర్గతమైందని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ మండిపడ్డారు. కోర్టులో కేసు వేసి కోదండరాం ఎమ్మెల్సీ కాకుండా అడ్డుకున్నారన్నారు. కేసీఆర్ నీచ రాజకీయాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కార్యక్రమాలు చేపట్టాలని ప్రజాస్వామిక వాదులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాసంఘాలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతిని ఆయన చట్టసభలో నిలదీస్తారన్న భయంతో కోదండరాంను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రూ.వందల కోట్లు ఖర్చు చేసి ఓడించారని ఆరోపించారు. ఈ కుట్రలకు తాము భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ అంతు చూస్తామని ధర్మార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

శివ బాలకృష్ణ సస్పెన్షన్

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్టు చేసిన శివ బాలకృష్ణను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన మెట్రోరైల్ సీజీఎంగా, తెలంగాణ రియల్‌ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్నారు. పుప్పాలగూడ సెక్రటేరియట్ కాలనీలోని ఆదిత్య ఫోర్ట్‌వ్యూ విల్లాలోని శివ బాలకృష్ణ ఇంటితోపాటు.. అతని బంధుమిత్రుల ఇళ్లు, కార్యాలయాలు.. ఇలా 14 చోట్ల ఏసీబీ అధికారులు ఇటీవల సోదాలు నిర్వహించి.. రూ.84 లక్షల నగదు, 1.8 కిలోల బంగారు ఆభరణాలను సీజ్ చేసిన విషయం తెలిసిందే..! రూ.8.26 కోట్ల ఆస్తులను గుర్తించిన ఏసీబీ.. అతని ఆదాయం కంటే రూ.7.62 కోట్ల మేర అదనపు ఆస్తులను కూడబెట్టినట్లు నిర్ధారించింది. ఈ నెల 24న శివబాలకృష్ణ అరెస్టవ్వగా.. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో.. ప్రభుత్వం అతణ్ని విధుల నుంచి తప్పించింది. కాగా.. ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు శివ బాలకృష్ణను ఎనిమిది రోజుల పాటు ఏసీబీ అధికారుల కస్టడీకి అప్పగిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఏసీబీ అధికారులు 10 రోజుల కస్టడీకి పిటిషన్ వేయగా.. న్యాయమూర్తి 8 రోజులకు అవకాశం ఇచ్చారు. కస్టడీ సమయంలో నిందితుడి తరఫు న్యాయవాది ఎదుట విచారణ జరపాలని సూచించారు. ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి శివ బాలకృష్ణను కస్టడీలోకి తీసుకోనున్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కులగణన చేపట్టి స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి పలు బీసీ సమస్యలపై చర్చించినట్లు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. కులగణన చేపడతామని సీఎం చేసిన ప్రకటన స్వాగతిస్తున్నామన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 25 నుంచి 52 శాతానికి పెంచాలని కోరారు.

పరీక్షల ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు కౌన్సెలింగ్!

» 14416 టోల్-ఫ్రీ నంబర్‌కు ఎప్పుడైనా కాల్ చేసి సహాయం పొందవచ్చు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పరీక్షల ఒత్తిడి ఎదుర్కొంటున్న విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు 24 గంటల పాటు పనిచేసే టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు. ప్రతీ జిల్లా ఆస్పత్రిలో నేరుగా సంప్రదించడానికి వైద్యులను అందుబాటులో ఉంచారు. వార్షిక పరీక్షల వేళ విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 14416, 1800914416 టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. వీటికి 24 గంటల పాటు ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చని, అవసరమైన సహాయం, కౌన్సెలింగ్ పొందవచ్చని అధికారులు తెలిపారు. అలాగే ప్రతీ జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా మానసిక వైద్యుడిని అందుబాటులో ఉంచారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆస్పత్రికి వెళ్లి ఈ వైద్యుడిని సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

రాష్ట్రంలో ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రోజుకు రెండు సెషన్లలో (మొదటిది ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండోది మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు) నిర్వహిస్తారు. ఈ ఏడాది నుంచే ప్రారంభమవుతున్న ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్‌ను ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులకే నిర్వహించనున్నారు. కాగా, రాష్ట్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 3న నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

చేయని పనులకు డబ్బా

» వంట అయ్యాక.. గంటె తిప్పుతున్నారు

» నిరుద్యోగుల దృష్టి మళ్లించేందుకే స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

» కాంగ్రెస్‌పై మాజీ మంత్రి హరీశ్ ఫైర్

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగుల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ వేస్తామని చేసుకున్న ప్రచారంపై అందరూ నిలదీస్తారనే.. హంగు, ఆర్భాటంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారని పేర్కొన్నారు. వారు చేయని పనులకు డబ్బా కొట్టుకోవడం మానేసి.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ చూపాలని హితవు పలికారు. కాంగ్రెస్ తీరు వంట అయ్యాక గంటె తిప్పినట్టుగా ఉందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే, తమ ప్రభుత్వ ఘనతగా నియామక పత్రాల జారీ పేరిట కాంగ్రెస్ హడావుడి చేస్తుండటం దౌర్భాగ్యమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్య సిబ్బంది కొరత లేకుండా ఉండేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది నియామకాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. అందులో భాగంగా 5,204 స్టాఫ్ నర్స్ పోస్టులకు 2022 డిసెంబరు 30న నోటిఫికేషన్ విడుదల చేశామని.. 2023 జూన్ 22న 1,890 పోస్టులను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగిందని తెలిపారు. 2023 ఆగస్టు 2న పరీక్ష నిర్వహించి, ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో తుది ఫలితాల విడుదలకు ఆటంకం కలిగిందని చెప్పారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు ఇచ్చే పేరిట హడావుడి చేస్తూ, స్టాఫ్ నర్స్ ఉద్యోగాల నోటిఫికేషన్ తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకుంటోందని హరీశ్ రావు విమర్శించారు. కాగా, స్టాఫ్ నర్సులుగా ఎంపికై బుధవారం నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు హరీశ్ శుభాకాంక్షలు తెలిపారు.



ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు..?

కాంగ్రెస్ హామీలను నమ్మి ఎదురుచూస్తున్న ఉద్యోగ అభ్యర్థులు, విద్యార్థులకు న్యాయం చేయాలని హరీశ్ రావు కోరారు. ఇచ్చిన హామీ ప్రకారం ఏడాది లోగా 2 లక్షల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముందే చెప్పినట్లుగా ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్, ఏప్రిల్ 1న గ్రూప్-2, జూన్ 1న గ్రూప్-3, 4 నియామకాలకు నోటిఫికేషన్, మార్చి 1న పోలీసు సహా ఇతర యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

రేపు ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణస్వీకారం

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యేగా ఫిబ్రవరి 1న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అసెంబ్లీ స్పీకర్ సమక్షంలో ఆయన ప్రమాణం చేసేందుకు ముందస్తు సమాచారం అందించారు. తుంటి శస్త్రచికిత్స అనంతరం ఇప్పటి వరకు విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్.. తొలిసారి బయటకు రానున్నారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్ఎస్‌కు చెందిన 38 మంది ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలను హాజరుకావాల్సిందిగా సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

విభజన హామీలు అమలు చేయాలి: బీఆర్ఎస్ ఎంపీలు

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విభజన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో కేంద్రప్రభుత్వ అధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఈ ఇరువురు నేతలు పాల్గొన్నారు.పెండింగ్ సమస్యలను ప్రతీ లోక్‌సభ సమావేశాల్లో ప్రస్తావించినప్పటికీ కేంద్రం అమలు చేయలేదన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పెండింగ్ నిధులు, ప్రాజెక్టులు తదితర అన్ని పెండింగ్ అంశాలపై ఈ చివరి సమావేశాల్లో తమ గళాన్ని మరింత బలంగా వినిపిస్తామని అన్నారు.

అధికారికంగా గద్దర్ జయంతి

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్/పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాగాయకుడు గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించిన జీవో కూడా విడుదల చేశామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గద్దర్ జయంతి వేడుకలను రవీంద్ర భారతీలో బుధవారం ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. గద్దర్ 76వ జయంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, బ్రోచర్‌ను గద్దర్ కుమారుడు గుమ్మడి విఠల్ సూర్యకిరణ్ తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. జయంతి వేడుకల్లో భాగంగా గద్దర్ దళం ఆట-పాట సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, 'పాటకు జీవకణం-తరగని గని' పుస్తకావిష్కరణ ఉంటుందని గద్దర్ ఫౌండేషన్ తెలిపింది. ఇక, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హెచ్ఎండీఏకు చెందిన 1076 చ.గజాల (9గుంట లు) స్థలాన్ని కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెల్లాపూర్‌లో చౌరస్తాను అనుకొని ఉన్న హెచ్ఎండీఏ స్థలం లో ఇటీవల గద్దర్ విగ్రహ ఏర్పా టుకు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే హెచ్ఎండీఏ స్థలంలో అనుమతి లేకుండా విగ్రహం ఏర్పా టు చేస్తుండడంతో అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై పలు ప్రజాసంఘాలు, స్థానికులు ఆందోళన చేపట్టగా విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీంతో ప్రభుత్వం స్పందించగా.. గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెల్లాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.323/14లో ఉన్న హెచ్ఎండీఏ పరిధిలోని 9 గుంటలను కేటాయిస్తూ మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ జీవో ఎంఎస్ నెం.6 జారీ చేశారు.



సంతాన సాఫల్య కేంద్రాలపై నిఘా

» రిజిష్టర్డ్ క్లినిక్‌ల జాబితా విడుదల

» 16 జిల్లాల్లో 261 కేంద్రాలకు అనుమతి

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్యత, సరోగసీ పేరుతో ఇష్టానుసారంగా నడుస్తున్న క్లినిక్‌లను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం అనుమతించిన సంతాన సాఫల్య కేంద్రాల జాబితాను రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తాజాగా తమ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో క్లినిక్‌లకు అనుమతులిచ్చారు. ఇందులో ఆర్ట్ బ్యాంకు (అండం, వీర్యం నిల్వ ఉంచేవి)లతో పాటు ఆర్ట్ లెవల్‌వన్ (ఐయూఐ- గర్భాశయంలో గర్భధారణ), ఆర్ట్ లెవల్ టూ (ఐవీఎఫ్-ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్), సరోగసి కేంద్రాలు ఉన్నాయి. అన్ని జిల్లాల్లో కలపి మొత్తం 261 రిజిష్టర్డ్ క్లినిక్‌లు సర్కారు నుంచి అనుమతులు పొందాయి. ఇందులో 36 సరోగసి కేంద్రాలుండగా, 42 ఆర్ట్ బ్యాంకులు, 132 ఆర్ట్ లెవల్ టూ కేంద్రాలు, 51 ఆర్ట్ లెవల్ వన్ కేంద్రాలు ఉన్నాయి. కాగా ఆయా జిల్లాల పరిధిలో ఏయే కేంద్రాలకు అనుమతులు ఉన్నాయో తెలుసుకునేందుకు ఆరోగ్యశాఖ వెబ్‌సైట్ chfw.telangana.gov.in/surrogacy.htmlను సంప్రదించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

రిజిష్టర్డ్ కేంద్రాల్లోనే సరైన చికిత్స

ప్రస్తుతం సంతానలేమి సమస్య తీవ్రంగా ఉంది. దంపతులు ప్రభుత్వం గుర్తించిన రిజిష్టర్డ్ క్లినిక్‌లలోనే వైద్యం చేయించుకోవడం ఉత్తమం. వాటిని జాతీయ ఆరోగ్య మిషన్ ఎండీ పరిధిలోని బృందాలు తనిఖీ చేస్తాయి. అక్కడ సరోగసి చేయించుకునే ప్రతి కేసును ఆ బృందాలు పరిశీలిస్తాయి. బంధుత్వంలో ఉన్న సరోగసికే అనుమతిస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే సరోగసి ముసుగులో జరిగే వ్యాపారాలకు అడ్డుకట్ట పడుతుంది.

\- డాక్టర్ వెల్లంకి జానకి (ప్రొఫెసర్ గైనకాలజీ, నోడల్ ఆఫీసర్, ఇన్‌ఫర్టిలిటీ, గాంధీ ఆస్పత్రి)

అనుమతి లేని కేంద్రాల వివరాలు ఇవ్వండి

సంతానలేమి దంపతులు అనుమతులున్న రిజిష్టర్డ్ క్లినిక్‌లకే వెళ్లాలి. అప్పుడే మంచి వైద్యం అందుతుంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇటువంటి కేంద్రాలను నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు. అనుమతి లేని క్లినిక్‌ల గురించి తెలిస్తే ఆ సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరుతున్నా. వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

\- ఆర్‌వీ కర్ణన్, ఐఏఎస్, కమిషనర్, కుటుంబ ఆరోగ్య సంక్షేమం

మాటిచ్చారు.. సాగర్, శ్రీశైలంను అప్పగించండి

» తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ.. 1న సమావేశం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను తమకు అప్పగించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలకు మంగళవారం లేఖ రాసింది. ఈ నెల 17న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ ప్రాజెక్టులతో పాటు వాటి పరిధిలోని 15 కాంపోనెంట్లను నెల రోజుల్లో అప్పగించడానికి తెలంగాణ, ఏపీ అంగీకారం తెలిపాయని ఆ లేఖలో గుర్తు చేసింది. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడానికి వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కాగా, శ్రీశైలం, సాగర్ అప్పగింతపై ఫిబ్రవరి 1న సమావేశం నిర్వహించనున్నట్లు బోర్డు తెలుగు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చింది. కాగా, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల రక్షణపై అధ్యయనానికి ఏర్పాటు చేసిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) కమిటీల్లో కేఆర్ఎంబీ అధికారులకు చోటు దక్కింది. సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ఆర్వీ ప్రకాశ్‌ను శ్రీశైలం పరిశీలన కమిటీకి, ఎస్ఈ గంటెల వరలక్ష్మీదేవిని నాగార్జునసాగర్ కమిటీకి నామినేట్ చేస్తూ కేఆర్ఎంబీ చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌డీఎస్ఏ సభ్యుడు వివేక త్రిపాఠి నేతృత్వంలోని కమిటీ ఫిబ్రవరి 6-8 తేదీల్లో శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించనుంది. అలాగే, ఎన్‌డీఎస్ఏ సాంకేతిక సభ్యుడు రాకేష్ కశ్యప్ నేతృత్వంలోని మరో కమిటీ ఫిబ్రవరి 13-15 తేదీల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టును పరిశీలించనుంది.

ఫిబ్రవరి 6న గోదావరి బోర్డు సమావేశం

గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం ఫిబ్రవరి 6న హైదరాబాద్‌లో జరుగనుంది. ప్రాజెక్టుల అప్పగింతతో పాటు వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలు, నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

డిస్కమ్‌ల డైరెక్టర్లుగా సీజీఎంలు

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లలో డైరెక్టర్లందరికీ ఉద్వాసన పలకడంతో వారి స్థానంలో చీఫ్ జనరల్ మేనేజర్ల(సీజీఎం)లకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)లో డైరెక్టర్(కమర్షియల్, ఐపీసీ అండ్ ఆర్ఏసీ)గా కె.రాములును, ఇక డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ, ఈఏ, డీపీఈ, అసెస్‌మెంట్)గా కె.నందకుమార్, డైరెక్టర్(ఆపరేషన్స్ అండ్ పీ అండ్ ఎంఎం)గా ఎన్.నర్సింహులు, డైరెక్టర్(ఫైనాన్స్, హెచ్ఆర్ అండ్ ఐఆర్)గా కె.సుధామాధురిని నియమిస్తూ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)లో డైరెక్టర్(ప్రాజెక్ట్స్)గా టి.సదర్‌లాల్, డైరెక్టర్(ఆపరేషన్)గా వి.మోహన్‌రావు, డైరెక్టర్(హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్)గా బి.అశోక్‌కుమార్‌ను నియమిస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త డైరెక్టర్లు వచ్చేదాకా ప్రత్యామ్నాయంగా ఈ నియామకాలు చేసినట్టు స్పష్టం చేశారు.

పర్యాటక ప్రాంతంగా రాష్ట్రపతి నిలయం !

» త్వరలో పర్యాటక శాఖతో కీలక ఒప్పందం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంను నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల జాబితాలోకి చేర్చాలని భావిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రపతి నిలయం ఉన్నతాధికారులు పర్యాటక శాఖతో త్వరలోనే ఒప్పందం చేసుకోనున్నారు. నిజానికి, ప్రతీ ఏటా రాష్ట్రపతి విడిది ముగిసిన తర్వాత కేవలం 15 రోజులు మాత్రమే రాష్ట్రపతి నిలయంలోకి సందర్శకులను అనుమతించేవారు. కానీ, గత ఏడాది నుంచి ఏడాది పొడవునా సందర్శకులను అనుమతిస్తున్నారు. ఇప్పటిదాకా వేల మంది విదేశీయులు సహా లక్ష మందికి పైగా రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. అయితే, సాంస్కృతిక, విజ్ఞాన కేంద్రమైన రాష్ట్రపతి నిలయం పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా సిద్ధం చేయాలనేది ప్రణాళిక. ఇందులో భాగంగా రాష్ట్రపతి నిలయంలోని హంపీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

ఆర్‌టీఐ కమిషనర్ల నియామకానికి ఎఫ్‌జీజీ వినతి

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్(టీఎస్ఐసీ)లో వెంటనే కమిషనర్ల నియామకం చేపట్టాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అలాగే, ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టాలని, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో సిటిజన్ చార్టర్‌ను అమలు చేయాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం కలిసిన ఎఫ్‌జీజీ బృందం వినతిపత్రాలు అందజేశారు. ఏడాదిగా టీఎస్ఐసీలో సభ్యులు లేకపోవడం వల్ల ఆర్టీఐ ద్వారా చేసుకున్న పది వేలకు పైగా అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని ఎఫ్‌జీజీ ప్రతినిధులు ఈ సందర్భంగా వివరించారు.

ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సీ జుట్టుపట్టి లాగిన కానిస్టేబుల్ సస్పెండ్

రాజేంద్రనగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ జుట్టుపట్టి లాగిన మహిళా కానిస్టేబుల్ అయేషా సస్పెండ్ అయ్యారు. ఆ సమయంలో అయేషా ఎక్కిన స్కూటీని నడిపిన మరో కానిస్టేబుల్ జ్యోతికి అధికారులు మెమో జారీ చేశారు. వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దంటూ ఈనెల 24న ఏబీవీపీ చేసిన ఆందోళనకు మద్దతుగా ఝాన్సీ వచ్చింది. అరెస్టును తప్పించుకునేందుకు ఝాన్సీ పరుగెత్తగా కానిస్టేబుళ్లు అయేషా, జ్యోతి స్కూటర్‌పై వెంబడించారు. అయేషా.. ఝాన్సీ జుట్టు పట్టుకోగా ఆమె కింద పడింది.

పోలీసుశాఖ ప్రక్షాళన

» నగర, శివార్లలో మూకుమ్మడి బదిలీలు
» అవినీతి ఆరోపణలపై సర్కార్ సీరియస్
» విచారణకు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్‌ను రంగంలోకి దింపిన రేవంత్ సర్కారు
» సైబరాబాద్‌లో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు సరెండర్
» హైదరాబాద్‌లో 52 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ
» త్వరలో బడా అధికారుల బదిలీలు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పోలీసుశాఖలో ప్రక్షాళనకు సర్కారు నడుంబిగించింది. ఆ శాఖలో మితిమీరుతున్న అవినీతిపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని చాన్నాళ్లుగా కొనసాగుతున్న అధికారుల మూకుమ్మడి బదిలీలకు శ్రీకారం చుట్టింది. గత రెండు రోజుల కిందట నగర, నగర శివార్లలో పోలీసు ఉన్నతాధికారుల అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ఏ'ఖీ'పేలు భూందాల్లో బాగా బిజీ శీర్షికన వార్త కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయంలోని పెద్దల ఆశీస్సులతో కీలకమైన స్థానాల్లో పోస్టింగ్‌లు పొందిన కొందరు అధికారులు చట్టాన్ని తమ చేతుల్లో తీసుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా వారి హవా తగ్గలేదు. పలు భూ సెటిల్మెంట్లు, దందాల్లో వీరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వీరిపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం కలకలం రేకెత్తించింది. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం తక్షణ చర్యలకు దిగింది. ఆయా మండలాలు, గ్రామాలు, మునిసిపాలిటీల పరిధిలో పోలీసు అధికారులు జోక్యం చేసుకున్న భూ వివాదాలపై నిఘా సంస్థల ద్వారా వివరాలు సేకరిస్తోంది. అవినీతి అధికారులపై స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం సేకరిస్తోంది. గత రెండు రోజులుగా ఈ విభాగాపు అధిపతులు వీరి అక్రమాలను తవ్వితీసే పనిలో ఉన్నారు. ఈ రెండు విభాగాలు ప్రాథమిక నివేదికను మంగళవారం ప్రభుత్వానికి పంపాయి. మరికొందరిపై కూడా ఇంకా విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉంటే ఈవార్త కథనం తరువాత సోమవారం సైబరాబాద్ పరిధిలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను కమిషనర్ బదిలీ చేశారు. మరో ఐదుగురు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను సరెండర్ చేశారు. తాజాగా మంగళవారం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 53 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసింది. వికారాబాద్ జిల్లాలో ఎక్సైజ్ ఎస్ఐ కోటేశ్వరరావును అవినీతి ఆరోపణలపై బదిలీ వేటు వేసింది. ఒక రిసార్ట్‌లో తనిఖీలకు అక్కడ ఉన్న వారితో దురుసుగా వ్యవహరిస్తూ హంగామా చేయడంపై ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు ఆయన్ని డిప్యూటీ కమిషనర్‌కు అటాచ్ చేశారు. రాబోయే రోజుల్లో సైబరాబాద్, రాచకొండ పరిధిలో మరికొందరు కీలక అధికారుల బదిలీలు జరగనున్నట్లు తెలిసింది.

8-10 సీట్లు గెలుచుకోవాలి

» రాష్ట్ర బీజేపీ నేతలకు ఢిల్లీ పెద్దల దిశా నిర్దేశం
» ఫిబ్రవరి తొలి వారంలో తొలి జాబితా.?
» కేటీఆర్ ఎమ్మెల్యేలను కాపాడుకో : రఘునందన్

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 8-10 సీట్లు గెలుచుకోవాలని బీజేపీ అగ్రనేతలు రాష్ట్ర నాయకులకు స్పష్టం చేశారు. బీజేపీ ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్ తదితరులు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ముఖ్యనేతలతో మంగళవారం చర్చించారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే అభ్యర్థుల జాబితా విడుదల చేయాలని సమావేశంలో అనుకున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి నుంచి ఈటల, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, నిజామాబాద్ నుంచి అర్వింద్, చేవెళ్ల నుంచి విశ్వేశ్వర్‌రెడ్డి, అదిలాబాద్ నుంచి బాపూరావు పోటీకి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జంప్!

గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్న 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేతనైతే కాపాడుకోవాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూచించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోన్న విషయం కేటీఆర్‌కు అర్థం కావడం లేదన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ మాట్లాడారు. 'కనకపు సింహాసనమున శునకము పద్యం ఎవరికి వర్తిస్తుందో ఇంటికి వెళ్లి మీ నాన్నను అడిగితే చెబుతారు' అని కేటీఆర్‌కు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ దందాలపై విచారణ జరిపించగలరా? అని సీఎం రేవంత్‌కు సవాల్ చేశారు. శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇవ్వాలని బీఆర్ఎస్‌ను డిమాండ్ చేశారు. కాగా, ఫిబ్రవరి10 నుంచి పార్లమెంటు క్లస్టర్లలో యాత్రలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలను ఐదు క్లస్టర్లుగా విభజించి కార్యక్రమాలు చేపడుతున్నారు. రాష్ట్ర పదాధికారులతో మంగళవారం రాత్రి వర్చువల్‌గా సమావేశమైన కిషన్‌రెడ్డి 5 నుంచి 8 వరకు 'పల్లెకు పోదాం' నిర్వహించాలని ఆదేశించారు.

నాలుగు జిల్లాలకు కొత్త అధ్యక్షులు..

నాలుగు జిల్లాలకు పార్టీ కొత్త అధ్యక్షులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించారు. పి. బ్రహ్మానంద్(ఆదిలాబాద్). పగడాకుల శ్రీనివాస్(నారాయణపేట), ఇ.నిశిధర్‌రెడ్డి(జయశంకర్ భూపాలపల్లి); యలమంచిలి వెంకటేశ్వరరావు(మహబూబాబాద్).

పార్లమెంటు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లు

అల్జాపూర్ శ్రీనివాస్(ఆదిలాబాద్); కొప్పు బాషా(పెద్దపల్లి); మీసాల చంద్రయ్య(కరీంనగర్); వెంకటరమణి(నిజామాబాద్); బద్దం మహిపాల్‌రెడ్డి(జహీరాబాద్); బస్వాపురం లక్ష్మీనర్సయ్య(మెదక్); గోలి మధుసూదన్‌రెడ్డి(మల్కాజ్‌గిరి); వీరెల్లి చంద్రశేఖర్(సికింద్రాబాద్); అట్లూరి రామకృష్ణ(హైదరాబాద్); అంకాపురం విష్ణువర్ధన్‌రెడ్డి(చేవెళ్ల); కె.వి.ఎల్.ఎన్.రెడ్డి(మహబూబ్‌నగర్); ఎడ్ల అశోక్‌రెడ్డి(నాగర్‌కర్నూలు); చాడ శ్రీనివాస్‌రెడ్డి(నల్లగొండ); పాపారావు(భువనగిరి); మురళీధర్‌గౌడ్(వరంగల్); వెంకటనారాయణరెడ్డి(మహబూబాబాద్); శ్రీకాంత్(ఖమ్మం).

ఇంటింటికీ నల్లా నీళ్లు..

బాధ్యత సర్పంచులకు!

పైపులైన్ల నిర్వహణ కూడా.. నీటి వనరుల నుంచి గ్రామాల వరకూ సరఫరా మిషన్ భగీరథదే

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇకపై తాగునీటి నిర్వహణ, ఇంటింటికీ నల్లా నీళ్లను అందించే బాధ్యతను సర్పంచులకు అప్పగించాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు అవసరమైన విధి విధానాలు రూపొందించాలన్నారు. తాగునీరు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్ష జరిపారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు సంబంధిత విభాగాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ అంశం ఎవరి పరిధిలోనూ లేదని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటివరకు మిషన్ భగీరథలో భాగంగా చేపట్టిన ఇంట్రా విలేజ్ వర్క్స్, ఇంటింటికీ నల్లా నీటి సరఫరాలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. జవాబుదారీతనం లేకపోతే గ్రామాల్లో తాగునీటి సమస్య పెరిగిపోతుందని, దీనిని నివారించటానికి సర్పంచులకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. నీటి వనరుల నుంచి గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సరఫరా, నల్లాలు, పైపులైన్ల నిర్వహణను మాత్రమే విడిగా సర్పంచులకు అప్పగించాలని సీఎం పేర్కొన్నారు. వచ్చే వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అసెంబ్లీ నియోజకవర్గాలకిచ్చే ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.10 కోట్లలో రూ.కోటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. గోదావరి, కృష్ణా నదుల నుంచే నీళ్లు ఇవ్వడం కాకుండా, కొత్తగా ఏర్పడిన రిజర్వాయర్లను కూడా తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. దీంతో రిజర్వాయర్ల పరిసర గ్రామాలకు తాగునీటిని తక్కువ ఖర్చుతో సరఫరా చేయవచ్చని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక్ సాగర్ లాంటి రిజర్వాయర్లన్నింటినీ తాగునీటికి వాడుకోవాలని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్, మంత్రి సీతక్క

క్షేత్రస్థాయి వాస్తవాలనే చెప్పండి

క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అదే చెప్పాలని, వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఇంటింటికీ నల్లాతో తెలంగాణలో వందశాతం తాగునీరు ఇచ్చినట్లు గత ప్రభుత్వం చెప్పుకోవటం వల్ల నష్టమే తప్ప లాభం లేకుండా పోయిందని, కేంద్రం నుంచి రావాల్సిన జల్‌జీవన్ మిషన్ నిధులు రాలేదని చెప్పారు. ఇప్పటికీ రాష్ట్రంలో చాలాచోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తండాలు, గూడేలు, అటవీ గ్రామాలకు నీళ్లు అందటం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఖానాపూర్ వెళ్లినపుడు, పలు గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు తనకు చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు, ఎన్ని హాబిటేషన్లకు తాగునీరు అందడం లేదన్న దానిపై సమగ్ర సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. సంబంధిత ఇంజినీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి పక్కాగా హాబిటేషన్ల జాబితాను రూపొందించాలన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులను రాబట్టుకునేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపాలన్నారు. నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగిసిపోనుందని, అధికారులే తాగునీటి బాధ్యతలను నిర్వహించాలన్నారు.

గ్రామాలు, హాబిటేషన్లకు కనెక్టివిటీ రోడ్లు

రాష్ట్రంలో ఇప్పటికీ రోడ్డు అనుసంధానం (కనెక్టివిటీ) లేని గ్రామాలు, ఆవాసాలకు (హాబిటేషన్లకు) రోడ్లను నిర్మించాలని సీఎం ఆదేశించారు. రోడ్డు కనెక్టివిటీ లేని 422 గ్రామ పంచాయతీలు, 3,177 ఆవాసాలకు తారురోడ్లు వేయాలని, అవసరమైతే ఉపాధి హామీ నిధులను లింక్ చేసి పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఈ బడ్జెట్లోనే అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు, పోలీసులకు యూనిఫాంలు కుట్టే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు.

సీఎంగా తొలిసారి సొంత సెగ్మెంట్‌కు రేవంత్

ఫిబ్రవరి 5న పర్యటన.. కోస్గిలో బహిరంగ సభ

కోస్గి రూరల్, జనవరి 30: ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పర్యటనకు రానున్నారు. ఫిబ్రవరి 5న ఆయన కోస్గిలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షించారు. మంగళవారం కోస్గిలో హెలిప్యాడ్ స్థలాన్ని సీఎం సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి వారు పరిశీలించారు. కాగా, ఎంతోకాలంగా తమ నాయకుడు ముఖ్యమంత్రి కావాలన్న ఈ ప్రాంత ప్రజల కల సాకారమైన వేళ తమకు ఇచ్చే హామీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మెడికల్ కళాశాల కోసం ప్రతిపాదనలు పంపారు. మరోవైపు.. ఫాక్స్‌కాన్ ఛైర్మన్, సీఈవో యంగ్ ల్యూ.. పద్మభూషణ్ అవార్డుకు ఎంపికవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ మంగళవారం లేఖ రాశారు.

పింఛనుదారులు కోరుకున్నట్లే ఆరోగ్య బీమా ప్రారంభిస్తాం: సీఎం

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛనుదారులు కోరుకుంటున్నట్లు ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభిస్తామని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను అమలు చేస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం పదవీ విరమణ పొందిన గెజిటెడ్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను సీఎం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు విని సీఎం సానుకూలంగా స్పందించారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. మోహన్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

కనీ వినీ ఎరుగని రీతిలో ఇంద్రవెల్లి సభ: టీపీసీసీ

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లిలో ఫిబ్రవరి 2న జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను కనీ వినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. దేవుడు, మతం పేరిట రాజకీయాలను చేసేవారిని గద్దె దించేలా ఈ సభ ఉంటుందన్నారు. ఇంద్రవెల్లి సభ ఏర్పాట్లపై గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన నేతలు సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడారు. ఆ రోజున సీఎం రేవంత్‌రెడ్డి.. కేస్లాపూర్ దేవాలయాన్ని సందర్శిస్తారని, కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు మొదలుపెడతారని వెల్లడించారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను కలుస్తారని చెప్పారు. తాము కడెం ప్రాజెక్టుపై నివేదికను సీఎంకు అందజేస్తామని తెలిపారు.

మైనారిటీలపై కేటీఆర్ దొంగ ప్రేమ: షబ్బీర్

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనారిటీలపై కేటీఆర్ దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మైనారిటీలకు ఏం చేశారని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మంగళవారం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో, సుప్రీం కోర్టులో ఏజీగా మైనారిటీలకు రేవంత్ ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. తనను ప్రభుత్వ సలహాదారుగా నియమించిందని చెప్పారు. రానున్న రోజుల్లో మైనారిటీలకు కాంగ్రెస్ మరిన్ని అవకాశాలను ఇస్తుందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు సీఎం రేవంత్‌రెడ్డి కాలి గోటికి కూడా సరిపోరని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించిన పశ్చిమ బెంగాల్ బీజేపీ ఎమ్మెల్యే సువేందు అధికారిపై బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు.

ఫిబ్రవరి 16న సమ్మెలో పాల్గొంటాం

» టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్రం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జాతీయ సంఘాలు నిర్వహించ తలపెట్టిన సమ్మెలో టీఎస్ఆర్టీసీ పాల్గొంటుందని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందించినట్టు యూనియన్ ప్రధానకార్యదర్శి కె.రాజిరెడ్డి తెలియజేశారు. భారతదేశ విలువైన సంస్థలను కేంద్రం కారు చౌకగా దేశ, విదేశీ సంస్థలకు కట్టబెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. అలాగే అంతర్జాతీయ ధరల అనుసంధానం పేరుతో పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడంతో ఆర్టీసీ వంటి ప్రజారవాణా సంస్థలపై మోయలేని ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. 126 రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టీసీకి కల్పించిన ప్రత్యేక హక్కులను నిర్వీర్యం చేసేలా ఎంవీ యాక్ట్ -2019 తీసుకు వచ్చారని విమర్శించారు. ఈ మేరకు కేంద్రం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ తాము కూడా సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆర్టీసీ ఎండీతో పాటు కార్మికశాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందించామని రాజిరెడ్డి పేర్కొన్నారు.

బీఆర్ఎస్ చచ్చిన పార్టీ



గాంధీభవన్‌లో జరిగిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల ఎంపికకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన ప్రదేశ్ ఎన్నికల కమిటీ.. మంగళవారం గాంధీభవన్‌లో భేటీ అయింది. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆయన మీడియాకు వెల్లడించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించామని తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించే సర్వాధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్ర ఎన్నికల కమిటీకి అప్పగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు చెప్పారు. అలాగే. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించామని, ఫిబ్రవరి 3 సాయంత్రం 5 గంటల వరకు గాంధీభవన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని చెప్పారు. జనరల్ సీట్లకు రూ.50 వేలు.. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలకు రూ.25 వేల చొప్పున దరఖాస్తు రుసుము వసూలు చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులైతే రూ.25 వేల రుసుమునే తీసుకోవాలని భేటీలో నిర్ణయించామని.. వచ్చిన దరఖాస్తులన్నీ వడపోసి జాబితాను రూపొందిస్తామని వెల్లడించారు. ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సభ్యులూ త్వరలోనే రాష్ట్ర పర్యటనకు వచ్చి దరఖాస్తులను పరిశీలించి.. కేంద్ర ఎన్నికల కమిటీకి నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 15-20 లోపల సీఈసీ సమావేశం జరిగి తెలంగాణ అభ్యర్థులపై అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు.

సిద్ధాంతపరమైన పోరాటం..

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనన్న కేటీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీకంటూ ఒక సిద్ధాంతం ఉందని.. ఆ సిద్ధాంతపరంగా బీజేపీపై పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. అట్లాంటి పార్టీ చిత్తశుద్ధిని కేటీఆర్ శంకిస్తున్నారంటే ఆయన ఆలోచన, అవగాహన ఎంతో అర్థంచేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ ఇక్కడి నుంచి నామినేషన్ వేసినట్లయితే.. ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకుంటేనే తెలంగాణ ప్రజలకు ఇక్కడి పార్టీలు గౌరవం ఇచ్చినట్లని పేర్కొన్నారు. ఆమె నామినేషన్ వేస్తే తెలంగాణ బిడ్డలు ఎవరూ పోటీ చేస్తారని తాను అనుకోవట్లేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల తనను కలిసిన అంశంపై ప్రశ్నించగా.. ప్రజా సమస్యలపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సహా ఏ ఎమ్మెల్యే తనను అపాయింట్‌మెంట్ అడిగినా ఇస్తానన్నారు. తాను అందుబాటులో లేకున్నా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అందుబాటులో ఉంటారన్నారు. బీఆర్ఎస్ దోపిడీపై విచారణ మొదలైందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విభజన హామీలపై ప్రశ్నించగా.. "వాటి గురించి ఇంతవరకూ కేసీఆర్ అడిగిందీ లేదు.. మోదీ అమలు చేసిందీ లేదు" అని ధ్వజమెత్తారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అడిగేదీ, ఇచ్చేదీ తామేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే, రాహుల్‌ను ప్రధానిని చేయాలంటే తెలంగాణలోని సీట్లన్నీ కాంగ్రెస్ పార్టీనే గెలవాలన్నారు. భద్రాచలంలోనూ రాముడు ఉన్నారన్న రేవంత్.. బీజేపీ వాళ్లు వచ్చి దర్శనం చేసుకుంటానంటే తాము ఏర్పాట్లు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ దేవుణ్ని స్వార్థరాజకీయాలకు వాడుకోదన్నారు.

60 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు?

» ఏప్రిల్ 7 లేదా 8 తేదీల్లో రాష్ట్రంలో పోలింగ్: రేవంత్

ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు మరో 60 రోజుల్లో జరిగే అవకాశం ఉందని, ఏప్రిల్ 7 లేదా 8 తేదీల్లో రాష్ట్రంలో పోలింగ్‌కు చాన్స్ ఉందన్నారు. ఫిబ్రవరి 15 కల్లా అభ్యర్థులను నిర్ణయించుకుని రంగంలో దిగడమే టార్గెట్‌గా పెట్టుకుని పని చేద్దామన్నారు. అభ్యర్థుల ఎంపికను పూర్తిగా అధిష్ఠానమే చూసుకుంటుందని, ఈమేరకు తెలంగాణకు పరిశీలకులను నియమించిందని సీఎం స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఓటమితో మతి తప్పి..

గవర్నర్ కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీలు ప్రమాణ స్వీకారం చేస్తనంటే రాజకీయ కుట్రతో వాయిదా వేయించే ప్రయత్నం చేశారు. కోదండరాం గొప్పదనం గురించి ఒకరు చెప్పాలా? తెలంగాణ సమాజంలో కోదండరాం పాత్రను టీఆర్ఎస్ ప్రశ్నిస్తున్నదంటేనే వారి భావదారిద్ర్యాన్ని అర్థం చేసుకోవాలి. బీఆర్ఎస్ పార్టీలో.. వాళ్ల దొడ్లో చెప్పులు మోసేవాళ్లను తీసుకొచ్చి కోదండరాంతో పోలుస్తున్నరు. ఓటమితో మతి స్థిమితం తప్పి ఉనికిని కాపాడుకోడానికి ఆరోపణలు చేస్తున్నరు

- సీఎం రేవంత్

మూడో సీటుకూ పోటీ చేద్దామా?

» ఫిబ్రవరిలో 3 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు
» ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశంలో చర్చ

ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న మూడు రాజ్యసభ సీట్లకూ అభ్యర్థులను నిలబెట్టాలా.. లేక పార్టీకి ఉన్న సంఖ్యాబలం ప్రకారం రెండు సీట్లలోనే పోటీ చేయాలా అనే అంశంపై మంగళవారం ప్రదేశ్ ఎన్నికల కమిటీ భేటీలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ నిర్వహించి అందులో చర్చించి ఒక స్పష్టతకు రావాలని భావించినట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, కమిటీ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఎన్ఎస్‌యూఐకి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలంటూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ప్రతిపాదించారు. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో యువతలోకి మంచి సందేశం వెళుతుందన్నారు. కాగా.. ఆశావహుల జాబితాలను పంపాలన్న ప్రదేశ్ ఎన్నికల కమిటీ సూచన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీసీసీ అధ్యక్షులు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఆశావహుల జాబితాలను పంపారు. మొత్తం 187 మంది పేర్లు రావడంతో.. తాజాగా దరఖాస్తులను స్వీకరించాలన్న నిర్ణయానికి కమిటీ వచ్చింది. దరఖాస్తులకు రుసుమునూ నిర్ణయించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి బాగా ఉందని, అన్ని స్థానాలోనూ విజయం సాధించే దిశగా ముందుకు పోవాలని దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు.

సీఆర్పీఎఫ్ క్యాంపుపై నక్సల్స్ దాడి

- ఛత్తీస్‌గఢ్‌లో.. డీఆర్‌జీ, కోబ్రా బలగాలే లక్ష్యంగా రాకెట్లు, గ్రనేడ్ లాంచర్లతో ఫైరింగ్
- ముగ్గురు పోలీసుల దుర్మరణం.. 14 మందికి గాయాలు

చింతూరు, చర్ల, జనవరి 30: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోమారు రెచ్చిపోయారు. మంగళవారం సుకుమా, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో.. కొత్తగా ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని రాకెట్‌లు, బ్యారెల్ గ్రనేడ్ లాంచర్(బీజీఎల్)తో దాడులు చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు డీఆర్‌జీ పోలీసులు మృతిచెందగా, 14మంది గాయపడ్డారు. గాయపడ్డ జవాన్లను హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు మావోయిస్టులు కూడా మృతిచెంది ఉంటారని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఈ దాడిలో మావోయిస్టు కీలక నేత హిడ్మా పాల్గొన్నట్లు అనుమానిస్తున్నామని ఆయన చెప్పారు. 2021లో ఇదే ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులపై నక్సల్స్ దాడి చేశారు. ఆ ఘటనలో సుమారు 23 మంది పోలీసులు మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం బీజాపూర్ జిల్లా పామేడులోని మూడు సీఆర్పీఎఫ్ క్యాంపులు, ధర్మారంలో నిర్మిస్తున్న కొత్త క్యాంపుపైనా వేల మంది మావోయిస్టులు మెరుపు దాడిచేశారు. ఈ ఘటనలో మావోయిస్టులు ప్రయోగించిన కొన్ని రాకెట్ లాంచర్లు పేలలేదు. అవన్నీ పేలితే భారీ విధ్వంసం జరగడంతో పాటు చాలా మంది పోలీసులు.. అక్కడ పనులు చేస్తున్న కూలీలు మృతి చెంది ఉండేవారని అధికారులు చెప్పారు. వరుస దాడులను పరిశీలిస్తే మావోయిస్టులు వ్యూహం ప్రకారం వ్యవహరిస్తున్నట్లు ఇంటలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ రెండు ఘటనలు తెలంగాణ సరిహద్దుకు సమీపంలోనే జరగడంతో తెలంగాణ పోలీసు బలగాలు అప్రమత్తమయ్యాయి.

నర్సులలో 43 శాతం ఎస్సీ, ఎస్టీలే

- 88% మహిళా నర్సులే.. మేల్‌నర్సులు 12 శాతమే
- స్టాఫ్‌నర్సుల నియామక పత్రాల అందజేత నేడే

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొత్తగా ఎంపికైన 6,956 మంది స్టాఫ్‌నర్సులలో 88 శాతం మంది మహిళలే ఉన్నారని, మగ నర్సులు కేవలం 12 శాతమే ఉన్నారని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. అలాగే ఎంపికైన వారిలో ఎస్సీలు 30.64 శాతం, ఎస్టీలు 12.81 శాతం, ఈబీసీలు 45.97 శాతం, ఓసీలు 10.58 శాతం మంది ఉన్నారని తెలిపింది. మొత్తం 7,094 స్టాఫ్‌నర్సు పోస్టులకు 40,936 దరఖాస్తులొచ్చాయని, 38,674 మంది పరీక్షకు హాజరయ్యాయరని బోర్డు తెలిపింది. రాత పరీక్షలో మెరిట్ సాధించిన వారి ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత బోర్డు ఎంపికైనవారి జాబితాను విడుదల చేసింది. జాబితాలో ఉన్నవారికి బుధవారం ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి ఎంపికైన నర్సులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపారు. అయితే ఇంత పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కార్యక్రమానికి తమకు కనీసం ఆహ్వానం పంపలేదని నర్సింగ్ ఆఫీసర్ అసోసియేషన్స్ అంటున్నాయి. పదేళ్లుగా సర్కారీ దవాఖానాల్లో ఖాళీ నర్సుల పోస్టులను భర్తీ చేయాలని పబ్లిక్ హెల్త్, టీవీవీపీ, డీఎంఈ పరిధిలోని నర్సింగ్ అసోసియేషన్లు, యూనియన్లు గత బీఆర్ఎస్ సర్కార్‌పై ఒత్తిడి తెచ్చాయి. దాంతో నియామక ప్రక్రియను గత ప్రభుత్వం చేపట్టగా ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పూర్తి చేసింది.

తెలంగాణ బీసీ హక్కుల కోసం యూపీఎఫ్

- ఫిబ్రవరి రెండో వారంలో మహాధర్నా:కవిత

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ హక్కుల కోసం ఫ్రంట్ ఏర్పాటు చేయాలన్న బీసీ, ప్రజా సంఘాల ప్రతిపాదన మేరకు పూలే యునైటెడ్ ఫ్రంట్ (యూపీఎఫ్)ను ఏర్పాటు చేసినట్లు భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. మంగళవారం ఆమె తన నివాసంలో జరిగిన సమావేశంలో యూపీఎఫ్ కార్యాచరణపై బీసీ, ప్రజా సంఘాల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ డిమాండ్ల సాధన కోసం యూపీఎఫ్ చేపట్టే ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఫిబ్రవరి రెండో వారంలో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపట్టాలని నిర్ణయించామన్నారు. అసెంబ్లీలో జ్యోతిరావు పూలే విగ్రహ సాధన కోసం ఫిబ్రవరి 5 నుంచి 10వ తేదీ వరకు అన్ని జిల్లాలతో పాటు విశ్వవిద్యాలయాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు.

డీజీపీ రవిగుప్తాను కలిసిన బీఆర్ఎస్ నేతల బృందం

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడుతున్నారని, పోలీసులు సైతం పక్షపాతంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆ పార్టీ నేతలు డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు మంగళవారం డీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. హుజూర్‌నగర్, మానకొండూరు, భూపాలపల్లి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరిగిన దాడులను డీజీపీ దృష్టికి తెచ్చారు. అక్రమ కేసులను అడ్డుకోవాలని వారు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ శివారులోని ఓ ప్రముఖ కాలేజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థి అతడు! బాగా చదివే కుర్రాడే. గంజాయి వాడకం మొదలుపెట్టిన ఆ అబ్బాయి క్రమంగా దానికి బానిసయ్యాడు. చదువు మీద శ్రద్ధ పెట్టలేక ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో అన్ని సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు అతణ్ని డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించినా ఉపయోగం లేకపోయింది. 'మత్తు'గమ్మత్తు దొరక్క... ఫ్రస్ట్రేషన్‌కు గురైన ఆ విద్యార్థి చివరికి రైలు కిందపడి ప్రాణాలు తీసుకున్నాడు. చావులోనే తన సమస్యకు పరిష్కారం వెతుక్కుని.. కన్నవారికి కడుపుకోత మిగిల్చిపోయాడు!

నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ రైతుకు కొడుకు, కూతురు ఉన్నారు. చదువు రాకపోవడం వల్ల తాను పడ్డ కష్టాలేవీ తన పిల్లలు పడకూడదన్న పట్టుదలతో ఆ రైతు తన రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లలిద్దరినీ చదివిస్తున్నాడు. కానీ.. పదో తరగతి వరకూ చదువుల్లో అందరికన్నా విన్నగా ఉన్న కొడుకు.. ఇంటర్మీడియట్‌కు వచ్చాక క్రమంగా చదువుకు దూరమయ్యాడు. ఇంటర్ రెండో సంవత్సరం ఫెయిల్ కావడం, కొడుకు ప్రవర్తనలో మార్పు రావడంతో నిలదీసిన తల్లిదండ్రులకు అసలు విషయం తెలిసింది. దీంతో కొడుకుని మత్తునుంచి బయటపడేసేందుకు ఇప్పుడో ప్రైవేటు డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు.

తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక.. స్కూల్లో తనకంటే పెద్దవారితో స్నేహం చేసి గంజాయికి బానిసైంది. ఆ అమ్మాయి ప్రవర్తనలో మార్పు రావడంతో కుటుంబసభ్యులు ఆరా తీయగా.. ఆరు నెలల నుంచి గంజాయి వాడుతున్నట్టు తెలిసింది. దీంతో వెంటనే బడి మాన్పించి, ఉమ్మడి కుటుంబంలో పెద్దల సమక్షంలో ఉంచి ఆ అమ్మాయిని గంజాయి మత్తు నుంచి బయట పడేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే కోవలో తొమ్మిదో తరగతి విద్యార్థికి తాను గంజాయి విక్రయించినట్లు ఓ కేసులో పట్టుబడ్డ నిందితుడొకడు పోలీసులకు తెలిపాడు.

..ఇలా ఒకటా రెండా! ఎన్నెన్నో కేసులు!! ఇంటర్, డిగ్రీ చదువుతున్న యువతీ యువకులే కాదు.. రాష్ట్రంలో బడి పిల్లలు సైతం గంజాయికి బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అప్పుడెప్పుడో 2016లో.. పంజాబ్‌లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోతోందన్న కథాంశంతో వచ్చిన 'ఉడ్తా పంజాబ్' సినిమా గుర్తుందా? ఇప్పుడు అదే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందంటే అతిశయోక్తి కాదేమో!

ఉడ్తా తెలంగాణ!

రాష్ట్రంలో గంజాయి విశ్వరూపం.. మత్తులో యువత.. అదే బాటలో చిన్నారులూ

(ఆంధ్రజ్యోతి-హైదరాబాద్)

అప్పటి వరకు అద్భుతంగా చదివే పిల్లలు అంతలోనే అధఃపాతాళంలోకి వెళ్తున్నారు. గంజాయి కొనడానికి డబ్బులివ్వలేదని కన్నవారినే కడతేర్చే స్థితికి చేరుకుంటున్నారు. గంజాయి దొరకడం లేదని, గంజాయి మత్తు నుంచి బయట పడలేకపోతున్నామనే వేదనతో ప్రాణాలు తీసుకుంటున్నవారి సంఖ్యా పెరుగుతోంది. బడిపిల్లల నుంచి వర్సిటీ స్టూడెంట్ల దాకా.. రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు.. వాళ్లూవీళ్లూ అనే తేడాలేకుండా ఎందరో ఈ మత్తు మహమ్మారికి బలైపోతున్నారు. గంజాయికి బానిసలై.. డబ్బుకోసం చివరికి విక్రేతలుగా మారుతున్నారు. 'సామాజిక న్యాయం, సాధికారత'పై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీసంఘం విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం తెలంగాణలో మాదక ద్రవ్యాలను వినియోగించేవారు 29 లక్షల మంది ఉన్నారు. వారిలో గంజాయి వినియోగదారులు దాదాపు 2 లక్షల మంది. ఆ రెండు లక్షల మందిలో.. 18 ఏళ్లలోపు వారు 10 వేల మంది, 18 నుంచి 75 ఏళ్లవారు 1.9 లక్షల మంది దాకా ఉన్నారు. అలాగే.. నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్) యాక్ట్ కింద రాష్ట్రంలో 2022లో 1,176 కేసులు నమోదుకాగా అందులో 1,104 కేసుల గంజాయి కేసులే.. దీన్ని బట్టి సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో టాలీవుడ్ డ్రగ్స్ కేసు విచారణ సమయంలో.. అప్పటి ఎక్సైజ్ శాఖ అధికారి అకున్ సబర్వాల్ పాఠశాల విద్యార్థులు పలువురు మత్తుకు బానిసైనట్లు గుర్తించి, చిట్టా రూపొందించారు. 2వేల మంది బడిపిల్లలు ఇలా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. చర్యలు తీసుకోవాలంటూ ఆయా పాఠశాలలకు సూచించారు. గంజాయి సులువుగా మార్కెట్‌లో దొరుకుతుండటం, తక్కువ ధర, ఎంతైనా కొనే అవకాశం ఉండడంతో దీని వినియోగం ఎక్కువగా ఉంటోంది.



అదో విష వలయం..

గంజాయి విక్రయ ముఠాలు పక్కా ప్లాన్ ప్రకారం యువత, చిన్నారుల్ని ఈ మహమ్మారి మత్తుకు అలవాటు చేస్తున్నారు. ఆ ప్రణాళికలో భాగంగా.. గంజాయి ఉపయోగించి చేసిన చాక్లెట్లను వారు తొలుత నిఘా తక్కువగా ఉండే ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులకు.. సిగరెట్ల రూపంలో తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతున్నారు. విద్యార్థులు క్రమంగా ఆ మత్తుకు అలవాటుపడి పెద్ద మొత్తంలో చాక్లెట్లు, సిగరెట్లు కొనుగోలు చేయడం మొదలుపెడతారు. ఆ సమయంలో వాటి రేట్లు పెంచేస్తారు. ఒడిసా నుంచి వచ్చిన ముగ్గురు సభ్యుల ముఠా రంగారెడ్డి జిల్లా కొత్తూరులో ఇలాంటి దందాకు పాల్పడి దొరికిపోయిన ఘటనే ఇందుకు ఒక ఉదాహరణ. వారు తొలుత గంజాయి చాక్లెట్లను పిల్లలకు ఉచితంగా ఇచ్చారు. ఆ తర్వాత ఒక్కొక్కటీ రూ.9కి అమ్మారు. పిల్లలు వాటికి బాగా అలవాటు పడ్డాక ఆ చాక్లెట్ల ధరను రూ.20 చేసేశారు. అదృష్టవశాత్తూ ఆ పిల్లలు చదివే స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వారి ప్రవర్తన చూసి, అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముఠా గుట్టు రట్టయ్యింది. అలా కాని సందర్భాల్లో.. గంజాయికి బానిసలై, కొనలేని స్థితికి చేరుకున్నవారికి సదరు విక్రేతలు డబ్బు ఆశ చూపి ప్రలోభపెట్టి, వారితోనే మార్కెట్‌లో గంజాయి విక్రయాలు జరిపిస్తున్నారు. ఇలా ఆ విషవలయంలో చిక్కుకున్నవారు.. మరింత మంది అమాయకులను అదే పద్ధతిలో అందులోకి లాగుతున్నారు. ఈ మహమ్మారిని కట్టడి చేసేందుకు పోలీసులు ఎంత తీవ్రంగా ప్రయత్నిస్తున్నా.. విక్రేతలు ఎప్పటికప్పుడు కొత్త మార్గాల్లో వాటిని రవాణా చేస్తూ.. సవాల్ విసురుతున్నారు. మహిళలను, పిల్లలను సైతం తమ రవాణాకు వాడుకుని తాము దొరక్కుండా జాగ్రత్తపడుతున్నారు.



ఆరోగ్యంపై దెబ్బ

గంజాయిలో టెట్రాహైడ్రోకానబినోల్(టీహెచ్‌సీ) అనే రసాయనంతోపాటు పదులకొద్దీ ఇతర రసాయన మిశ్రమాలుంటాయి. ఈ టీహెచ్‌సీని 'మైండ్ ఆల్టరింగ్ కెమికల్'గా వ్యవహరిస్తారు. గంజాయి తాగగానే.. తొలుత ఈ టీహెచ్‌సీ ఊపిరితిత్తుల గుండా నేరుగా రక్తప్రసరణ వ్యవస్థలోకి చేరుతుంది. రక్తం ఆ రసాయనాన్ని మెదడుకు, శరీరంలోని ఇతర కీలక అవయవాలకు చేరుస్తుంది. మెదడులోకి చేరుకున్న టీహెచ్‌సీ.. అత్యంత ముఖ్యమైన భాగాలైన హిప్పోకాంపస్, ఆర్బిటోఫ్రంటల్ కార్టెక్స్ పనితీరును దెబ్బ తీస్తుంది. ఫలితంగా



జ్ఞాపకశక్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. కొత్త జ్ఞాపకాలను ఏర్పరచుకోలేని పరిస్థితి, దేనిపైనా దృష్టి కేంద్రీకరించలేని దుస్థితి ఏర్పడతాయి. తత్ఫలితంగా కొత్తగా ఏదీ నేర్చుకోలేరు. కష్టమైన పనులు చేయలేరు. హిప్పోకాంపస్, ఆర్బిటోఫ్రంటల్ కార్టెక్స్‌తో పాటు.. మెదడులోని సెరిబెలమ్, బాసల్ గాంగ్లియా పనితీరును కూడా టీహెచ్‌సీ దెబ్బతీస్తుంది. మనం నిలబడే తీరును, బ్యాలెన్సింగ్, సమన్వయం చేసుకునే సామర్థ్యాలను, ప్రతిస్పందించే సమయాన్ని నియంత్రించే కీలక భాగాలివి. వాటి పనితీరు దెబ్బతినడం వల్ల సురక్షితంగా వాహనాన్ని నడపలేరు. సరిగ్గా నిలబడలేరు. కూర్చోలేరు. కళ్లకు మామూలు రంగులు మరింత కాంతిమంతంగా కనపడతాయి. శరీరాన్ని చురుగ్గా కదల్చలేరు. కళ్లముందు ఏవేవో కదలాడుతున్న భ్రమలు కలుగుతాయి. గంజాయి వాడకాన్ని సుదీర్ఘకాలం కొనసాగిస్తే.. 'సైకోసిస్' స్థితికి చేరుతారు. అంటే.. ఏది నిజమో, ఏది అబద్ధమో గుర్తించలేని స్థితి. వాస్తవ ప్రపంచంతో సంబంధాన్ని కోల్పోతుంటారు. తమ ముందు ఎవరూ లేకున్నా ఎవరో ఉన్నట్లు ఊహించుకుని(హాల్యుజినేషన్) వారితో మాట్లాడటం, ఏ పనినైనా బెదురు, జంకు లేకుండా చేస్తుంటారు. ఆగకుండా నవ్వుతుంటారు. ఆనందం అంచుల్లో ఉన్నట్లు ఊహించుకుంటారు. నిద్ర సమస్యలు, మూడ్ స్వింగ్స్, చేతులు, కాళ్లు వణకడం, జుట్టు ఎండిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. యుక్త వయసు వారు.. వయసు మీరినవారి లాగా కనిపిస్తుంటారు. రోగనిరోధక శక్తి బలహీనమవుతుంది. శ్వాస పీల్చుకోవడంలో కూడా సమస్యలు వస్తాయి. గొంతులో, ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోతుంది. గుండె వేగం పెరుగుతుంది. మోతాదు మించి గంజాయి వినియోగిస్తే గుండెపోటు ప్రమాదం ఉంటుంది. హృద్రోగ సమస్యలు ఉన్నవారు గంజాయిని మోతాదు మించి తాగితే మరింత ముప్పు. గర్భిణులు గంజాయి తాగితే.. పుట్టబోయే బిడ్డ మానసిక స్థితిపైనా ఆ ప్రభావం పడుతుంది. పెరిగే కొద్దీ వారిలో ప్రవర్తన పరమైన సమస్యలు బయటపడతాయి. దేనిపైనా దృష్టి కేంద్రీకరించలేరు. క్రోమోజోముల్లో లోపాలతో.. డౌన్‌సిండ్రోమ్, ఫ్రాంజిల్-ఎక్స్ సిండ్రోమ్, ఇంటెలెక్చువల్లీ

పురుషుల పునరుత్పత్తిపైనా..

గంజాయి వాడకం ప్రభావం పురుషుల సంతాన సామర్థ్యంపై దుష్ప్రభావం చూపుతుందని అధ్యయనాల్లో వెల్లడైంది. గంజాయి వల్ల వీర్యకణాల సంఖ్య 30% మేర తగ్గుతుందని, వాటి ఆకారంలో మార్పులు రావడమే కాక.. కదలికల్లో చురుకుదనం మందగిస్తుందని తేలింది. లైంగిక కోర్కెలు తగ్గి.. శృంగార సామర్థ్యం సన్నగిల్లిపోతుందని, వీర్యం నాణ్యత దెబ్బతింటుందని అమెరికాకు చెందిన యూరాలజీ అసోసియేట్స్ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. గంజాయి వ్యసనాన్ని వీడాక కూడా కొన్ని నెలలపాటు ఈ దుష్ప్రభావాలు ఉంటాయని వారు వెల్లడించారు. పునరుత్పత్తి హార్మోన్లుగా పేర్కొనే 'ల్యుటినైజింగ్ హార్మోన్' వంటివాటి పనితీరును గంజాయి దెబ్బతీయడమే ఇందుకు కారణమని పరిశోధకులు తెలిపారు. గంజాయిని దీర్ఘకాలం వాడడం వల్ల.. వీర్యం ఉత్పత్తి అయ్యే సెమినిఫెరస్ ట్యూబ్యూల్స్ దెబ్బతిని వృషణాల పరిణామం తగ్గిపోతుందని, అంగస్తంభన సమస్య కూడా ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

మత్తుపదార్థాల విషయంలో జీరో టాలరెన్స్: డీజీపీ



రాష్ట్రంలో మత్తుపదార్థాల కట్టడికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అందుకు తగ్గట్టుగా పోలీస్ వ్యవస్థ పనిచేస్తోందని డీజీపీ రవిగుప్తా తెలిపారు. మత్తు పదార్థాలు విక్రయించేవారు, అదేపనిగా వాటిని వాడేవారిపట్ల జీరో టాలరెన్స్ విధానం అనుసరిస్తున్నామని.. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పుడిప్పుడే మత్తుకు అలవాటు పడుతున్న వారిని బాధితులుగా గుర్తించి డీ ఎడిక్షన్ కేంద్రాలకు తరలిస్తామని.. మత్తుపదార్థాలను విక్రయిస్తూ ఎక్కువసార్లు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటి వరకు 59 కేసులు నమోదయ్యాయని.. 189 మందిని అరెస్టు చేసి పెద్ద మొత్తంలో మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని డీజీపీ వెల్లడించారు.

నాబార్డు వార్షిక రుణ ప్రణాళిక

రూ. 2.80 లక్షల కోట్లు!

- వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 5,099 కోట్ల కేటాయింపులు
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ. 1,29,636 కోట్లు
- స్టేట్ ఫోకస్ పేపర్ విడుదలచేసిన రాష్ట్ర మంత్రి తుమ్మల



హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాబార్డు(జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు) 2024-25 ఆర్థిక సంవత్సరం కోసం రుణ ప్రణాళికను ఖరారు చేసింది. రూ.2.80 లక్షల కోట్లతో రూపొందించిన స్టేట్ ఫోకస్ పేపర్‌ను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. మొత్తం రూ. 2.8 లక్షల కోట్లలో అత్యధికంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1,33,588 కోట్ల రుణాలు కేటాయింపులు చేశారు. ఇందులో పంటలసాగు, ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రైతులకు ఇచ్చే పంట రుణాలకు నాబార్డు రూ. 81,478 కోట్ల కేటాయింపులు చేసింది. టర్మ్ లోన్లు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.27,665 కోట్ల రుణాలు ఇవ్వాలని నాబార్డు నిర్ణయించింది. వ్యవసాయ మౌలిక వసతుల కల్పనకు రూ. 5,197 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ. 19,248 కోట్ల రుణాలు ఇవ్వాలని ఫోకస్ పేపర్‌లో పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఈ ఏడాదిలో రూ.1,29,636 కోట్ల రుణాలు ఇవ్వాలని నాబార్డు లక్ష్యంగా పెట్టుకుంది. ఎక్స్‌పోర్టు క్రెడిట్‌కు రూ. 452 కోట్లు, విద్యారంగానికి రూ. 2,706 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.10,769 కోట్లు, పునరుత్పాదకశక్తికి రూ.567 కోట్లు కేటాయించింది. నిరుటితో పోలిస్తే ఈ వార్షిక సంవత్సరంలో రుణాల లక్ష్యాన్ని నాబార్డు గణనీయంగా పెంచింది. గత ఆర్థిక సంవత్సరం(2023- 24)లో రూ.1.85 కోట్లతో నాబార్డు రుణ ప్రణాళికను రూపొందించగా ఈ సారి రూ.95 వేల కోట్లు అదనంగా కేటాయించింది. అదేక్రమంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు నిరుడు రూ.1.12 లక్షల కోట్ల రుణ కేటాయింపులు చేయగా... ఈసారి రూ. 1.33 లక్షల కోట్ల కేటాయింపులు చేయటం గమనార్హం.

ఏడాదికేడాది పెరుగుతున్న పంట రుణాలు

పంట రుణాల లక్ష్యాన్ని నాబార్డు ఏటికేడు పెంచుతూ వస్తోంది. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు ఉండగా... ఇందులో బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు తీసుకునే రైతులు సుమారు 35 లక్షల మందే ఉన్నారు. సాగుకు ఖర్చులు పెరిగిపోవటం, ప్రైవేటు వడ్డీభారం ఎక్కువ అవుతుండటం, ప్రభుత్వాలు రుణ మాఫీ ప్రకటిస్తుండటంతో క్రమంగా బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని నాబార్డు పంట రుణాల టార్గెట్, పంపిణీని కూడా క్రమంగా పెంచుతూ వస్తోంది. 2020-21 లో పంట రుణాలకు రూ. 53,223 కోట్లు కేటాయించగా, 2021-22లో రూ. 59,440 కోట్లు, 2022-23 లో రూ.67,864 కోట్లు, 2023-24 లో రూ.73,438 కోట్లు కేటాయించింది. తాజాగా 2024-25 సంవత్సరానికి రూ.81,478 కోట్లు కేటాయించింది.

బ్యాంకర్లు సహకరించాలి: తుమ్మల

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. 2024-25 వార్షిక సంవత్సరానికి నాబార్డు రూపొందించిన రుణ ప్రణాళికను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడారు. వ్యవసాయరంగంలో ఇతర రాష్ట్రాలు, దేశాలతోనే కాకుండా ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణను ముందుకు తీసుకెళ్లి, అగ్రగామిగా నిలిపే బాధ్యతను కొత్త ప్రభుత్వం తీసుకుంటుందని, ఇందుకు బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు సహకరించాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. బ్యాంకుల నుంచి రైతులు రుణాలుతీసుకునే ప్రక్రియను ఇంకా సులభతరం చేయాలని, వ్యవసాయ, అనుబంధరంగాల అభివృద్ధికి బ్యాంకర్లు ఇతోదికంగా సహకరించాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ సాగుకు రుణాలివ్వాలని, ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్లు డెయిరీ రైతులకు కూడా వ్యక్తిగత రుణాలివ్వాలని అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ... వచ్చే సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే రైతులకు ఇన్సురెన్స్ పథకంతో మేలు కలిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతు వేదికలను వినియోగంలోకి తీసుకొస్తామని, వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాబార్డు సీజీఎం సుశీల చింతల మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నాబార్డు సంపూర్ణ సహకారం అందిస్తుందని అన్నారు.



నిందితుడు, గంజాయి చాక్లెట్లను చూపుతున్న పోలీసులు

3.6 కిలోల గంజాయి చాక్లెట్ల పట్టివేత

- ఒడిసాకు చెందిన నిందితుడి అరెస్టు
- మరో కేసులో.. అరకిలో గంజాయి సీజ్

రాజేంద్రనగర్, హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి, కోకాపేట్‌లో విద్యార్థులు, కూలీలకు విక్రయించే వ్యక్తికి రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బేడీలు వేశారు. అతని నుంచి 3.6 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గంగ్ర దేవేందర్‌రావు కథనం ప్రకారం.. ఒడిసాకు చెందిన సోమ్యరాజన్ మల్లిక్ గండిపేట మండలం కోకాపేట్‌లోని రాంకీ కన్‌స్ట్రక్షన్స్ వద్ద నివసిస్తున్నాడు. ఒడిసాలోని బాలేశ్వర్ జిల్లాలో కొందరు దుండగులు గంజాయి, హష్ ఆయిల్‌తో చాక్లెట్లను తయారు చేస్తున్నారు. సోమ్యరాజన్ అక్కడి నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి, కోకాపేట్‌లో రోజు కూలీలు, విద్యార్థులకు విక్రయిస్తుంటాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ బృందం సోమవారం ఉదయం అతని ఇంటిపై దాడి చేసింది. తనిఖీల్లో సోమ్యరాజన్ ఇంట్లో వివిధ బ్రాండ్ల పేరిట ఉన్న చాక్లెట్లను సీజ్ చేశారు. వీటి బరువు 3.6 కిలోలుగా ఉంది. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అటు, సైబరాబాద్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ కావూరి కపిల్ హబ్ ప్రాంతంలో ఓ పాన్‌షాప్‌పై సంయుక్తంగా దాడి చేసిన గచ్చిబౌలి, టీ-న్యాబ్ పోలీసులు.. 560 గంజాయి చాక్లెట్లను సీజ్ చేశారు. అసోంలోని హైలక్‌వాడి ప్రాంతానికి చెందిన హిలాలుద్దీన్ మజుందార్ అనే యువకుడిని అరెస్టు చేశారు. మంగళవారం ఎక్స్‌ప్రెస్‌బీ కొరియర్ ద్వారా గంజాయి చాక్లెట్ల పార్సిల్ రావడంతో.. అతణ్ని రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతను రెండేళ్లుగా ఈ దందా చేస్తున్నట్లు గుర్తించారు. కాగా.. ఈ నెల 10న కొత్తూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురు ఒడిసా వాసులను శంషాబాద్ శాంతిభద్రతలు, ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. గతంలోనూ పటాన్‌చెరు, పాశమైలారం, ఇస్నాపూర్ ప్రాంతాల్లోని పాన్‌షాపుల్లో ఈ తరహా చాక్లెట్లను సీజ్ చేశారు. అన్ని కేసుల్లోనూ గంజాయి చాక్లెట్లు ఒడిసా నుంచి సరఫరా అయినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో.. గంజాయి చాక్లెట్ల నెట్‌వర్క్‌ను బ్రేక్ చేయడానికి టీ-న్యాబ్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఓ సమీక్షలో డ్రగ్స్, గంజాయిని కట్టడి చేయాలని.. ఈ దందా వెనక ఉన్నవారు ఎంతటివారైనా ఉపేక్షించరాదని ఆయన ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో టీ-న్యాబ్, రాష్ట్ర నార్కోటిక్ బ్యూరో పోలీసులు మూలాలను ఛేదించేందుకు ఒడిసాకు వెళ్లనున్నట్లు సమాచారం. కాగా.. ధూల్‌పేట నుంచి గంజాయి ప్యాకెట్లను తీసుకువచ్చి, రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మధుబన్ కాలనీలో విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రాహుల్‌కుమార్‌ను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 510 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

సినీ మోజులో వచ్చి..

డ్రగ్స్‌కు బానిసై

తర్వాత విక్రయంలోకి.. గుంటూరు, సైబరాబాద్‌లోనూ కేసులు

- ఆర్టిస్ట్ లావణ్య రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే విషయాలు
- 14 రోజుల రిమాండ్.. ఇతర నిందితుల కోసం విస్తృత గాలింపు



లావణ్య

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సినిమాల్లో నటించాలనే ఆసక్తితో హైదరాబాద్ వచ్చి.. మధ్యలో చదువు కొనసాగించి.. అనంతరం డ్రగ్స్‌కు బానిసై.. ఏకంగా సరఫరాదారుగా మారిందా యువతి. ఓవైపు సంగీతం పాఠాలు చెబుతూనే.. మరోవైపు డ్రగ్స్ అమ్మకం సాగించింది. పోలీసులకు చిక్కి కటకటాలపాలైంది. నగర శివారు నార్సింగిలో వెలుగులోకి వచ్చిన ఈ కేసులో రిమాండ్ రిపోర్ట్‌ను పరిశీలించగా విస్తుపోయే అంశాలున్నాయి. ఏపీలోని విజయవాడకు చెందిన మన్నె లావణ్య (32) అలియాస్ అన్విత సినీ అవకాశాల కోసం 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చింది. సోదరుడు కార్తీక్‌తో కలిసి పటాన్‌చెరులో ఉండేది. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసింది. 2014లో ఓ షార్ట్ ఫిలింలో నటిస్తుండగా శేఖర్‌రెడ్డి ద్వారా ఉనీత్‌రెడ్డి పరిచయం అయ్యాడు. సన్నిహితులుగా మారిన వీరిద్దరూ కొన్ని షార్ట్ ఫిలింలలో నటించారు. లావణ్య మ్యూజిక్ నేర్చుకుని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో పాఠాలు చెబుతోంది. కాగా, ఉనీత్‌రెడ్డితో సాన్నిహిత్యంతో జల్సాలకు అలవాటుపడింది. వరసకు సోదరుడయ్యే వ్యక్తికి చెందిన కోకాపేటలోని పావని బోలెవడ్ విల్లాకు నివాసాన్ని మార్చింది. క్రమంగా డ్రగ్స్‌కు బానిసగా మారిన లావణ్య మూడేళ్లుగా సరఫరా కూడా చేస్తోంది. ఉనీత్‌రెడ్డి బెంగళూరు, గోవా నుంచి రూ.1500కి గ్రాము చొప్పున కొని హైదరాబాద్ తరలిస్తాడు. లావణ్య, ఈ కేసులో పరారీలో ఉన్న ఇందిరతో రూ.6 వేలకు గ్రాము చొప్పున అమ్మించేవాడు. దీంతోపాటు లావణ్య, ఉనీత్‌రెడ్డి డ్రగ్స్ తీసుకునేవారు. ఈ దందాపై మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందడంతో ఆదివారం సాయంత్రం శంకర్‌పల్లి-నార్సింగి రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో లావణ్య వద్ద 4 గ్రాముల ఎండీఎంఏ దొరికింది. సినీ ఇండస్ట్రీ వారితో పాటు చాలా మంది ప్రముఖులతో లావణ్యకు పరిచయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమెకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కేసులో లావణ్యను పోలీసులు ఎ-2గా చేర్చారు. ఎ-1గా ఉనీత్‌రెడ్డిని, ఎ-3గా ఇందిర అలియాస్ ఇందును పేర్కొన్నారు. ఉనీత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారన్న విషయాన్ని పోలీసులు ఖండించారు. ఇందు కోసం గాలిస్తున్నారు. లావణ్యను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వరలక్ష్మి టిఫిన్స్ కేసులోనూ..!

లావణ్య ఏపీలోని గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో 2022లో కేసు నమోదైందని పోలీసులు రిపోర్టులో పేర్కొన్నారు. 2023లో మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఉనీత్‌రెడ్డి, లావణ్యపై మరో కేసు నమోదైంది. డ్రగ్స్ వాడుతూ ఉనీత్ దొరికిపోయాడు. అంతకుముందు వీరు డ్రగ్స్ సరఫరా చేసినట్లు అనుమానిస్తున్నారు. కస్టడీలోకి తీసుకుని విచారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. ఇప్పుడు దొరకకుంటే లావణ్య విదేశాలకు పారిపోయేదని పోలీసులు పేర్కొన్నారు. వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులో కూడా ఆమెను అనుమానితురాలుగా భావించినా ఆధారాలు లభించలేదు. లావణ్య ఫోన్ కాంటాక్టులు, ఇతర చాటింగ్స్, సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 31 జనవరి 2024

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో
పీజీ డిప్లొమాలు


హైదరాబాద్-రాజేంద్రనగర్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'రూరల్ డెవలప్‌మెంట్(గ్రామీణాభివృద్ధి)' ప్రధానాంశంగా వీటిని రూపొందించారు. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పర్సనల్ ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్‌లను తప్పనిసరిగా తెలపాలి. ప్రోగ్రామ్ మొదటి ట్రైమెస్టర్‌లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు సంస్థ స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది.

పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-రూరల్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం-ఆర్ఎం): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. క్యాట్/ ఎక్స్‌ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ఈ స్కోర్ ఆధారంగానే అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో చూపిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఆర్‌డీఎం): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** ఏడాదికి రూ.2,20,500
- **భోజన, వసతి ఖర్చులు:** ఏడాదికి రూ.1,11,000
- **కాషన్ డిపాజిట్:** రూ.10,000
- **సీట్ రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.20,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **చిరునామా:** సెంటర్ ఫర్ పీజీ స్టడీస్ అండ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030
- **వెబ్‌సైట్:** www.nirdpr.org.in



కొమెడ్‌కె యూజీఈటీ నోటిఫికేషన్

కన్సార్షియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక(కొమెడ్‌కె)- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(యూజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 400 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ని నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. సింగిల్ విండో సిస్టమ్‌ను అనుసరిస్తారు. కొమెడ్‌కెలో సభ్యత్వమున్న 190 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 20,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగాలు, పార్టిసిపేటింగ్ కళాశాలల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. బీఆర్క్ ప్రోగ్రామ్‌ను ఈ ఎగ్జామ్ నుంచి మినహాయించారు. దీనికి సంబంధించి విడిగా ప్రకటన విడుదల చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టులలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. కెమిస్ట్రీకి బదులుగా బయోటెక్నాలజీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ చదివినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్స్ ఉండవు.

కొమెడ్‌కె యూజీఈటీ2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). ఇందులో మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 60 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన సీబీఎస్ఈ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్థ 11 విభిన్న మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. వీటికోసం విడిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 1 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.1800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 12 నుంచి 16 వరకు
- **టెస్ట్ అడ్మిషన్ టికెట్(టీఏటీ) డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, గుత్తి, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, పుట్టపర్తి, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడిపత్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్
- **కొమెడ్‌కె యూజీఈటీ 2024 తేదీ:** మే 12
- **ఫైనల్ కీ విడుదల:** మే 21
- **స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 24 నుంచి
- **వెబ్‌సైట్:** www. comedk.org

ఏఐఐఏలో
పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు ఉంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ ఎగ్జామ్/కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సును ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధిస్తారు. కోర్సులో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు చివరలో థియరీ అండ్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. దీనిని హెల్త్‌కేర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్(హెచ్ఎస్ఎస్‌సీ) నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి హెచ్ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసినవారికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థలు, ఆయుర్వేదిక్ హాస్పిటల్స్, పంచకర్మ సెంటర్స్, హెల్త్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 16 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **కాషన్ డిపాజిట్:** రూ.5000
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 10
- **చిరునామా:** డైరెక్టర్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ), గౌతమ్‌పురి, సరిత విహార్, మధుర రోడ్, న్యూఢిల్లీ-110076
- **వెబ్‌సైట్:** https://aiia.gov.in



SCHOLARSHIP ALERT

The Secret of Work National Level Scholarship Test

Description: The Secret of Work National Level Scholarship Test 2024 is a competition organised by the Aaryajanani Trust (NGO) in association with Ramakrishna Math, for all youth aged between 18 and 30, regardless of qualifications or nationality.
Eligibility: Open for students aged between 18 to 30 years.
Prizes & Rewards: Up to 50,000 (one-time)
Application mode: Online applications only
Last Date to Apply: 15-02-2024
Short Url: www.b4s.in/aj/SWRN1

Narotam Sekhsaria Scholarship Programme

Description: Narotam Sekhsaria Scholarship Programme 2024 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation (a non-profit organisation set up by an endowment from Mr. Narotam Sekhsaria) to financially support meritorious Indian students who are willing to pursue higher studies from top-ranking institutions in India and abroad.
Eligibility: Open for Indian citizens under 30 (as of January 31st, 2024) who have completed or are nearing completion of their graduate degree from an accredited Indian university. Applicants must have enrolled in post-graduate degrees at top institutions in India or abroad, starting Fall 2024. Even applicants awaiting university acceptance can apply, but the scholarship is conditional upon securing admission.
Prizes & Rewards: Interest-free scholarship loan and mentorship guidance.
Last Date to Apply: 14-03-2024
Application mode: Online Only
Short Url: www.b4s.in/aj/NSP6

National Institute of Public Co-operation and Child Development Internship

Description: National Institute of Public Cooperation and Child Development Internship 2024 is an opportunity offered by the National Institute of Public Cooperation and Child Development (NIPCCD), New Delhi, for postgraduate and research students. This programme aims to familiarise interested and motivated students with the overall process of training and research in Women & Child Development schemes and programs.
Eligibility: Open for postgraduate or research students pursuing studies at various universities and recognized research institutes.
Prizes & Rewards: A monthly honorarium of up to 5,000 and other incentives
Last Date to Apply: 31-03-2024
Application mode: via email or post to: NIPCCD, Coordination Unit, 5 Siri Institutional Area, Hauz Khas New Delhi - 110016 Email ID: pu-nipccd@gov.in
Short Url: www.b4s.in/aj/NIPC1

buddy4study.com

జాబ్ కార్నర్

ఎన్‌డీఏలో గ్రూప్ 'సి' పోస్టులు

మొత్తం ఖాళీలు: 198

పుణె ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కింద పేర్కొన్న గ్రూప్ 'సి'(బ్యాక్‌లాగ్ సహా) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. లోయర్ డివిజన్ క్లర్క్: **16 పోస్టులు**
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: **1 పోస్టు**
3. డ్రాఫ్ట్స్‌మన్: **2 పోస్టులు**
4. సినిమా ప్రొజెక్షనిస్ట్-2: **1 పోస్టు**
5. కుక్: **14 పోస్టులు**
6. కంపోజిటర్-కమ్ ప్రింటర్: **1 పోస్టు**
7. సివిలియన్ మోటార్ డ్రైవర్(ఓజీ): **3 పోస్టులు**
8. కార్పెంటర్: **2 పోస్టులు**
9. ఫైర్‌మన్ : **2 పోస్టులు**
10. టీఏ- బేకర్ అండ్ కాన్ఫెక్షనర్: **1 పోస్టు**
11. టీఏ- సైకిల్ రిపేరర్: **2 పోస్టులు**
12. టీఏ- ప్రింటింగ్ మెషిన్ ఆపరేటర్: **1 పోస్టు**
13. టీఏ- బూట్ రిపేరర్: **1 పోస్టు**
14. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఆఫీస్ అండ్ ట్రెయినింగ్: **151 పోస్టులు**

వయోపరిమితి: ఎల్‌డీసీ/స్టెనోగ్రాఫర్/డ్రాఫ్ట్స్‌మన్/డ్రైవర్/ఫైర్‌మన్ పోస్టులకు 18-27 ఏళ్లు. ఇతర పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాత పరీక్ష, స్కిల్/ప్రాక్టికల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
వెబ్‌సైట్: https://ndacivrect.gov.in/

నాల్కోలో జూనియర్ ఫోర్‌మెన్

మొత్తం ఖాళీలు: 42

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(ఎన్ఏఎల్‌సీఓ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఫోర్‌మన్(షార్ట్ ఫైర్ బ్లాస్టర్): **2 పోస్టులు**
2. జూనియర్ ఫోర్‌మన్(ఓవెర్‌మన్/మైన్స్): **18 పోస్టులు**
3. జూనియర్ ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): **5 పోస్టులు**
4. జూనియర్ ఫోర్‌మన్(సర్వేయర్): **5 పోస్టులు**
5. జూనియర్ ఫోర్‌మన్(సివిల్): **2 పోస్టులు**
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్-3: **2 పోస్టులు**
7. డ్రెస్సర్ కమ్ ఫస్ట్ ఎయిడర్: **4 పోస్టులు**
8. నర్స్ గ్రేడ్-3: **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, హెచ్ఎస్సీ, డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్/మైనింగ్, మైనింగ్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 35-40 ఏళ్లు మించరాదు.
జీతం: పోస్టును అనుసరించి నెలకు రూ.29,500-రూ.1,15,000
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
దరఖాస్తు ఫీజు: రూ.100
వెబ్‌సైట్: https://nalcoindia.com

సుప్రీంకోర్టులో లా క్లర్క్‌లు

మొత్తం ఖాళీలు: 90

న్యూఢిల్లీలోని సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: లా క్లర్క్ కమ్ రీసెర్చ్ అసోసియేట్
అర్హతలు: న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రీసెర్చ్/అనలిటికల్ స్కిల్స్, రాత సామర్థ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
వయోపరిమితి: 2024 ఫిబ్రవరి 15 నాటికి 18 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.
జీతభత్యాలు: నెలకు రూ.80,000
పరీక్ష విధానం: పార్ట్-1, 2 రాత పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15
రాత పరీక్ష తేదీ: మార్చి 10
వెబ్‌సైట్: main.sci.gov.in


చిట్టిబొమ్మ



ఆశకు పోతే.. ఆనందం దక్కదు!

ఒక ఊరిలో నందనుడు అనే వ్యక్తి ఉండేవాడు. అతనికి చదువురాదు. పైగా ఏ పని చేతకాదు. ఎవరో చెబితే గేదెలు, ఆవులు కొన్నాడు. హాయిగా పాల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతనికి అత్యాశ ఎక్కువ. ప్రతి చిన్న విషయానికి ఆశపడేవాడు. గేదెలన్నీ అడవికి వెళ్లి గడ్డిమేసి ఇంటికి వచ్చి పాలిచ్చేవి. గేదెలు, ఆవులతో అతనికి మంచి పేరొచ్చింది. తగిన సొమ్ము కూడా వచ్చేది.

ఒక రోజు ఓ గేదె తప్పిపోయింది. చాలా బాధపడ్డాడు. ఆ గేదె మరుసటి రోజు ఉదయానికి ఇంటికి వచ్చేసింది. దీంతో ఏమాత్రం ఆలోచించకుండా గేదెలకు చిన్న గంటలు కట్టాలని నిర్ణయించుకున్నాడు. అన్ని గేదెలకు చిన్న గంటలు కట్టాడు. అవి ఎక్కడున్నా, ఎన్ని గేదెల్లో ఉన్నా కనుక్కునేందుకు సులువయ్యింది. తన దగ్గర ఉండే రెండు ఆవుల్లో ఓ ఆవును ఎక్కువ సొమ్ము వస్తుందనగానే అమ్మేశాడు. మిగిలిన ఆవుకు పెద్ద గంట కట్టాడు. ఆ గంట ఖరీదు రెండు వందల రూపాయలు. నాణ్యత ఎక్కువని ఆ గంటను చూస్తే అర్థమయ్యేది.



గేదెలతో పాటు నందనుడి ఆవు కొండలో మేస్తోంది. ఓ దొంగవాడు ఆ ఆవు గంటను దొంగిలించాలనుకున్నాడు. అయితే కుదరటం సులువు కాదని అర్థమైంది. నందనుడు పక్కనే ఉన్నాడు. దీంతో ఆ దొంగవాడు.. 'అయ్యా.. ఈ ఆవుకు ఉండే గంట ఎవరిది?' అని నందనుని అడిగాడు. 'ఆవు నాది. గంటనాదే' అన్నాడు. 'అవునా.. ?ఆ గంటను ఇస్తావా?' అనడిగాడు. 'ఇవ్వను' అన్నాడు నందనుడు. 'ఊరికే కాదు వెయ్యి రూపాయలు' అన్నాడు ఆ దొంగ. 'వీడెవడో పిచ్చివాడు. ఎర్రివాడు. గంటను అంత ధరకు అమ్ముతాడా?' అనుకున్నాడు మనసులో. 'అయ్యా.. మీరు ఏ దేశం వారో తెలీదు. గంట ఎంతో విలువైనదని ఇట్టే గ్రహించారు. తమరికి ఇష్టం ఉంటే పన్నెండు వందలు ఇచ్చేయండి' అన్నాడు. దొంగవాడు తటపటాయించాడు. చివరకు సరేనన్నాడు. ఆ గంటను కొనుక్కున్నాడు.

మరుసటి రోజు రాత్రి ఆ దొంగవాడు మెల్లగా వచ్చి ఆ గంటలేని ఆవును తోలుకుని వెళ్లిపోయాడు. ఆ గంటను కొన్న దొంగవాడే ఆవును దొంగిలించాడని నందనుడికి తెలీదు. దీంతో ఏమీ పట్టించుకోలేదు. పైగా ఆ గంట ఉంటే బావుండునే.. కనీసం ఆవు ఉండేదని బాధపడ్డాడు.

సరైన నీడ ఏది?




7 తేడాలను గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 217

	9		4		2		1	8
		1	9			6		
			1			3	4	
						8	6	
1				9				4
	8	5						
	5	3			9			
		8			3	9		
6	1		7		4		5	

సుడోకు - 216 సమాధానం

6	9	5	3	2	1	4	8	7
7	8	3	9	6	4	5	2	1
4	2	1	7	5	8	9	3	6
5	6	4	2	1	7	8	9	3
2	7	8	6	3	9	1	4	5
3	1	9	4	8	5	6	7	2
1	4	7	5	9	3	2	6	8
8	3	6	1	4	2	7	5	9
9	5	2	8	7	6	3	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.